



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


త్వరలో ప్రభుత్వాసుపత్రుల్లో 13 క్రిటికల్ కేర్ బ్లాకులు
- రూ.600 కోట్ల వ్యయంతో 24 సీసీబీల నిర్మాణం
- పురోగతిని సమీక్షించిన మంత్రి సత్యకుమార్

6



సత్యసాయి, కడప జిల్లాల్లో

## నేడు సీఎం చంద్రబాబు పర్యటన

- శ్రీ సత్య సాయిబాబా శత జయంత్యుత్సవాలకు హాజరు
- కడపనుంచి అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ రెండో విడత నిధులు విడుదల
- 46.85 లక్షలమంది రైతుల ఖాతాల్లోకి రూ.3,135 కోట్ల జమ

2

## 20న బిహార్‌కు సీఎం చంద్రబాబు

- నితీష్ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి లోకేష్‌తో కలిసి హాజరు
- హాజరవుతున్న ప్రధాని మోదీ, కేంద్ర కేబినెట్, ఎన్డీయే సీఎంలు



పుట్టపర్తి చేరుకున్న సీఎం చంద్రబాబు నాయుడికి స్వాగతం పలుకుతున్న కూటమి ప్రజా ప్రతినిధులు, నేతలు, అధికారులు



పుట్టపర్తిలో మంత్రి లోకేష్‌కు ఘనస్వాగతం 3



సచిన్ టెండూల్కర్‌తో మంత్రి లోకేష్ మర్యాదపూర్వక కలయిక 3

పత్తి రైతుల సమస్యలపై

## కేంద్రం సానుకూల స్పందన

- మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి
- రంగుమారిన పత్తిని కూడా సీసీఐ ద్వారా కొనాలని విజ్ఞప్తి
- మూడు ప్రధాన అంశాలను కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌కు వివరించిన మంత్రి అచ్చెన్న
- పరిష్కారానికి కేంద్రమంత్రి హామీ
- రైతులకు పూర్తి న్యాయం జరిగేలా చూస్తామని మంత్రి అచ్చెన్న భరోసా

4



## మావో అగ్రనేత హిడ్మా హతం

- ఎదురుకాల్పుల్లో మరో ఐదుగురి మృతి
- అమిత్‌షా డెడ్‌లైన్‌కు ముందే ఘటన
- మూడు జిల్లాల్లో మరో 31 మంది అరెస్టు

16

## ప్రైవేటు ఆలయాల పర్యవేక్షణకు త్వరలో చట్టం

- 18 నెలల్లోనే అనేక సంస్కరణలకు శ్రీకారం
- రూ.603 కోట్లతో 498 ఆలయాల్లో అభివృద్ధి పనులు
- దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



చంద్రబాబు నాయకత్వంలో..

## సీఐఐ సదస్సు సూపర్ హిట్

- రాష్ట్ర చరిత్రలో సువర్ణాధ్యాయానికి శ్రీకారం
- పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

5



## సాక్షులను లేపేయడంలో వైసీపీ దిట్ట

- భూమన, వైవీలను రక్షించేందుకే సతీష్ హత్య
- రవికుమార్ ప్రాణానికి వైసీపీ గూండాలతో హాని
- తక్షణమే అదుపులోకి తీసుకుని రక్షణ కల్పించాలి
- ఏపీ లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు

7

## 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ

- రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు
- ఇప్పటి వరకు 2,36,284 మెట్రిక్ టన్నుల కొనుగోలు
- గత ఏడాదితో పోలిస్తే 30 శాతం అదనం
- 560 కోట్ల 48 లక్షల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ
- పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్

4

అందరికీ అందుబాటులోకి

## యూనివర్సల్ హెల్త్ పాలసీ

- వచ్చే జనవరి 26 నుంచి అమలు
- రాష్ట్రంలోని మొత్తం 1.63 కోట్ల కుటుంబాలు బీమా పరిధిలోకి
- అందరికీ రూ.2.5 లక్షల వరకు నగదు రహిత వైద్యం
- బీపీఎల్ కుటుంబాలకు రూ.25 లక్షల వరకు ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ ద్వారా చికిత్స
- బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్

5



చైతన్యరథం

## సత్యసాయి, కడప జిల్లాల్లో

# నేడు సీఎం చంద్రబాబు పర్యటన

- శ్రీ సత్య సాయిబాబా శత జయంత్యుత్సవాలకు హాజరు
- కడపనుంచి అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ రెండో విడత నిధులు విడుదల
- 46.85 లక్షలమంది రైతుల ఖాతాల్లోకి రూ.3,135 కోట్ల జమ

అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేడు శ్రీ సత్యసాయి, కడప జిల్లాల్లో పర్యటించనున్నారు. హైదరాబాద్‌నుంచి నేరుగా మంగళవారం సాయంత్రం పుట్టపర్తికి చేరుకున్న ముఖ్యమంత్రి.. రాత్రికి అక్కడే బస చేస్తున్నారు. బుధవారం ఉదయం 9.25 నిముషాలకు పుట్టపర్తి విమానాశ్రయంలో ప్రధాని నరేంద్ర మోదీకి ఆయన స్వాగతం పలుకుతారు. అక్కడినుంచి ప్రధాని మోదీతో కలిసి శ్రీసత్య సాయిబాబా శత జయంతి వేడుకలకు హాజరవుతారు. 10 గంటలకు సాయి కుల్వంత్ హాల్లో భగవాన్ శ్రీసత్యసాయి మహా సమాధిని ఇరువురు నేతలు దర్శించుకుంటారు. అనంతరం శ్రీసత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో నిర్వహించే శతజయంత్యుత్సవాలకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు హాజరవుతారు. ప్రధాని మోదీకి వీడ్కోలు పలికిన అనంతరం 1.15 గంటలకు కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం పెండ్లిమర్రికి సీఎం చేరుకోనున్నారు. స్థానికంగా గ్రోమోర్ ఎరువుల కేంద్రాన్ని సందర్శించి.. అనంతరం రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. అక్కడే ఏర్పాటు చేసిన ప్రజావేదిక నుంచి అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ రెండో విడత నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగిస్తారు. అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం రెండో విడతలో రూ.7 వేలు చొప్పున 46,85,838మంది రైతుల ఖాతాలకు రూ.3,135 కోట్లను జమ చేయనున్నారు. ఈ ఏడాది ఆగస్టు 2న మొదటి విడతగా రూ.7 వేలను ప్రభుత్వం జమ చేసింది. నేడు రెండో విడతగా మరో రూ.7 వేల చొప్పున రైతులకు ప్రభుత్వం జమచేయనుంది. రెండు విడతల్లో మొత్తంగా రూ.6,309.44 కోట్లమేర ఆర్థిక ప్రయోజనం రైతులకు కలుగుతోంది. కార్యక్రమం అనంతరం స్థానిక కేడర్‌తో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. అక్కడినుంచి సీఎం చంద్రబాబునాయుడు బుధవారం రాత్రికి అమరావతికి చేరుకుంటారు.

పుట్టపర్తి చేరుకున్న సీఎం చంద్రబాబు నాయుడికి స్వాగతం పలుకుతున్న కూటమి ప్రజా ప్రతినిధులు, నేతలు, అధికారులు.









# 20న బిహార్‌కు సీఎం చంద్రబాబు

- నితీష్ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి లోకేష్‌తో కలిసి హాజరు
- హాజరవుతున్న ప్రధాని మోదీ, కేంద్ర కేబినెట్, ఎన్డీయే సీఎంలు

అమరావతి (చైతన్య రథం): బిహార్ ముఖ్యమంత్రిగా నితీశ్‌కుమార్ మరోసారి ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారైంది. సీఎం నితీశ్‌కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కావాలంటూ సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌లకు ఆహ్వానం అందింది. నవంబర్ 20న చంద్రబాబు, లోకేష్ బిహార్ వెళ్లనున్నారు. బిహార్ రాజధాని పాట్నాలో జరిగే సీఎం నితీశ్‌కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరవుతారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే తరఫున ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రచారం నిర్వహించడం తెలిసిందే. అనంతరం ఆ రాష్ట్ర పారిశ్రామికవేత్తలతో ఏర్పాటు చేసిన పలు సమావేశాల్లో మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సంబంధించిన వివరాలను బిహార్‌లోని పారిశ్రామికవేత్తలకు మంత్రి లోకేశ్ ఈ సందర్భంగా వివరించారు.

243 అసెంబ్లీ స్థానాలున్న బిహార్ అసెంబ్లీకి నవంబర్ 6, 11 తేదీల్లో రెండు విడతలుగా పోలింగ్ జరిగింది. ఈ ఎన్నికల ఫలితాలను నవంబర్ 14న లెక్కించారు. ఎన్నికల్లో బిహార్ ఓటరు ఎన్డీయేకు వరుసగా మరోసారి పట్టంగట్టారు. జేడీ (యూ) అధినేత నితీశ్‌కుమార్ మరోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. అందుకోసం రాజధాని పాట్నాలో ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. సీఎం నితీశ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి.. ఎన్డీయే భాగస్వామ్య పక్షాల పార్టీల అధినేతలు, మిత్ర పక్షాలతోపాటు దేశంలోని అన్ని రాష్ట్రాల సీఎంలను ఆహ్వానించారు. కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతోపాటు ఆయన కేబినెట్ సహచరులంతా హాజరువుతారని సమాచారం. సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారీఎత్తున ప్రముఖులు వస్తుండడంతో.. పాట్నాలో భారీగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.



## సచిన్ టెండూల్కర్‌తో మంత్రి లోకేష్
# మర్యాదపూర్వక కలయిక

పుట్టపర్తి (చైతన్యరథం): భగవాన్ సత్య సాయిబాబా సెంటినరీ ఉత్సవాల్లో పాల్గొనేందుకు శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి చేరుకున్న ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండూల్కర్‌ను రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సచిన్‌ను కలిసిన వారిలో రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్ ఉన్నారు.





## పుట్టపర్తిలో మంత్రి లోకేష్‌కు
# ఘనస్వాగతం



పుట్టపర్తి (చైతన్యరథం): శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్‌కు మంగళవారం పార్టీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. బుధవారం జరిగే శ్రీసత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ కార్యక్రమం కోసం ఒకరోజు ముందుగానే మంత్రి లోకేష్ పుట్టపర్తి చేరుకున్నారు. ఆయనకు విమానాశ్రయంలో టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి లోకేష్ రాత్రికి పుట్టపర్తిలోనే బస చేస్తారు.









# పత్తి రైతుల సమస్యలపై
# కేంద్రం సానుకూల స్పందన

- మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి
- రంగుమారిన పత్తిని కూడా సీసీఐ ద్వారా కొనాలని విజ్ఞప్తి
- మూడు ప్రధాన అంశాలను కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌కు వివరించిన మంత్రి
- సమస్యల పరిష్కారానికి కేంద్రమంత్రి హామీ
- రైతులకు పూర్తి న్యాయం జరిగేలా చూస్తామని మంత్రి అచ్చెన్న భరోసా

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని పత్తి రైతుల సమస్యలపై కేంద్రం సానుకూలంగా స్పందించిందని వ్యవసాయ, సహకార, పశుసంవర్ధక, మార్కెటింగ్, మత్స్య శాఖల మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు తెలిపారు. పత్తి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలంటూ గతంలో పంపిన ప్రతిపాదనలను పరిశీలించిన కేంద్రం.. వాటి పరిష్కారానికి చర్యలు ప్రారంభించిందన్నారు. గతంలో లేఖ ద్వారా సూచించిన ఆరు కీలక అంశాలపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొని మూడు అంశాల అమలు ప్రక్రియను ప్రారంభించిందన్నారు. దీనివల్ల పత్తి కొనుగోలులో ఏర్పడిన సమస్యలు పరిష్కారం వైపు సాగుతున్నాయి. కొనుగోలు కేంద్రాలు కూడా దశలవారీగా ప్రారంభమవుతున్నాయి. కొనుగోలు ప్రక్రియ మొదలయింది. అయితే మొంథా తుఫాన్ ప్రభావంతో పత్తి నాణ్యత సీసీఐ నిర్దేశించిన ప్రమాణాలకు విరుద్ధంగా ఉండటంతో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను దృష్టిలో ఉంచుకొని, మిగిలిన మూడు అంశాలపై కూడా త్వరగా నిర్ణయం తీసుకోవాలని కేంద్రాన్ని కోరాం. ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 జిన్నింగ్ మిల్లులను ఒకేసారి ప్రారంభించేలా చర్యలు తీసుకోవటం, వాతావరణం కారణంగా తేమ శాతం 12% నుండి 18% వరకు ఉన్న పత్తిని అనుపాత తగ్గింపులతో కొనుగోలు చేయడం, వర్షానికి తడిసిన, రంగు మారిన పత్తిని తగిన ధర తగ్గింపులతో కొనుగోలు చేయాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. ఈ అంశాల ప్రాధాన్యతను వివరించి, రైతులకు తక్షణ ప్రయోజనం కలిగేలా చూడాలని అభ్యర్థించినట్లు తెలిపారు. వీటిపై కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ సానుకూలంగా స్పందించారని, త్వరలో అనుకూల నిర్ణయాలు తీసుకునే అవకాశముందని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. రైతుల సమస్యలు పూర్తిగా పరిష్కారం అయ్యే వరకూ నిరంతరం సంప్రదింపులు జరుపుతూ కేంద్రం నుండి సానుకూల నిర్ణయం వచ్చేలా కృషి చేస్తాం అని మంత్రి హామీ ఇచ్చారు.



### కొనుగోలకు స్పష్టమైన మార్గదర్శకాలు

రాష్ట్రవ్యాప్తంగా 2025-26 ఖరీఫ్ సీజన్‌లో 5.39 లక్షల హెక్టార్లలో పత్తి సాగు జరిగి, సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వచ్చే అవకాశం ఉందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులు పండించిన పత్తిని కనీస మద్దతు ధరకు సీసీఐ ద్వారా కొనుగోలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించేందుకు సంబంధిత జాయింట్ కలెక్టర్ల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే విధంగా ప్రతి కొనుగోలు కేంద్రానికి జిల్లా మార్కెటింగ్ అధికారుల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. రాష్ట్రంలో 11 మార్కెట్ యార్డులతో పాటు 64 జిన్నింగ్ మిల్లులను పత్తి కొనుగోలు కేంద్రాలుగా ప్రకటించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోని 19 జిన్నింగ్ మిల్లుల ద్వారా రూ.56.59 కోట్ల విలువైన 72,240 క్వింటాళ్ల పత్తిని 2,793 మంది రైతుల నుండి కొనుగోలు చేసినట్లు చెప్పారు. అన్ని కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనప్పటికీ, అధిక తేమ శాతం, కొన్ని జిల్లాల్లో పత్తి తీతలు పూర్తిగా ప్రారంభం కాకపోవడం, అలాగే కొంతమంది రైతులు మొదటి-రెండవ తీత పత్తిని కలిపి విక్రయించాలని ఎదురు చూస్తుండటంతో, అన్ని కేంద్రాలలో కొనుగోలు పూర్తి స్థాయిలో జరగాలంటే కొంత సమయం పడుతుందని మంత్రి వివరించారు. పత్తి కొనుగోలు కోసం కపాస్ కిసాన్ యాప్, సీఎం యాప్ లలో రైతులు స్లాట్ బుకింగ్ చేసుకునేటప్పుడు గ్రామాలలో పనిచేసే వ్యవసాయ సహాయకులు (వీఏఏ) చొరవ తీసుకొని స్లాట్ బుకింగ్ చేయటంలో రైతులకు సాయపడాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు.

# 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ

- రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు
- ఇప్పటి వరకు 2,36,284 మెట్రిక్ టన్నుల కొనుగోలు
- గత ఏడాదితో పోలిస్తే 30 శాతం అదనం
- 560 కోట్ల 48 లక్షల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ
- పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్




విజయవాడ (చైతన్యరథం): రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పారదర్శకంగా ఇప్పటి వరకు 32,793 మంది రైతుల నుండి 2,36,284 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేసి దాదాపు రూ. 560 కోట్ల రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. విజయవాడలోని కానూరు సివిల్ సప్లైస్ భవన్‌లో మంగళవారం ధాన్యం కొనుగోళ్లపై ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రైతులు మాపై ఉంచిన నమ్మకం, భరోసాతో నిజాయితీగా, పారదర్శకంగా ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేస్తున్నామన్నారు. రైతులు ఆశించిన మేరకు క్షేత్ర స్థాయిలో దాదాపు 16,000 మంది సిబ్బంది ఇందుకు కృషి చేస్తుండగా.. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు నిరంతరం కొనగోళ్ల ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. దీనిలో భాగంగా ఇప్పటి వరకు 32,793 మంది రైతుల నుండి 2,36,284 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేసి రూ. 560 కోట్ల 40 లక్షలు రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. ఇది గత సంవత్సరంతో పోల్చితే 30% అదనమన్నారు. గత ఏడాది ఇదే రోజుకు 1,81,885 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా క్షేత్ర స్థాయిలో కొనుగోళ్ల ప్రక్రియ నిర్వహిస్తూ రైతాంగానికి కనీస మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకుంటోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో కొంతమంది రైతులకి, కొన్ని ప్రాంతాల్లో రైస్ మిల్లర్లకు లబ్ది చేకూర్చేలా చేసిన నిర్వాహకాలు అందరికే తెలిసినవేనన్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఇప్పటివరకు ధాన్యం అమ్మిన రైతుల సంఖ్య 36% కు పెరిగిందన్నారు. వీరిలో ఎక్కువగా చిన్న సన్నకారు రైతులు ఉన్నారని, దాదాపు 6,600 మంది కౌలు రైతులు కూడా సద్వినియోగం చేసుకోగలిగారన్నారు.

### 24 గంటల్లోనే..

గత సంవత్సరం సుమారు రూ. 12 వేల కోట్ల దాకా ధాన్యం కొనుగోలు చేసినప్పుడు 48 గంటల్లో డబ్బులు చెల్లిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెప్పిన మాట నెరవేర్చుతూ రైతుల ఖాతాల్లో నగదు చెల్లిస్తున్నామన్నారు. దేశంలోనే తొలిసారి 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్న ప్రభుత్వం తమదేనన్నారు. ఈసారి మరింత ఛాలెంజ్ గా 48 గంటలు కాకుండా 24 గంటల్లోనే రైతుల ఖాతాలో నగదు జమ చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటివరకు రూ. 560 కోట్ల 48 లక్షల మంది రైతుల ఖాతాల్లో 24 గంటల్లోనే జమ చేయడం జరిగిందన్నారు. దీనికొక ఉదాహరణగా గుంటూరు మండలంలోని పత్తిపాటి సుబ్బారావు అనే రైతు ఆయన ఖాతాలోకి రూ. 2 లక్షల 8 వేల ను 6 గంటల్లోనే జమ చేశామన్నారు. అదే విధంగా ఏలూరు జిల్లా భీమడోలు లో నీలం త్రిమూర్తులు అనే రైతు ఖాతాలోకి 5 గంటల్లోనే జమ చేశామన్నారు. గోనె సంచుల సమస్య లేకుండా 6 కోట్ల 34 లక్షల గోతాలను రైతు సహాయ కేంద్రాల్లో రైతాంగానికి అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి వాహనానికి జిపిఎస్ డివైస్ ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తున్నామన్నారు. ఈ నెల 23, 24 తేదీల్లో అల్పపీడన హెచ్చరికల నేపథ్యంలో 50 వేల టార్పాలిన్‌లు ప్రతి రైతు సహాయ కేంద్రాల్లో జిల్లా స్థాయిలో అందుబాటులో ఉంచామన్నారు. అందులో భాగంగా ఇప్పటివరకు సుమారు 19 వేల టార్పాలిన్‌లు రైతు సహాయ కేంద్రాల్లో రైతాంగానికి ఉచితంగా అందించామన్నారు. దేశంలోనే తొలిసారిగా వాట్సాప్ ద్వారా రైతాంగానికి వాళ్ళు ధాన్యాన్ని ఎక్కడ, ఏ టైమ్‌కు, ఏ రోజు, ఏ మిల్లుకి అమ్ముకోవాలనేది వాళ్ళే నిర్ణయించుకునే వెసులుబాటు కల్పించామన్నారు. ఇప్పటి వరకు దాదాపు 500 మంది రైతులు ఈ వాట్సాప్ సేవలను సద్వినియోగం చేసుకున్నారన్నారు. 73373 59375 ఈ నెంబర్ కి హాయ్ అని మెసేజ్ పెడితే ప్రాంతం, విస్తీర్ణం, పండిన ధాన్యం వివరాలన్నీ వాట్సాప్ మెసేజ్ లోనే ఆటోమేటిక్ గా వస్తాయన్నారు. ఎక్కడా ఇబ్బంది లేకుండా రైతులు ధాన్యం అమ్ముకోవడానికి ఈ ప్రక్రియ ద్వారా వీలు కలుగుతుందన్నారు. అదే విధంగా సివిల్ సప్లైస్ కార్పొరేషన్ కార్యాలయంలో 1967 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి ఇబ్బందులు, సమస్యలు తెలియజేయవచ్చన్నారు. ఈ సీజన్‌లో 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి చరిత్ర సృష్టింపచేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నామన్నారు. ఫైన్ వెరైటీ ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, మధ్యాహ్న భోజన పథకం కోసం, పాఠశాలలకు నాణ్యమైన బియ్యం అందించే విధంగా ఒక కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలియజేశారు. సమావేశంలో సివిల్ సప్లైస్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, ఎండీ ఎస్. ఢిల్లీ రావు ఉన్నారు.

## చంద్రబాబు నాయకత్వంలో..

# సీఐఐ సదస్సు సూపర్ హిట్



- రాష్ట్ర చరిత్రలో సువర్ణాధ్యాయానికి శ్రీకారం
- పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

అమరావతి (చైతన్యరథం): విశాఖ సీఐఐ సదస్సు.. రాష్ట్ర చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయానికి తెరతీసిందని రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ వంటి కొత్తగా పుట్టి.. అభివృద్ధిలో ఓనమాలు దిద్దుతున్న రాష్ట్రానికి... 613 ఒప్పందాలతో రూ.13.25లక్షల కోట్ల పెట్టుబడులు రావడం గేమ్ ఛేంజింగ్ విషయమన్నారు. యువనేత లోకేష్ యువగళంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని మాట ఇస్తే.. నేడు ఒక్క సీఐఐ సదస్సు ద్వారానే 16 లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించగలడం నిజంగా అద్భుతం. కేవలం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ చిత్తశుద్ధి, అకుంఠిత దీక్ష, నిరంతరాయంగా వారు చేసిన కృషి ఫలితమే సీఐఐ సదస్సు సూపర్ సక్సస్ అయ్యేందుకు కారణం. విశాఖ సీఐఐ సమ్మిట్ ప్రారంభం కాక ముందే 35 సంస్థలు రూ.3.65 లక్షల పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు కుదుర్చుకోవడం..సంతోషంతో పాటు ఆశ్చర్యాన్ని కలిగించింది. ఈ సదస్సు ఇంత పెద్ద ఎత్తున విజయవంతం కావడం, పక్క రాష్ట్రాలు అసూయ పడేలా పెట్టుబడులు రావడం వెనుక సీఎం చంద్రబాబు, యువనేత లోకేష్ కృషి దాగి ఉంది. ఇవి కేవలం ఏదో గాలివాటాన వచ్చిన పెట్టుబడులు ఎంత మాత్రం కాదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రతీ అడుగు, ప్రతీ సందర్భాన్ని రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయకత్వంలో మేమంతా పనిచేశాం. మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనతో నమ్మకమైన సంస్థలు, పరిశ్రమలు, భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టడం ద్వారా స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగి నిరుద్యోగానికి అడ్డుకట్ట వేయగలమనేది కూటమి ప్రభుత్వ దృఢ నమ్మకం. దీంతో తొలి రోజు నుంచి ప్రతీ రంగానికి సంబంధించి స్పష్టమైన పాలసీల రూపకల్పన, సింగిల్ విండో సిస్టమ్ ద్వారా త్వరతిగతిన అనుమతులు వంటి విధానపరమైన అంశాలపై దృష్టి సారించాం. పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రిగా రాష్ట్రంలో రహదారులు, పోర్టులు, రైల్వే, ఎయిర్ పోర్టులు వంటి మౌలిక సదుపాయాల కల్పనపై కూడా ప్రత్యేకంగా దృష్టిసారించాను. ఐదేళ్లలో ప్రతిపక్షం విధ్వంసకర విధానాలతో రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన రెన్యూ, హీరో ఫ్యూచర్స్, ఏబీసీ వంటి ప్రధాన కంపెనీలు కూడా, సీఎం చంద్రబాబు నాయకత్వంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పద్ధతులకు ఆకర్షితులై తిరిగి వెనక్కి రావడం శుభ పరిణామం. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, సహచర మంత్రులు జాతీయ స్థాయిలో, విదేశాల్లో పర్యటించడం, పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు రోడ్ షోలను నిర్వహించడం, పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని వివరించడం, గత పాలనలో రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న అపనమ్మకాన్ని తొలగించడం, ఇలా ప్రతీ అడుగు అత్యంత అప్రమత్తతో వేయడం ద్వారానే నేడు మన కల సాకారమవుతోందని మంత్రి జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు.

### అక్కసుతో నీలి మీడియా దుష్ప్రచారం

పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రిగా నేను సైతం సీఎం సూచనలతో దుబాయ్, సౌత్ కొరియాలో పర్యటించి, అక్కడ రోడ్ షో లలో పాల్గొని రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు అక్కడ కంపెనీలు, ప్రభుత్వాలతో చర్చించి వారిని ఒప్పించగలిగాను. దీంతో విశాఖ సీఐఐ సదస్సులో నా శాఖకు సంబంధించిన మారిటైమ్ బోర్డు ఒ ్పాాంణజూ లతో దాదాపు 38 సంస్థలు రూ.2..07 లక్షల కోట్ల ఒప్పందాలు చేసుకోవడం ద్వారా 3.06 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. గత 17 నెలల కాలంలో గుడ్ గవర్నన్స్, సుస్థిరమైన నాయకత్వం, దీర్ఘకాలం పాటు కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో కొనసాగుతుందనే నమ్మకమే పెట్టుబడిదారుల విశ్వాసం పెంపొందడానికి మరో ప్రధాన కారణం. ఈ క్రమంలో ప్రతిపక్షం అక్కసుతో, తన బులుగు మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నా దానిని పట్టించుకునే పరిస్థితిలో నేడు మేము లేం. ఒప్పందాలు కుదుర్చుకున్న 600 కు పైగా కంపెనీలు రాబోయే మూడేళ్లలో గ్రౌండింగ్ అయ్యి, రాష్ట్రంలో ఉత్పాదకత ప్రారంభించడమే లక్ష్యంగా మా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి జనార్దన్ రెడ్డి తెలిపారు.

### అభివృద్ధి వికేంద్రీకరణ లక్ష్యంగా..

సీఐఐ సదస్సు విశాఖలో జరిగినప్పటికీ, మెజార్టీ పెట్టుబడులు మాత్రం రాయలసీమ కేంద్రంగా రావడం.. సీమ అభివృద్ధిపై కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులన్నీ ఒకేచోట కేంద్రీకృతమై ప్రాంతీయ విభేదాలకు కారణమై రాష్ట్ర విభజనకు దారితీసిన నేపథ్యంలో, నేడు తిరిగి ఆ పరిస్థితి ఉత్పన్నం కాకూడదనే లక్ష్యంతో, అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా..వికేంద్రీకృత విధానంతో ఆయా సంస్థల స్థాపనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. మానుఫ్యాక్చరింగ్, డ్రోన్స్, రీన్యూవబుల్ ఎనర్జీ, టెక్స్‌టైల్స్ వంటి రంగాల్లో రాయలసీమ వేగంగా ఎదుగుతుండగా.. కోస్తాంధ్రలో క్వాంటం, ఆక్వా, పెట్రో కెమికల్స్, ఎడ్యుకేషన్, హెల్త్, మెడికల్, పోర్ట్ ఆధారిత పరిశ్రమలు.. ఉత్తరాంధ్రలో ఐటీ, ఏఐ, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్ రంగాలలో ప్రాధాన్యతనిస్తున్నాం. సీఐఐ సదస్సు ఫలాలు రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో నేడు ప్రతిబింబిస్తున్నాయి. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యంగా ఇప్పటికే ప్రతి నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుతో కూటమి ప్రభుత్వం వికేంద్రీకరణను చేతల్లో చేసి చూపిస్తోంది. ఈ నేపథ్యంలో నేడు మన పక్క రాష్ట్రాలతో పోటీ పడలన్నా, పెట్టుబడులు రాకతో పాటు, పారిశ్రామికాభివృద్ధి నిరంతరాయంగా కొనసాగాలన్నా.. అది మన విజనరీ లీడర్ చంద్రబాబు నాయకత్వంలోనే సాధ్యం. కాబట్టి రాష్ట్ర సుస్థిరాభివృద్ధి కోసం తపించే.. కూటమి ప్రభుత్వం దీర్ఘకాలం పాటు అధికారంలో ఉండటం ద్వారా ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి బలమైన ముద్ర పడుతుందని ప్రజలంతా విశ్వసిస్తున్నారు. దేశ వ్యాప్తంగా ఎక్కడైనా ప్రజలు అరాచకాలకు వ్యతిరేకంగా అభివృద్ధి దిశగా పనిచేసే బలమైన నాయకత్వంతోనే ఉంటారనే విషయం మరోసారి బీహార్ ఎన్నికల ఫలితాలతో రుజువయిందని మంత్రి జనార్దన్ రెడ్డి అన్నారు.

# అందరికీ అందుబాటులోకి యూనివర్సల్ హెల్త్ పాలసీ

- వచ్చే జనవరి 26 నుంచి అమలు
- రాష్ట్రంలోని మొత్తం 1.63 కోట్ల కుటుంబాలు బీమా పరిధిలోకి
- అందరికీ రూ.2.5 లక్షల వరకు నగదు రహిత వైద్యం
- బీపీఎల్ కుటుంబాలకు రూ.25 లక్షల వరకు ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ ద్వారా చికిత్స
- వైసీపీ ఆరోగ్యశ్రీలో వేర్వేరు ప్యాకేజీలు, వేర్వేరు రేట్లు.
- నేడు అన్నీ ఒకే ప్యాకేజీలో, ఒకే ప్రమాణాలతో
- బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్

అమరావతి (చైతన్యరథం): సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్య భద్రత కోసం మహత్తరమైన ప్రాజెక్టును ప్రారంభిస్తోందని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్, టీడీపీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్ కుమార్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి హెల్త్ ఇన్సూరెన్స్ అందించే యూనివర్సల్ హెల్త్ పాలసీని అమలు చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఆరోగ్య రక్షణకు నూతన ప్రమాణాలు నెలకొల్పుతోందన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నీలాయపాలెం విజయ్ కుమార్ మాట్లాడుతూ...ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కొనసాగుతూనే.. ఇప్పుడు పేద-మధ్యతరగతి-ధనిక అనే తేడా లేకుండా రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఈ కొత్త బీమా పథకం కిందకు వస్తుందని వివరించారు. వచ్చే ఏడాది జనవరి 2026 నుండి ఈ పథకం అమల్లోకి వస్తుంది. ఈ యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా మొత్తం 1.63 కోట్ల కుటుంబాలకు మేలు కలుగుతుంది. ఇది కేవలం పేదలకే (బీపీఎల్) కాకుండా, దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్న (ఏపీఎల్) మధ్యతరగతి, ధనిక కుటుంబాలకు కూడా వర్తిస్తుంది. ఈ విషయంలో సాక్షి పత్రిక రాస్తున్న చెత్త కథనాలతో కొందరు అయోమయానికి గురవుతున్నారు. అందుకే ఇంత వివరణ ఇవ్వాల్సి వస్తోంది. యూనివర్సల్ హెల్త్ కవరేజ్‌లో మొత్తం 1.63 కోట్ల కుటుంబాల్లో (1.43 కోట్ల బీపీఎల్, 20 లక్షల ఏపీఎల్) సుమారు 5.3 కోట్ల వ్యక్తులకు ఆరోగ్య భద్రత లభిస్తుంది. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (9 లక్షల ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలు), వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ కింద ఉన్న వారు మినహా అందరికీ రూ. 2.5 లక్షల బీమా కవరేజ్, బీపీఎల్ కుటుంబాలయితే రూ.25 లక్షల కవరేజ్ వస్తుంది. ఆదాయంతో సంబంధం లేకుండా ప్రతి కుటుంబానికి మొదటగా రూ.2.5 లక్షల ఆరోగ్య/హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజ్ వస్తుంది. ఎన్టీఆర్ వైద్య సేవ పరిధిలోని బీపీఎల్ కుటుంబాలకు ఇప్పటికే అమల్లో ఉన్న 25 లక్షల రూపాయల వైద్య చికిత్స పరిమితి యథావిధిగా కొనసాగుతుంది. ఈ పథకంలో రూ.5 లక్షల లోపు వార్షికాదాయం ఉన్న పేద కుటుంబాలకు (బీపీఎల్).. ఏడాదికి రూ.2.50 లక్షల వరకు బీమా సంస్థ ద్వారా



నగదు రహిత వైద్యం అందుతుంది. రూ.2.50 లక్షల పైబడి రూ.25 లక్షల వరకు అయ్యే వ్యయాన్ని డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ భరిస్తుంది. రాష్ట్రంలోని 1.43 కోట్ల బీపీఎల్ కుటుంబాలకు ఆరోగ్య సమస్యలు వస్తే ఎంప్యానెల్ చేసిన 2500 కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత విధానంలో నేరుగా చికిత్స పొందవచ్చు. కూటమి ప్రభుత్వంలో మొదటిసారిగా దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న 20 లక్షల ఏపీఎల్ కుటుంబాలకు హెల్త్ ఇన్సూరెన్స్ లభించనుంది. ఇప్పటి వరకు తమ సొంత డబ్బులు పెట్టుకొని హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకుంటున్న 20 లక్షల పై చిలుకు ఏపీఎల్ కుటుంబాలు ఇక నుంచి రూ.2.5 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజ్ పొందవచ్చు. దీనికి ఏ విధమైన ముందస్తు అనుమతులు అవసరం లేదు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,493 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లోని 31 సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో ఈ సేవలు అందుబాటులో ఉంటాయని విజయ్ కుమార్ వివరించారు.

### సకాలంలో, నాణ్యమైన వైద్యం అందేలా..

వైఎస్సార్‌సీపీ పాలనలో ఆరోగ్యశ్రీ పేరుతో వేర్వేరు ప్యాకేజీల్లో వైద్యం ఇచ్చి ప్రజలను గందరగోళానికి గురిచేశారు. కానీ కూటమి ప్రభుత్వం అన్నింటినీ ఒకే ప్యాకేజీ కిందకి తీసుకువచ్చి, అందరికీ సకాలంలో నాణ్యమైన వైద్యసేవలు అందేలా వ్యవస్థను రూపొందించింది. కొన్ని సేవలను అన్ని ఆసుపత్రుల్లో అందేలా, కొన్ని సేవలను ప్రభుత్వ ఆసుపత్రులకు మాత్రమే కేటాయించేలా, అత్యంత అరుదైన ఆపరేషను, చికిత్సలను ట్రస్ట్ పరిధిలో ఉంచేలా సమర్థవంతమైన రేషనలైజేషన్ చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల సామర్థ్యం మేరకు కొన్ని ప్రక్రియలను పునర్వ్యవస్థీకరించారు. కొన్ని ప్రత్యేక శస్త్ర చికిత్సలను ప్రభుత్వ బోధనాసుపత్రులకు పరిమితం చేశారు. విద్య, శిక్షణ ప్రయోజనాల కోసం, ప్రైవేట్ ఆసుపత్రుల్లో దుర్వినియోగాన్ని నివారిస్తూ, ప్రభుత్వ వైద్య విద్య, పరిశోధనా సంస్థలను బలోపేతం చేసేందుకు ఈ చర్య తీసుకోవాల్సి వచ్చింది. ఈ మార్పుల వల్ల ప్రస్తుత లబ్ధిదారులకు ఎలాంటి నష్టం లేదు. ఆరోగ్యశ్రీ ఉద్యోగుల ఉద్యోగ భద్రత కూడా కొనసాగుతుంది. వారు అదే ఇన్సూరెన్స్ సంస్థల్లో, అదే వేతనంతో పనిచేస్తారని విజయ్ కుమార్ తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవలో ఇప్పటికే ఉన్న 3,257 వ్యాధులు కొత్త పథకంలో కవర్ అవుతాయి. దేనినీ తొలగించలేదు.

పాలసీ నిర్వహణకు రాష్ట్రాన్ని రెండు జోన్‌లుగా విభజించి అమలు చేస్తున్నారు. జోన్-1: శ్రీకాకుళం నుండి ఎన్టీఆర్ జిల్లా వరకు. జోన్-2: గుంటూరు నుండి చిత్తూరు జిల్లా వరకు అని విజయ్ కుమార్ వివరించారు.

# ప్రైవేటు ఆలయాల పర్యవేక్షణకు త్వరలో చట్టం

- వాటి జాబితాను కలెక్టర్లు దగ్గర ఉంచుకోవాలి
- 18 నెలల్లోనే అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టాం
- రూ.603 కోట్లతో 498 ఆలయాల్లో అభివృద్ధి పనులు
- దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



నెల్లూరు (చైతన్యరథం): భక్తులకు దేవాదాయశాఖపై నమ్మకం, భగవంతునిపై ప్రగాఢ విశ్వాసం కలిగించేలా దేవాదాయశాఖ అధికారులందరూ భగవంతుని సేవలో చిత్తశుద్ధితో పనిచేస్తూ, ఆలయాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం నెల్లూరు సంతపేటలోని క్యాంపు కార్యాలయంలో జిల్లా లోని దేవాదాయశాఖ అధికారులు, ఇంజనీర్లు, స్తపతులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని ఆలయాల పునర్నిర్మాణ పనులు, ధూప దీప నైవేద్యం పథకం అమలు, గ్రామదేవతల ఆలయాల నిర్మాణా లపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. గడిచిన ఐదేళ్ల లో ఆలయాల ప్రతిష్ట దిగజారిందని, కూటమి ప్రభుత్వం అధికా రం చేపట్టిన 18 నెలల్లోనే ఆలయాల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిన ట్లు తెలిపారు. ఆలయాల పవిత్రతను కాపాడుతూ భక్తులకు భగవంతుని సాక్షాత్కారం చేయడమే ఆలయాల అభివృద్ధికి పెద్దపీ ట వేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారం చేపట్టిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ధూపదీప నైవేద్యం స్కీం ద్వారా చిన్న ఆలయాలకు ఇస్తున్న రూ.5 వేల నగదును రూ.10 వేలకు పెంచి అందిస్తున్నట్లు చెప్పారు. ఆలయాల్లోని అర్చకులకు రూ.10 వేలు నుంచి రూ.15 వేలు పెంచి అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 27 వేల ఆలయాలున్న మంత్రి, ప్రతి ఆలయం బాధ్యత ను ప్రభుత్వం తీసుకుని, ఆ ఆలయాల ఆలనాపాలన చూస్తుంద న్నారు. ఆలయాలకు పాలకవర్గాలను కూడా నియమిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం నియమించిన పాలకవర్గాల గడువు సమయం తీరే వరకు కూడా ఆ పాలకవర్గాలనే కొనసాగించాలని సీఎం చంద్రబాబు సూచించారని చెప్పారు.

**కాశీ బుగ్గ తరహా ఘటనలు జరగకుండా చర్యలు**

కాశీ బుగ్గ తరహా ఘటనలు జరగకుండా అన్ని చర్యలు తీసు కుంటున్నామని చెప్పారు. ప్రైవేటు ఆలయ నిర్మాణాలపై దేవాదా య శాఖ అధికారుల పర్యవేక్షణ ఉండేలా త్వరలోనే చట్టం తీసుకో స్తున్నట్లు మంత్రి చెప్పారు. అలాగే అన్ని జిల్లాల్లో ప్రైవేటు ఆలయా ల జాబితాను సిద్ధం చేసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, దేవాదా య శాఖ అధికారుల వద్ద ఉంచుకోవాలని, ఆయా ఆలయాల్లో జరిగే ఉత్సవాలు, పండుగల సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వ అధికార యంత్రాంగం సహకారం అందిం చేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

**ఏ తప్పులు జరిగినా శిక్షలు తప్పవు**

భగవంతుని ఆరాధ్య కేంద్రాలైన ఆలయాల్లో ఎవరు ఎటువంటి తప్పులు చేసిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఆగమశాస్త్ర విషయాల్లో కేవలం వేదపండితులు, ఆలయ అర్చకులకే పూర్తి నిర్ణయాధికారులు ఉంటాయని, అధికార యంత్రాంగానికి స్థానం లేదని, కేవలం పరిపాలనాపరమైన అంశాల్లో మాత్రమే అధికారుల ప్రమేయం ఉండేలా చట్టం తీసుకొచ్చినట్లు చెప్పారు. తప్పులు జరిగితే భగవంతుడూ చూస్తూ ఉంటాడన్న భయం, భక్తి, శ్రద్ధతో ఆలయాల అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని సూచిం చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పురాతన, చారిత్రాత్మక ఆలయాల పునర్నిర్మాణాలకు 288 ఆలయాలకు రూ.221 కోట్లను మంజూరు చేసినట్లు చెప్పారు. గతంలో ఉన్న పాతవి, తాము మంజూరు చేసినవి అన్నీ కలిపి సుమారు 498 ఆలయాల అభివృద్ధికి రూ.603 కోట్లు దేవాదాయశాఖ, దాతల సహకారంతో ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. నెల్లూరు జిల్లాలో 58 ఆలయాల పునర్నిర్మాణ పనులకు రూ. 118.45 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. ధూపదీప నైవేద్యం స్కీం ద్వారా జిల్లాలో 141 ఆలయాలకు ప్రతినెలా రూ.10 వేలు అర్చకుని ఖాతాకు జమ చేస్తున్నట్లు చెప్పారు. సోమశిల సోమేశ్వర స్వామి, అమ్మవారి ఆలయాలు, నెల్లూరు వేణుగోపాలస్వామి, నవాబుపేట శివాల యం, ఇరుకళల అమ్మ వారి ఆలయం, రాజరా జేశ్వరి అమ్మవారి ఆలయం, ఉదయగిరిలోని వేణుగోపాల స్వామి ఆలయం, నర్రవాడ వెంగమాంబ ఆలయం, బిట్రగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయాల అభివృద్ధి పనులు చేపడు తున్నట్లు చెప్పారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రత్యేకంగా ఎస్సీ ఎస్టీ బీసీ కాలనీలలోని గ్రామదేవతల ఆలయాలు, రామాలయాల నిర్మాణాలు, మరమ్మతులకు 5 లక్షలు చొప్పున 78 ఆలయాలకు నిధులు మంజూరు చేశామని, వీటి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా ఆల యాలను అభివృద్ధి చేస్తూ, సనాతన హిందూ ధర్మం, ఆలయాల పవిత్రతను కాపాడుతూ ఆధ్యాతిక కేంద్రాలుగా వెలుగొందేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యంగా మంత్రి పునరుద్ఘాటించారు. ఈ సమీక్షలో జిల్లా దేవాదాయశాఖ అధికారి కోవూరు జనార్దన్ రెడ్డి, అన్ని ఆలయాల ఈవోలు, ఇంజనీర్లు, స్తపతులు తదితరులు పాల్గొన్నారు.

# హాజరు శాతం పెంచేందుకే ఉచిత సైకిళ్లు

- అద్దంకిలో ఇప్పటివరకు 5,100 మందికి పంపిణీ
- ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



అద్దంకి(చైతన్యరథం): ప్రైవేటు విద్యా సంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. అద్దంకి నియోజక వర్గంలోని జే.పంగులూరు మండలం, ముప్పవరం గ్రామంలోని పీఎస్ఎస్సీసీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 110 మంది విద్యార్థులకు ఇటలీకి చెందిన ఐఎస్‌పీ, అసిస్ట్ స్వచ్ఛంద సంస్థల సహకారంతో మంగళవారం ఉచితంగా సైకిళ్లను అందజే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి లోకేష్ తీసుకొచ్చిన సంస్కరణలతో ఆంధ్రప్రదేశ్ విద్యా విధానం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా 16,300కు పైగా టీచర్ పోస్టులను డిఎస్సీ ద్వారా కూటమి ప్రభుత్వం భర్తీ చేసిందన్నారు. పాఠశాలకు దూరం కాకుండా డ్రాపౌట్ల సంఖ్య తగ్గించేందుకు సీఎస్ఆర్ నిధుల సహ యంతో ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైకిళ్లను ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని వివిధ ఉన్నత పాఠశాలలకు చెందిన సుమారు 5,100 మందికి పైగా విద్యార్థులకు ఇప్పటి వరకు సైకిళ్లను ఉచితంగా అందించా మని వెల్లడించారు. ఇందులో అద్దంకి జూనియర్ కళాశాల విద్యార్థుల కూడా ఉన్నారని గుర్తు చేశారు. పారిశ్రామిక, వ్యాపార వర్గాలు, దాతలు, సీఎస్ఆర్ నిధుల సహకారంతో ఇటువంటి మహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రోడ్డుకు పక్కగా సైకిల్‌పై వెళ్లేలా విద్యార్థులకు ప్రమాదం జరగకుండా సూచనలు ఇవ్వాలంటూ ఉపాధ్యాయులను ఆదేశించారు.

**రూ.85 లక్షలతో ఉప్పలపాడు అనుసంధాన రహదారి**

నరసరావుపేట: నియోజకవర్గంలోని ఉప్పలపాడు గ్రామ సమీపంలో నరసరావుపేట-వినుకొండ ఆర్ అండ్ బీ రోడ్డుకు అనుసంధానంగా ఎన్టీఆర్ కాలనీ వరకు నూతనంగా నిర్మించను న్న తారురోడ్డుకు పల్నాడు ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికు మార్, స్థానిక ఎమ్మెల్యే అరవింద్ బాబు, ఎంపీ కృష్ణదేవరా యలుతో కలిపి శంకుస్థాపన చేశారు. సుమారు రూ.85 లక్షల ఉపాధి హామీ నిధులతో రహదారి నిర్మాణం చేపట్టనున్నారు.

# త్వరలో ప్రభుత్వాసుపత్రుల్లో 13 క్రిటికల్ కేర్ బ్లాకులు

- రూ.600 కోట్ల వ్యయంతో 24 సీసీబీల నిర్మాణం
- పురోగతిని సమీక్షించిన మంత్రి సత్యకుమార్
- వచ్చే ఏడాది ఆగస్టులోగా పూర్తికి ఆదేశం

అమరావతి(చైతన్యరథం): అత్యవసర వైద్యసేవల కోసం రాష్ట్రంలోని ముఖ్యమైన 24 ప్రభుత్వాసుపత్రుల్లో కొత్తగా 'క్రిటికల్ కేర్ బ్లాకులు' (సీసీబీలు) రాబోతున్నా యి. వచ్చే నెలాఖరు నాటికి 13, 2026 ఆగస్టు నాటికి మరో 11 సీసీబీలను వినియోగంలోకి తెచ్చేందుకు వైద్య ఆరోగ్య శాఖ చర్యలు తీసుకుంటోంది. వీటి ద్వారా అదనంగా 1,275 పడకలు అందుబాటు లోకి వస్తాయి. వీటి నిర్మాణాల పురోగతిని అధికారులు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వివరించారు. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (PM ABHIM) కింద రూ.600 కోట్ల వ్యయంతో చేపట్టిన వీటి నిర్మాణాలను దశల వారీగా వచ్చే ఏడాది ఆగస్టులోగా పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించినట్లు వైద్య ఆరోగ్య శాఖ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది.

**బోధనాసుపత్రుల నుంచి ఏరియా ఆసుపత్రుల వరకు..!**

కొవిడ్-19 సమయంలో అత్యవసర వైద్యం రోగులకు అంద డంలో సవాళ్లు ఎదురయ్యాయి. ఆ సమయంలో నాన్-కోవిడ్ కేసుల వారికి సరైన వైద్యం అందలేదు. భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 621 సీసీబీల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. దీని ప్రకారం గుంటూరు మినహా 16 బోధనా సుపత్రులు, తెనాలి, అనకాపల్లి, హిందూపురం జిల్లా ఆసుపత్రులు (3), నరసరా వుపేట, పాలకొండ, భీమవరం, రాయచోటి, చీరాల ఏరియా (5) ఏరియా ఆసుపత్రుల్లో వీటి నిర్మాణాలు జరుగుతున్నాయి.

**ఆగస్టు నాటికి నిర్మాణాలు పూర్తయ్యేలా ప్రణాళికలు**

ప్రస్తుతానికి నెల్లూరు, ఒంగోలు బోధనాసుపత్రు ల్లోని సీసీబీల నిర్మాణాలు దాదాపుగా పూర్తయ్యాయి. వచ్చే నెలాఖరు నాటికి కడప, కర్నూలు, తిరుపతి, హిందూపురం, అనంతపురం, అన కాపల్లి, రాజమ హేంద్రవరం, విశాఖ, శ్రీకాకుళం, విజయవాడ, విజయనగరం, 2026 మార్చి నాటికి తెనాలి జిల్లా ఆసుపత్రి, ఆగస్టు నాటికి చీరాల, పాడేరు, ఏలూరు, మచిలీపట్నం, పాలకొండ, నంద్యాల, భీమవరం, నరసరావుపేట, రాయచోటి, కాకినాడ ఆసుపత్రుల్లో నిర్మాణాలు పూర్తవుతాయి.

**ఒక్కో దానికి రూ.23.75 కోట్ల వ్యయం**

50 పడకలతో ఏర్పాటయ్యే 22 సీసీబీల్లో ఒక్కొక్క దానికి (పరికరాలు/యంత్రాలతో కలిపి) రూ.23.75 కోట్లు చొప్పున వ్యయంచేస్తున్నారు. 75 పడకలతో ఉన్న నరసరావుపేటలోని ఏరియా ఆసుపత్రిలో సీసీబీ నిర్మాణానికి రూ.36.35 కోట్లు, వంద పడకలతో తెనాలి జిల్లా ఆసుపత్రిలో రూ.44.50 కోట్లతో సీసీబీ ఏర్పాటు కాబోతుంది. ప్రతి ఆసుపత్రిలో సుమారు రూ.7 కోట్లను పరికరాలు/ యంత్రాల కోసం వ్యయం చేస్తున్నారు.

**ఐసీయూ, మినీ ఐసీయూ, ఇతర సౌకర్యాలు**

ప్రతి 50 పడకల సీసీబీలో 10 పడకలతో ఒక ఐసీయూ, ఆరు పడకలతో మినీ ఐసీయూ (స్టెప్ డౌన్), 24 ఐసోలేషన్ పడకలతో పాటు విడిగా డయాలసిస్ పడకలు, మెటర్నటీ పడకలు, క్యాజువాలిటీ వార్డు అందుబాటులోకి వస్తుంది. గుండె, శ్వాసకోశ సంబం ధిత కేసులు, పాయిజన్ కేసులు, డయాలసిస్, మెటర్న ల్ అండ్ చైల్డ్ హెల్త్ ఇతర కేసులు ఇక్కడ చూస్తారు.



చైతన్యరథం

# మైనారిటీల సంక్షేమమే లక్ష్యం

- అనుబంధ విభాగాలు చురుగ్గా పనిచేయాలి
- పథకాలు వినియోగించుకునేలా చూడాలి
- న్యాయ, మైనార్టీ సంక్షేమ మంత్రి ఫరూక్
- మైనారిటీ సంక్షేమ పథకాలపై దిశా నిర్దేశం

అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని అందుకు అనుగుణంగా అధికార యంత్రాంగం తమ శాఖల పరిధిలో సంక్షేమ ప్రణాళికలను ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధికా రులకు సూచించారు. మంగళవారం వెలగపూడి సచివాల యంలోని మూడవ బ్లాక్‌లో మైనారిటీ మంత్రిత్వ శాఖ పేషీ కార్యా లయంలో మైనారిటీ శాఖ కార్యదర్శి సిహెచ్.శ్రీధర్, మైనారిటీ సంక్షేమ శాఖ వివిధ విభాగాల ఉన్నతాధికారులతో మంత్రి సమీ క్షించారు. ఉర్దూ అకాడమీ, కేంద్ర పథకాల సమర్ధ వినియోగం, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, ఉపాధి రుణాలపై తదితర అంశాలపై సమీక్ష చేశారు. మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతి, వివిధ భవనాల నిర్మాణ పనుల పూర్తికి నిధుల వినియోగం, ప్రధాన మంత్రి విరాసత్ కా సంవర్ధన్ (పీఎం వికాస్), ప్రధానమంత్రి జన్ వికాస్ కార్యక్రమం (పీఎంజేవీకే), జాతీయ మైనారిటీల అభివృద్ధి ఆర్థిక సంస్థ



(ఎన్ఎండీఎఫ్‌సీ) పథకాల ద్వారా రాష్ట్రానికి వచ్చే నిధుల వినియోగం, హజ్ -2026 యాత్రకు తీసుకొనే ముందస్తు చర్యల ప్రణాళిక, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, పురోభివృద్ధికి చర్యలు, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాల పంపిణీ తదితర అం శాలపై మైనారిటీ సంక్షేమ శాఖ విభాగాలు ఏ విధంగా ముందుకు సాగుతున్నాయన్న విషయాలపై ఆరా తీశారు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండి యాకుబ్ బాషా, వక్ఫ్‌బోర్డు సీఈవో మహమ్మద్ అలీ, క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ ఏ.శేఖర్‌లు తమ విభాగాల పరిధిలో అమలవుతున్న, తీసుకుంటున్న చర్యలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడు తూ రాష్ట్రంలోని మైనారిటీల సంక్షేమానికి సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న విషయానికి అనుగుణంగా మైనారిటీ అనుబంధ సంక్షేమ విభాగా లన్నీ పనిచేయాలని ఆదేశించారు. కేంద్ర మైనారిటీ పథకాలను కూడా సమర్థవంతంగా వినియోగించుకునేందుకు సమన్వయంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. మైనార్టీల ఆర్థిక ఉన్నతి కోసం, స్వయం ఉపాధి కల్పన కోసం నైపుణ్య అభివృద్ధి శిక్షణతో పాటు, సరళీకృతమైన విధానాలతో రుణాలను బ్యాంకుల ద్వారా అం దించడం, రాయితీకి సంబంధించిన అంశాలపై అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదే శించారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం అన్ని చర్యలను అమలు చేయడం జరుగుతుందని, అన్యాక్రాంతం కాకుండా చర్య లు తీసుకోవడంతో పాటు, ఉన్న ఆస్తులను ఏ విధంగా వినియోగించుకుని అభివృద్ధి, ఆదాయం సమకూరేలా తీసుకునే చర్యలపై దిశా నిర్దేశం చేశారు. వచ్చే నెలలో క్రిస్మస్ పర్వదినం సందర్భంగా రాష్ట్రస్థాయితో పాటు, జిల్లా కేంద్రాల్లో హైటీ కార్యక్ర మాలను క్రిస్మస్‌కు ముందుగా నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ ఏ. శేఖర్‌ను ఆదేశించారు.

### ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల విద్య, సంక్షేమంపై

# సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ

- రూ. 80 లక్షలతో ఐఐటీ, నీట్ లాంగ్‌టర్మ్ కోచింగ్ సెంటర్ నిర్మాణం
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
- విజయవాడ ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లో మంత్రి ఆకస్మిక తనిఖీ

విజయవాడ (చైతన్యరథం): విజయవాడలో ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని డా. బీఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో ఐఐటీ, నీట్ లో తృతీలో అవకాశం కోల్పోయిన అంబేద్కర్ గురుకులాల విద్యార్థులకు లాంగ్ టర్మ్ కోచింగ్ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి స్వామి ఆకస్మిక తనిఖీ చేశారు. స్టడీ సర్కిల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్న అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి డా.స్వామి మాట్లాడుతూ..... ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. డా.బీఆర్ అంబేద్కర్ గురుకులాల విద్యార్థులకు ఐఐటీ, నీట్ కోచింగ్ సెంటర్లను 3 నుంచి 10 కి పెంచాం. విజయవాడ కబేలా సెంటర్ లో రూ. 80 లక్షలతో శాశ్వత ఐఐటీ, నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ సెంటర్ నిర్మిస్తున్నాం. పేద విద్యార్థుల కోసం కూటమి ప్రభుత్వం ఎంత ఖర్చునైనా భరిస్తుంది. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు అందిపుచ్చుకొని విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థితిలో స్థిరపడాలని మంత్రి డా.స్వామి ఉద్బోధించారు.



# సాక్షులను లేపేయడంలో వైసీపీ దిట్ట

- భూమన, వైవీలను రక్షించేందుకే సతీష్ హత్య
- పరకామణి గజదొంగ దాత ఎలా అవుతాడు?
- రవికుమార్ వేల కోట్లు దోచుకున్నాడు
- ఆయన ప్రాణానికి వైసీపీ గూండాలతో హాని
- తక్షణమే అదుపులోకి తీసుకుని రక్షణ కల్పించాలి
- ఏపీ లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు

మంగళగిరి (చైతన్యరథం): పరకామణిలో వేల కోట్లు దోచుకు న్న గజదొంగ రవికుమార్ వెంకన్న స్వామికి ఆస్తులిచ్చిన దాత ఎలా అవుతాడని ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు ప్రశ్నిం చారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరికీ తల్లి, తండ్రి, గురువులు దైవంతో సమానం.. అయితే జగన్ విష యంలో మాత్రం వారు ఆయనకు దయ్యంతో సమానం. ఎవరైనా చదువు-సంస్కారం, మంచి విలువలతో కూడిన జీవితం కోసం తల్లి, తండ్రి, గురువులను ఆశ్రయిస్తారు. జగన్ అందుకు వ్యతిరే కంగా వ్యవహరిస్తాడు. జగన్ వారిని వాడుకోవడమే తప్ప మర్యాద లు తెలియని వ్యక్తి. జగన్‌రెడ్డి తల్లి, తండ్రి, గురువులను క్షుద్ర రాజకీయాలకు వాడుకుంటాడు. దేవాలయాలలో డిక్లరేషన్ ఇవ్వ కుండా గతంలో దేవుళ్లను కూడా అవమానపరిచాడు. కోట్లాది మందికి ఆరాధ్యదైవమైన వెంకటేశ్వర స్వామినే మోసం చేశాడు. జగన్ రాజకీయాలు అన్నీ ఇన్నీ కావు. పరకామణిలో సైతం చోరీకి పాల్పడ్డారు. ఎన్నికలకు ముందు వైఎస్ కుటుంబాన్ని వాడుకున్నా డు, ప్రస్తుతం దేవుడిని వాడుకుంటున్నాడు. ఇలా అందరినీ వాడు కోవడమే జగన్ పని. రవికుమార్ అనే వ్యక్తి పరకామణి చోరీ కేసులో ప్రధాన నిందితుడు. అతను పరకామణిలో కోట్లాది రూపా యలు దోచుకున్నాడు. ఇదంతా ఆనాటి చైర్మన్, ఈవోలకు తెలియ కుండా జరిగే అవకాశాలున్నాయా? అని ప్రశ్నించారు. ఆనాటి టీటీడీ బోర్డు చైర్మన్ కరుణాకరెడ్డి, ధర్మారెడ్డిలు రవికుమార్‌తో ఇదంతా చేయించారని స్పష్టంగా తెలుస్తోంది. 2023లో రవి చేసే దొంగతనాలను చూసి సతీష్‌కుమార్ ఫిర్యాదు చేసి సాక్షిగా మారా డు.



నేడు సతీష్ అత్యంత దారుణంగా చంపబడ్డాడు. భూమన ప్రెస్ మీట్ పెట్టి ఇది హత్య కాదు ఆత్మహత్య అని చెప్పాల్సిన అవసరమేమొచ్చింది? పరకామణిలో జరిగిన చోరీపై ఫిర్యాదు చేసిన టీటీడీ మాజీ విజిలెన్స్ ఏవీఎస్ సతీష్‌కుమార్‌ది ముమ్మాటికి వైసీపీ నేతలు చేసిన హత్యే. సాక్ష్యాలను తారుమారు చేసేందుకే అత్యంత దారుణంగా హతమార్చారు. వైసీపీ అఫీషియల్ ట్విట్టర్ అకౌంట్ లో సతీష్ కుమార్ మరణాన్ని ప్రభుత్వ ఒత్తిడితో జరిగిన ఆత్మహత్య అని ఎలా పోస్ట్ చేశారు? సీఐడీ, పోస్టుమార్టం రిపోర్టు, ఫోరెన్సిక్ రిపోర్టు రాకుండానే ఎలా నిర్ధారించగలరు? ఇందులో భూమన హస్తం ఉంది కాబట్టే మెడకు చుట్టుకుంటుందనే భయం తోనే ఆత్మహత్య అని చెప్పారు. వివేకా హత్య కేసు, పరిటాల హత్య కేసు, పరకామణి కేసు ఇలా అన్ని నేరాలకు వైసీపీతో సంబంధాలు న్నాయి. గతంలో వివేకానందరెడ్డి గుండెపోటుతో మరణించాడని సాక్షి టీవీలో వేయించారు. ఈ విషయం వారికి ఎవరు చెప్పారు? ఆ తరువాత ఈ నేరం చంద్రబాబుపై నెట్టాలని నారాసుర రక్త చరిత్ర అని రాశారు. పరకామణి హత్య కేసు సాక్షి సతీష్ కుమార్ ను చంపి ఆత్మహత్యగా చిత్రీకరించారు. నేరాలు చేసిన తరువాత ప్రత్యర్థులపై నెట్టేయడంలో వైసీపీ దిట్ట. ప్రస్తుతం సతీష్ కుమార్ హత్యను పోలీసులపై నెట్టడానికి ప్రయత్నించారు.

జగన్ హత్యలు, దోపిడీలతో రాజకీయాలు చేస్తున్నాడు. సుబ్బారెడ్డి తిరుమలకు చెందిన వేల కోట్లు పోగేశాడు. కరుణాకర్‌రెడ్డి లోక్ అదాలత్‌లో నిందితులను రాజీ చేసుకుని దొంగతనం చేసిన వారి నుంచి కోట్లు పోగేసుకున్నాడు. శ్రీవారి ఆస్తులను కొట్టేశారు. వైసీపీ నాయకులు భక్తుల మనోభావాలను దెబ్బతీశారు. చేసిందంతా చేసి కేసును రాజీ చేసుకుంటే సరిపోతుందా? లోక్ అదాలత్‌లో కేసును కొట్టి వేస్తే ఎవరు ఒప్పుకుంటారు? ఎవరి సొమ్మని లోక్ అదాలత్ లో రాజీపడతారు? సీఐడీతో విచారణ జరపాలని కోర్టు తెలిపింది. దర్యాప్తు జరుగుతుండగా సాక్షి సతీష్ కుమార్‌ను హత్య చేశారు. పరిటాల రవి హత్య కేసులో నిందితుల వరుస హత్యలు చేశారు. 2008లో మొద్దుశీను, అజీజ్‌రెడ్డి, పరిటాల గోవర్ధన్‌రెడ్డి, 2007 లో డాక్టర్ సాంబశివరావు, 2011లో మద్దెలచెరు సూరిని, 2009లో ఓం ప్రకాష్‌ను హత్య చేశారు. అలాగే వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుల, సాక్ష్యులలో 2019 సెప్టెంబర్ 2న కసుమూరు శ్రీనివాసరెడ్డి 2023 మార్చి 3న ఈసీ గంగిరెడ్డి, 2022 జూన్ 09 న కువైట్ గంగాధర్‌రెడ్డి, 2019 డిసెంబర్ 6న డ్రైవర్ నారాయణ, 2025 జనవరి 10న వైఎస్ అభిషేక్ రెడ్డి, 2025 మార్చి 5న వాచ్‌మెన్ రంగన్నను హత్య చేశారు. ఆరోజు అవినాష్ రెడ్డి కోసం.. ఈరోజు సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డిల కోసం చేశారు. గతంలో వైసీపీ హయాంలో ప్రతిపక్షాలను వేధింపులకు గురిచేశారు. వైసీపీ ప్రజాసేవ పార్టీ కాదు ఒక టెర్రరిస్టు పార్టీ. తల్లి, తండ్రి, చెల్లి, బాబాయి, చివరకు దేవుడిని కూడ వదలడు క్షుద్ర రాజకీయాలకు వాడుకుంటారు. చివరకు దేవుడి ప్రసాదం అయిన లడ్డూల తయారీకి వాడే నెయ్యిని కూడా కల్తీ చేశాడు. జగన్ లాంటి కల్తీ వ్యక్తి ఈ భూ ప్రపంచంలోనే ఉండడు. వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డిలను వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి. వైసీపీలోని వారంతా అనేక అవినీతికి పాల్పడినా ఇంత వరకు ఎవరినీ సస్పెండ్ చేయలేదు. మనుషులను చంపి డోర్ డెలివరీ చేసే వారిని, అత్యాచారాలు చేసే వారిని జగన్ అందల మెక్కించాడు. సతీష్‌కుమార్ హత్య విషయంలో సీఐడీ వారు ఈ దర్యాప్తును వేగవంతం చేశారు. పోలీసు వ్యవస్థ దర్యాప్తు వేగ వంతం చేసింది. సాక్ష్యాలు, ఆధారాలు ప్రజల ముందుకు రాబోతు న్నాయి. నిందితులకు శిక్షలు తప్పవని స్పష్టం చేశారు.

# సుందర మచిలీపట్నం లక్ష్యంగా అభివృద్ధి పనులు

- దశాబ్దాల చరిత్ర ఉన్న నగరం వెనుకబడకూడదు
- ప్రతి విధికీ సిమెంటు రోడ్డు వేసి చూపిస్తాం
- ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి సాకారం చేస్తాం
- సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పనిచేస్తున్నాం
- శంకుస్థాపన కార్యక్రమాల్లో మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం (చైతన్యరథం): దశాబ్దాల చరిత్ర కలిగిన మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధిలో వెనుకబడకుండా చూసుకుం టానని గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. 48వ డివిజన్లో డ్రైనేజీ పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం 35వ డివిజన్ రాజుపేట కొత్త మసీదు సెంటర్లో మూడు కల్వర్టులు, రెండు డ్రైన్ పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. 48వ డివిజన్ నిజాంపేట రంగా విగ్రహం పక్క రోడ్డులో కల్వర్టు, హెచ్‌డీపీఈ పైపులైన్ పనులను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడు తూ సుమారు 150 సంవత్సరాల చరిత్ర కలిగిన మచిలీపట్నం మున్సిపాలిటీని 2014–19 మధ్య కార్పొరేషన్‌గా మార్చాం. వడ్డె రంగారావుగారి చొరవతో మచిలీపట్నంలో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మించారు. తర్వాత నడకుదిటి నరసింహారావు గారు, బచ్చుల అర్జునుడు గారు మచిలీపట్నంలో సిసి రోడ్లకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం 95 శాతం వరకు ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు నిర్మించాం. మిగిలిన ప్రాంతాల్లో కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్నాం. నేను తొలిసారిగా ప్రమాణ స్వీకారం చేసి వెంటనే నియోజకవర్గంలో సిసి రోడ్ల నిర్మాణాలకు పెద్దపీట వేశాను. టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టాను. మంచినీటి ఇబ్బందులు పరిష్కరించడం లక్ష్యంగా 20 ఎంఎల్‌డీ వాటర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టాం. 8రిజర్వాయర్లు నిర్మించడంతోనే అన్ని ప్రాంతాల్లో తాగునీరు అందిస్తున్నాం. విద్యుత్ సమస్యలను కూడా శాశ్వతంగా పరిష్కరించబోతున్నామని తెలిపారు. మున్సిపాలిటీల్లో డ్రైనేజీల నిర్మాణానికి రూ.60 కోట్ల ప్రతిపాదనలు పంపించాం. ఆ నిధులతో రెండు అడుగుల్లోపు ఉన్న డ్రైన్లు పూర్తి చేస్తాం. పెద్ద డ్రైన్ల కోసం మరో రూ.13 కోట్లు కావాలని ముఖ్యమంత్రిగారిని కోరాం. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను జగన్ రెడ్డి పంపిణీ చేయకుండా నాశనం చేశారు. వాటిని పేదలందరికీ పంచి పెట్టాం. త్వరలోనే గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు స్థలం కేటాయించి ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టబోతున్నాం. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేశాం. హామీ మేరకు పెన్షన్లను తొలి నెలలోనే రూ.4000కు పెంచాం. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ సిలిండర్ లాంటి పథకాలన్నీ పక్కాగా అమలు చేసి చూపించాం. అన్నదాత సుఖీభవతో ఇప్పటికే రూ.7వేలు ఇచ్చాం. రేపు మరో రూ.7000 ఇవ్వబోతున్నాం. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న ఎన్నికల హామీ మేరకు గతంలో ఎన్నడూ లేనంత ఘనంగా సీఐఐ సదస్సు నిర్వహించాం. రెండు రోజుల్లోనే సుమారు 13 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకున్నాం. తద్వారా 15 లక్షల మందికి పైగా ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉంది. ఒకప్పుడు విజన్ 2020లో భాగంగా ఐటీని ప్రోత్సహిస్తే.. కంప్యూటర్లు కూడు పెడతాయా అని అవహేళన చేశారు. కానీ నాటి ఐటీ విప్లవం నేడు ఎంతమందికి ఉద్యోగాలు కల్పిస్తోందో, ఎన్ని కంపెనీలు రావడానికి దిక్సూచిలా నిలిచిందో ప్రజలు ఆలోచించుకోవా లన్నారు. విభజన తర్వాత రాష్ట్రం ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ ఒక్కో ఇటుక పేర్చి నిర్మించుకుంటూ వచ్చాం. గత ఎన్నికల్లో జగన్‌రెడ్డి అధికారంలోకి రావడంతో రాష్ట్ర నిర్మాణానికి మనం కట్టిన పునాదుల్ని కూల్చేశాడు. పెట్టుబడుల్ని తరిమేశాడు. అభివృద్ధి పనులను అటకెక్కించాడు.

అమరావతి, పోలవరం ప్రాజెక్టుల్ని పాడుబెట్టాడు. పరిశ్రమలు రావాలంటేనే భయపడే పరిస్థితి కల్పించారు. మళ్లీ మనం అధికారంలోకి రాగానే రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడం కోసం 25 రకాల పాలసీలను తీసుకొచ్చాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నినాదంతో పెట్టుబడి దారులకు భరోసా కల్పించాం. రాష్ట్రాన్ని ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నిరంతరం శ్రమిస్తున్నారు. ప్రజల సహకారంతో మాత్రమే వేగవంతమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి పల్లపాటి సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, జనసేన నాయకులు వాసు, భాగ్యరాజు, మద్ది వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే కంగాటి భూమి కబ్జా

- న్యాయం చేయాలని బాధితుల గోడు
- అర్జీలు స్వీకరించిన మంత్రి ఫరూక్



మంగళగిరి (చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎం.డి.ఫరూక్, ఏపీ వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ అర్జీలు స్వీకరించారు. కర్నూలు జిల్లా కల్లూరు మండలం పునులూరు గ్రామానికి చెందిన అయ్యస్వామి తమ కుటుంబానికి చెందిన భూమిని వైసీపీ ప్రభుత్వంలో స్థానిక నాయకులు ఆక్రమించి పంటలను ధ్వంసం చేసి దాడులు చేసి తప్పుడు కేసులు పెట్టారని ఫిర్యాదు చేశారు. రికార్డులు మార్చేసి తమ భూమిని పూర్తిగా ఆక్రమించారని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 నవంబర్‌లో మరోసారి 20 మంది కలిసి తమపై తన అమ్మ, అన్న, వదినలపై దాడి చేసి అక్రమ కేసులు పెట్టారని వివరించారు. దీనిపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని అభ్యర్థించారు.

### సంతకం చేయించుకుని భూమి ఆక్రమించుకున్నారు

కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం కోసానపల్లి గ్రామానికి చెందిన వెంకటరాము గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ కుటుంబానికి వంశపారంపర్యంగా వస్తున్న సర్వే నంబర్ 323లో మొత్తం 5.00 ఎకరాల భూమి ఉంది. 1979లో 2.21 ఎకరాలు అమ్మగా మిగిలిన 2.79 ఎకరాలు 1940 నుంచి కె.రామకృష్ణ అనే వ్యక్తికి కౌలుకు ఇచ్చాం. మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఆమె మామ కంగాటి వెంకటరెడ్డి కలసి మోసపూరిత అగ్రిమెంట్ రాయించి తమ అక్షరాస్యత లేమి కారణంగా బలవంతంగా సంత కం చేయించారు. ఇప్పుడు ఆ పత్రం ఆధారంగా భూమిని అక్ర మంగా స్వాధీనం చేసుకుని సాగు చేస్తున్నారు. వారి పేరుతో పాస్‌బుక్ లేదా ఏ ప్రభుత్వ రికార్డు లేదు. తమ కుటుంబానికి ఈ భూమిపై హక్కు ఉంది. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు. తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.

### పొలం చుట్టూ దారిని మూసేశారు

పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం చక్రాయపాలెం గ్రామానికి చెందిన చంద్ర నాయక్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. గరిక పాడు రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వే నెం. 412లో 2.96 సెంట్లు భూమి, 643లో 2 ఎకరాల భూమిని 32 ఏళ్లుగా సాగు చేసుకుం టూ జీవనం సాగిస్తున్నాం. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో తమ పొలం చుట్టూ ఉన్న దారిని ఆపేశారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. దయవుంచి తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

### రెవెన్యూ అధికారులు అక్రమంగా డీ పట్టాలు ఇచ్చారు

శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం బెజ్జిపురం గ్రామానికి చెందిన మేడూరి శ్రీనివాసరావు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. 1970లో ప్రభుత్వం సర్వే నంబర్ 132–2/132–4లో 2.71 సెంట్ల భూమికి డి.పట్టా జారీ చేసింది. తమ తండ్రి 2009 వరకు సాగు చేశారు. ఆయన మరణం తర్వాత వారసులైన తాము భూమిలోకి వెళ్లడానికి ప్రయత్నించగా వెంకటరమణ, సూర్యనారా యణ కుటుంబాలు గ్రామస్థులను తోడు చేసుకుని అడ్డుకోవడం దాడికి పాల్పడుతున్నారు. అదే సమయంలో తమ తండ్రికి నోటీసు ఇవ్వకుండా రాజకీయ ఒత్తిడితో రెవెన్యూ శాఖ 2008లో అన్యాయంగా కొత్త డి.పట్టాలు జారీ చేసినట్లు తెలిపారు. రికార్డుల్లో ఇప్పటివరకు కూడా తమ తండ్రి పేరుపైనే ఉన్నాయి. వారిపై చర్యలు తీసుకుని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.

### భూమిని మరొకరి పేరుపై మార్చుకున్నారు

బాపట్ల జిల్లా రేపల్లె మండలం పోటుమెరక గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నెం.176/2లో య.3 పొలం ఉంది. గత ప్రభు త్వంలో కొంతమంది వ్యక్తులు అక్రమంగా ఆక్రమించి రికార్డుల్లో మార్పులు చేసి తమ పేర్లపై నమోదు చేయించుకున్నారు. సర్వే నెం. 179/1ఏ, 179/1ఏలో 2.37 సెంట్ల భూమి ఉంది. ఈ భూమి కూడా అక్రమంగా ఆన్‌లైన్ చేసుకున్నారు. మొత్తం 5.37 సెంట్ల భూమి కోసం 13 నెలలుగా రెవెన్యూ అధికారులు చుట్టూ తిరుగుతూ వారికి ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదు. తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

### వారసత్వ భూమిని ఎండోమెంట్ భూమిగా చూపిస్తున్నారు

కర్నూలు జిల్లా ఆలూరు మండలం హత్తిబెళగల్ గ్రామానికి చెందిన నాగన్నగౌడ్ గ్రీవెన్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో వారసత్వంగా వచ్చిన భూమి సర్వే నెం.252ఏలో మొత్తం 19.66 ఎకరాల భూమి కుటుంబ సభ్యులకు విభజన దాన దస్తావేజుల ద్వారా క్రమబద్ధంగా బదిలీ చేయబడింది. సర్వే చేయబడిన తరువాత ఈ భూమి 252–1ఏగా సబ్ డివిజన్ అయి 7.66 ఎకరాలు తమ పేరుపై ఆధార్, అడంగల్, ఆన్‌లైన్ రికార్డు లన్నీ వారసత్వ భూమిగా నమోదు అయి ఉన్నాయి. ఆర్థిక సమ స్యల కారణంగా ఈ భూమిలోని 3.00 ఎకరాలు వేరే గ్రామానికి చెందిన వ్యక్తికి విక్రయించగా రిజిస్ట్రేషన్ చేయించడానికి ఆలూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లినపుడు తమ భూమి ఆఫీస్ రికార్డుల ప్రకారం ఎండోమెంట్ భూమిగా కనిపిస్తోందని చెప్పారు. ఆన్‌లైన్ రికార్డులు, అడంగల్, వారసత్వ ధ్రువీకరణ పత్రాలు అన్నీ తమ పేరుపై ఉన్నప్పటికీ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో మాత్రం భూమిని 'ఎండోమెంట్ భూమి'గా చూపించడం వల్ల రిజిస్ట్రేషన్ నిలిచి పోయింది. భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.

### భూమి రిజిస్ట్రేషన్ కాకుండా తహసీల్దారు అడ్డుపడుతున్నాడు

వైఎస్‌ఆర్ జిల్లా వల్లూరు మండలం గంగవంపల్లి గ్రామానికి చెందిన లక్ష్మమ్మ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నెం.991/3ఏలో 0.62 సెంట్ల భూమి ఉంది. 1997 సంవత్సరంలో ఈ భూమి కొనుగోలు చేశాం. తమ భూమి రిజిస్ట్రేషన్ కాకుండా స్థానిక తహసీల్దార్ అడ్డుపడు తున్నాడు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సమస్యను పరిష్కరించాలని కోరారు.

### కుమారుడి అక్రమ భూ రిజిస్ట్రేషన్

తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల గ్రామానికి చెందిన వెంకట లక్ష్మీ నరసింహారావు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమకు గండేపల్లి తూర్పుచోడవరం గ్రామంలో సర్వే నెం.267–3లో య.1.09 సెంట్ల భూమి ఉంది. అందులో 0.50 సెంట్లు ఉమ్మడి బాట కోసం తన పెద్ద కుమారుడు బాపిరాజు వెంకట లక్ష్మీనరసింహారావుతో కలిసి అమ్మాం. మిగిలిన భూమిని తన చిన్న కుమారుడు రవికుమార్, కుమార్తె వెంకటరమణ, మరో కుమార్తె దుర్గ ప్రశాంతి పేర్లకు సమానంగా ఇవ్వకుండా పెద్ద కుమారుడు తమ కుమార్తె పేరున ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయిం చుకున్నాడు. వారిపై చర్యలు తీసుకుని భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.

### భూమిలోకి వెళ్లకుండా బెదిరిస్తున్నారు

సత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం కొండపల్లి గ్రామానికి చెందిన స్వామి గ్రీవెన్స్‌లో అర్జీ విజ్ఞప్తి చేస్తూ..తనకు గ్రామంలో ఉన్న సర్వే నెం.928–1, విస్తీర్ణం 5.09 సెంట్ల భూమిలో 28–08–2025న కంపచెట్లను జేసీబీ సహాయంతో తొలగిస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన రఘురాము లు, మహేష్, రామన్న, నరసింహులు తదితరులు అక్కడికి చేరు కుని అడ్డుపడి తిడుతూ దాడి చేసేందుకు యత్నించి రాళ్లు, కర్రలు పట్టుకుని చంపేస్తామంటూ బెదిరించారు. కనగానపల్లి స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరాడు.

### ఆధార్ కార్డుకు తప్పుగా భూమి లింక్

పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా జలదంకి మండలం గట్టుపల్లి గ్రామానికి చెందిన నవీన్‌కుమార్ సమస్యను వివరి స్తూ తన తండ్రి జాబ్రాల కొండపనాయుడు 20 ఏళ్లుగా ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. భూ రికార్డులలో జరిగిన పొరపాటు వల్ల 5.35 ఎకరాల భూమి వారి ఆధార్ కార్డుకు తప్పుగా లింక్ కావడంతో వాహనమిత్ర సహా ఎలాంటి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందలేదు. సర్వే నెంబర్లు 13, 14–1, 14–1, 14–1లలో ఉన్న ఈ భూమిని నోషనల్ ఖాతా నుంచి వారి ఆధార్ లింక్‌లోంచి తక్షణమే తొలగించి ప్రభుత్వ పథకాలు అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరాడు.

చైతన్యరథం

# ఏపీలో ఎంఎస్ఎంఈ ఎకో సిస్టంను బలోపేతం చేయాలి

## - కేంద్రానికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వినతి



న్యూఢిల్లీ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో ఎంఎస్ఎంఈల బలోపేతానికి అవసరమైన ఎకో సిస్టం అభివృద్ధికి సహకరించాలని కేంద్రాన్ని రాష్ట్ర ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలు జరుగుతున్న ముఖ్యమైన కేంద్ర సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ప్రాజెక్టుల పురోగతి, భవిష్యత్తులో చేపట్టాల్సిన ప్రాజెక్టుల గురించి ఢిల్లీలో మంగళవారం కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ అదనపు కార్యదర్శి, అభివృద్ధి కమిషనర్ డా. రజనీష్‌కు మంత్రి కొండపల్లి వివరించారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా సోమవారం ఢిల్లీ చేరుకున్న రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తొలిరోజు వివిధ కార్యక్రమాలతో పాల్గొన్నారు. మంగళవారం ఉదయం కేంద్ర అదనపు కార్యదర్శి డా. రజనీష్‌తో సమావేశమైన ఆయన ఎంఎస్ఎంఈ శాఖ ద్వారా రాష్ట్రంలో అభివృద్ధికి ఉన్న అవకాశాలు, ఎంఎస్ఎంఈలను మరింతగా బలోపేతం చేసేందుకు అవసరమైన ఎకో సిస్టంను ఏర్పాటు చేసేందుకు ఉన్న భౌగోళిక స్థితిగతులు, అవకాశాల గురించి చర్చించారు. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ క్లస్టర్ల ఏర్పాటుకు కావలసిన మౌలిక సదుపాయాలు, వాటి అభివృద్ధికి ఉన్న అవకాశాల గురించి డా. రజనీష్ దృష్టికి తీసుకెళ్లారు. పెద్ద ఎత్తున చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయనకు వివరించారు. రాష్ట్రంలో చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈ సందర్భంగా కోరారు.

# సౌదీ మృతులకు నివాళి

- టీడీపీ కార్యాలయంలో దువా ప్రార్థనలు
- పాల్గొన్న మంత్రి ఫరూక్, మైనార్టీ నాయకులు

మంగళగిరి (చైతన్యరథం): పవిత్ర మక్కా – మదీనా యాత్ర కు వెళ్లిన యాత్రికులు మక్కా నుంచి మదీనా వెళ్లే దారిలో ఆయిల్ ట్యాంకర్ ఢీకొని 45 మంది హైదరాబాద్, తెలంగాణ ప్రాంతాలకు చెందిన మైనార్టీ సోదరులు మరణించడం చాలా బాధాకరమని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాల యంలో హజ్ కమిటీ చైర్మన్ హాజీ హసన్‌బాషా ఆధ్వర్యంలో సౌదీ ప్రమాద మృతులకు నివాళులర్పించారు. ఈ దువా కార్యక్రమంలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ప్రభుత్వ సలహాదారు, మాజీ శాసనమండలి చైర్మన్ ఎండీ షరీఫ్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, ముస్లిం మైనార్టీ నాయకులు మన్సూర్, మహ్మద్ రిజ్వాన్, అబ్దుల్ రౌఫ్, అబ్దుల్



అజీమ్, షఫీ, ఫజుల్, రెహమాన్, తదితరులు పాల్గొన్నా రు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సౌదీ మృతులకు జన్నతుల్ ఫిర్దోస్‌లో స్థానం కల్పించాలని ప్రార్థనలు చేశారు. జీవితంలో ప్రతి ముస్లిం సోదర సోదరీమణు లు తమ మతాచారం ప్రకారం మక్కా యాత్ర చేయాలనేది జీవితంలో ఒక కీలక ఘట్టమని వక్తలు పేర్కొన్నారు. అలాంటి ఉమ్రా యాత్రకు ఇంటిల్లిపాది వెళ్లి అల్లాను స్మరించుకునే క్రమం లో ప్రాణాలు కోల్పోవడం తెలుగు రాష్ట్రాల ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రతి ముస్లిమ్స్ సౌదీ మృతులకు నివాళిగా దువా చేస్తున్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో ఉమ్రా యాత్రికు ల పవిత్ర ఆత్మలకు శాంతి కలగాలని మైనార్టీ ప్రజాప్రతి నిధులు, నాయకులు పవిత్ర ప్రార్థనలు నిర్వహించామని హజ్ కమిటీ చైర్మన్ హాజీ హసన్‌బాషా పేర్కొన్నారు.

# సీఐఐ సదస్సు సూపర్ సక్సెస్

- ఫలించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కృషి
- ఓర్వలేక వైసీపీ ఏడుపులు
- మాజీ ఎమ్మెల్యే, ఏపీ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి



అమరావతి (చైతన్యరథం): విశాఖలో జరిగిన సీఐఐ సమ్మిట్ ఈసారి ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల దిశనే మార్చేసిందని మాజీ ఎమ్మెల్యే, ఏపీ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. రెండు రోజుల్లో జరిగిన ఈ కార్యక్రమం ఏపీని పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ చేసిన నిర్విరామ కృషికి నిదర్శనంగా నిలిచిందన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గ్లోబల్ కంపెనీలు ఒకే వేదికపై చేరి ఏపీపై ఆసక్తి చూపడం రాష్ట్రంలో కొత్త పెట్టుబడి యుగానికి నాంది పలికిందన్నారు. 410 అవగాహన ఒప్పందాలు కుదిరి, తొమ్మిదిన్నర లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు, 7 లక్షలకు పైగా ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం అంచనా వేయగా, వాస్తవ ఫలితం అంచనాలకు మించి ఉందన్నారు. పారిశ్రామికవేత్తలు పెద్ద సంఖ్యలో క్యూ కట్టి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చారు. సీఐఐ సదస్సు జరుగుతున్నప్పుడే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 24 బిజినెస్ మీటింగ్‌ల్లో పాల్గొన్నారు. మెక్సికో, ఇటలీ, జపాన్, తైవాన్, యూరప్, న్యూజిలాండ్ వంటి పలు దేశాల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొనడం రాష్ట్రంపై ఉన్న గ్లోబల్ ఆసక్తిని తెలియజేస్తుందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా వ్యాపారం సులభతరం కావడం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా అనుమతుల ప్రక్రియ వేగంగా పూర్తి కావడం.. యువనేత నారా లోకేష్ దుబాయ్, లండన్, దావోస్ వంటి ప్రాంతాల్లో పర్యటించి, విదేశీ పెట్టుబడిదారులతో వన్-టు-వన్ సమావేశాలు నిర్వహించడం ద్వారా ఈ భారీ పెట్టుబడులను తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు నాయుడు పాలనలో వచ్చిన పెట్టుబడులు, ఉద్యోగాల గురించి అప్పట్లోనే వైసీపీ దివంగత నేత గౌతమ్ రెడ్డి అసెంబ్లీలోనే ప్రకటించారు. ఆ సమయంలోనే రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులు, 5 లక్షల ఉద్యోగాలు వచ్చాయంటే చంద్రబాబు పాలనపై పెట్టుబడిదారుల్లో ఎంత విశ్వాసం ఉందో అర్థమవుతుంది. ఇప్పుడు సుమారు 25 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులతో సుమారు 25 లక్షలు (మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ 20 లక్షల ఉద్యోగాలు) వస్తున్నాయి.

### పెట్టుబడుల వెల్లువ

సీఐఐ సదస్సులో వివిధ రంగాలలో గణనీయమైన పెట్టుబడులు వచ్చాయి. విద్యుత్ రంగం రూ. 5,33,351 కోట్లు, పరిశ్రమలు రూ. 2,80,384 కోట్లు, మౌలిక వసతులు రూ.2,01,758 కోట్లు, ఐటీఈ అండ్ సీ రూ. 1,59,467 కోట్లు, ఏపీ సీఆర్డీఏ రూ. 48,711 కోట్లు, టూరిజం రూ. 21,036 కోట్లు, ఫుడ్ ప్రాసెసింగ్ రూ. 13,008 కోట్లు, పట్టణాభివృద్ధి రూ. 4,944 కోట్లు, టెక్స్ టైల్స్ రూ. 4,490 కోట్లు, వైద్యారోగ్యం రూ. 4,208 కోట్లు, విద్యా రంగం రూ. 4,359 కోట్లు, ఇతర శాఖలు రూ. 50,000 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ప్రభుత్వం గ్రీన్ ఎనర్జీకి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. దీనికి నిదర్శనంగా, ఆర్జే గ్రూపు అధినేత రవి జయపురియాకు చెందిన అనుబంధ సంస్థ వోల్ట్ అండ్ ల్యాబ్స్ గురించి ప్రస్తావించారు. ఆర్జే గ్రూప్ (వరుణ్ బెవరేజెస్, దేవయాని వంటి అనుబంధ సంస్థలు ఉన్నాయి) తిరుపతి జిల్లా నాయుడుపేటలో గ్రీన్ ఎనర్జీ కోసం రెండు గిగా వాట్ల యూనిట్లు (ఒక గిగావాట్ పవర్ సేల్ సామర్థ్యం, ఇంకోక గిగావాట్ మాడ్యూల్ సామర్థ్యం) ఏర్పాటు చేయడానికి రూ.1743 కోట్ల రూపాయల పెట్టుబడి పెడుతోంది. దీని ద్వారా సుమారు 615 ఉద్యోగాలు వస్తాయి. కాలుష్యాన్ని తగ్గించేందుకు గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యత ఇవ్వడం, పారిశ్రామికవేత్తలకు మౌలిక సదుపాయాలు (విద్యుత్, నీరు) కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. 2019–2024లో జగన్ ప్రభుత్వం ఇంటర్నేషనల్ సమ్మిట్ నిర్వహించినా ఎటువంటి భారీ పెట్టుబడులను తీసుకురాలేక పోయింది. ఆ సమ్మిట్‌లో కేవలం పచ్చళ్లు, నూడిల్స్, కరివేపాకు పొడి, ఫిష్ మార్ట్ వంటి చిన్న ఉత్పత్తులు తెచ్చే కంపెనీలనే తెచ్చారు. చంద్రబాబు నాయుడు హయాంలో వచ్చిన కియా అనుబంధ సంస్థలు, జాకీ, సింగపూర్ స్టార్టప్ కంపెనీలు, ఇతర సంస్థలను భయపెట్టి రాష్ట్రం నుంచి పారదోలారు. పెట్టుబడులు పెడితే అంతు చూస్తామని వైసీపీ నాయకులు బెదిరించారని శ్రీదేవి విమర్శించారు.

### జగన్ పాలన మొత్తం విధ్వంసమే

వైసీపీ పాలనలో విధ్వంసం మాత్రమే జరిగిందని అమరావతి రైతుల బాధలు దీనికి నిదర్శనమన్నారు. అమరావతిని లెజిస్లేటివ్, వైజాగ్ ఎగ్జిక్యూటివ్, కర్నూలు జ్యుడీషియల్ క్యాపిటల్ అని చెప్పి, ఒక్క రాజధానిని కూడా అభివృద్ధి చేయకుండా రాజధాని లేని రాష్ట్రంగా మార్చారు. శతాబ్దాల నుంచి ఆదాయ వనరుగా ఉన్న అమరరాజా వంటి సంస్థలను కూడా పారదోలారు. వైసీపీ పాలనలో పెట్టుబడులు రాకపోవడం వలన, నిరుద్యోగ రేటు (24 శాతం) పెరిగిపోయింది. వైసీపీ ప్రభుత్వంలో ఒక్క ఉద్యోగం కూడా రాలేదని, యువత ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. నిరుద్యోగం కారణాల వల్ల సుమారు 4100 మంది యువకులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇది పీరియాడిక్ లేబర్ సర్వేలో కూడా వెల్లడైందన్నారు. వైసీపీ పాలనలో గంజాయి, ఎర్రచందనం స్మగ్లింగ్, ఇసుక, మైన్ దోపిడీ మాత్రమే జరిగింది. ఇంజనీరింగ్ కళాశాలల్లో గంజాయి సరఫరా చేసి రాష్ట్ర యువతను దానికి బానిసలను చేసి, రాష్ట్రాన్ని మత్తు రాజధానిగా మార్చేందుకు ప్రయత్నించారు. వైసీపీ విద్యార్థి సంఘం అధ్యక్షులు ఈ రంగంలోకి దిగడం దీనికి నిదర్శనమన్నారు. కొత్త కంపెనీలు రాకుండా ఎలా అడ్డుకోవాలి, రాష్ట్ర అభివృద్ధిని ఎలా దిగజార్చాలి అనే కంకణం కట్టుకుని పనిచేశారు. మంచి పనులు జరిగితే క్రెడిట్ తమ ఖాతాలో వేసుకోవడం, చెడ్డ పనులు జరిగితే కూటమి ఖాతాలో వేయడానికి ప్రయత్నించడం వంటి కుతంత్రాలను ప్రయోగించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ హయాంలో కల్తీ మద్యం తయారవుతోందని చూపించేందుకు జోగి బ్రదర్స్‌ను రంగంలోకి దించారు. చివరికి నిజం బయటపడిందని శ్రీదేవి అన్నారు.

### అభివృద్ధి వికేంద్రీకరణ లక్ష్యం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి రాజధానితో పాటు రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఉన్నారు. రాష్ట్రంలోని అందరూ బాగుండాలంటే అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలన్నారు. అందులో భాగంగానే కూటమి ప్రభుత్వం రాయలసీమలో డ్రోన్, రెన్యూవబుల్ ఎనర్జీ, మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లు, టెక్స్‌టైల్స్ హబ్‌లను.. కోస్తాంధ్రలో క్వాంటం వ్యాలీ, ఆక్వా హార్టికల్చర్, పెట్రోకెమికల్, విద్య, వైద్య హబ్‌లుగా.. ఉత్తరాంధ్రలో డేటా హబ్, ఐటీ, ఏఐ, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్ హబ్‌లుగా అభివృద్ధి చేయాలని కంకణం కట్టుకున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు విజన్, మంత్రి లోకేష్ కృషి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్తశుద్ధితో పాటు ప్రధాని మోదీ సహకారంతో డబుల్ ఇంజిన్ సర్కార్ ద్వారా రాష్ట్ర అభివృద్ధికి కూటమి కృషి చేస్తోంది. ఇప్పటికైనా వైసీపీ కూటమి ప్రభుత్వం బురదజల్లడం మానుకోవాలి. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ఇలానే కొనసాగితే రానున్న ఎన్నికల్లో ఇప్పుడున్న 11 సీట్లు కూడా వైసీపీకి రావని శ్రీదేవి స్పష్టం చేశారు.

# డ్రగ్స్ రహిత రాష్ట్రం కోసం సీఎం చంద్రబాబు కృషి

- డ్రగ్స్ వద్దు బ్రో.. నినాదం ప్రతి విద్యార్థి నుండి వినపడాలి
- కూటమి ప్రభుత్వంలో గంజాయి, డ్రగ్స్ మాఫియాలపై ఉక్కు పాదం
- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
- విజయవాడలో నశా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి




విజయవాడ (చైతన్యరథం): రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదం ప్రతి విద్యార్థి నుండి వినపడాలని పిలుపు ఇచ్చారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో కేంద్ర సామాజిక న్యాయ శాఖ చేపట్టిన "నశాముక్త భారత్ అభియాన్" కార్యక్రమం విజయవంతంగా 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమం, విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలోని లయోలా కాలేజీలో మంగళవారం అవగాహనా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డా. స్వామి, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు, ఈగల్ ఎస్పీ కేవీఎస్ నగేష్, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి డా. స్వామి మాట్లాడుతూ సమాజంలో యువత చెడు వ్యసనాలకు బానిసై భవిష్యత్తును అంధకారం చేసుకోకూడదనే సంకల్పంతో డ్రగ్స్‌పై ఉక్కుపాదం ఓపేందుకు రాష్ట్రంలో నూతనంగా ఈగిల్ వ్యవస్థని ఏర్పాటు చేశారన్నారు. ఈగిల్ అంటే ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్ఫోర్స్మెంట్ అని వివరించారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా నిర్యూలనకు ఈ సంస్థ పనిచేస్తుందన్నారు. ఉత్తరాంధ్రలో అధికంగా గంజాయి సాగుచేసే ప్రాంతాలను డ్రోన్స్ ద్వారా గుర్తించి ధ్వంసం చేస్తోందన్నారు. గంజాయి పండించే వారికి అవగాహన కల్పించి, ప్రత్యామ్నాయ పంటలు పండించే విధంగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అంతే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాలలో ఎక్కడైనా గంజాయి మొక్కలు పెంచుతున్నట్లయితే తక్షణమే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, సమాచారం ఇచ్చినందుకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందజేస్తుందని మంత్రి తెలిపారు. గంజాయిని లిక్విడ్, చాక్లెట్ , సిగరెట్ రూపాలలో తరలిస్తున్నారని విద్యాసంస్థల పరిసరాలలో మాదక ద్రవ్యాలను గుర్తించి వాటిని సరఫరా చేసిన వారికీ కఠిన శిక్షలు అమలయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. నశాముక్త భారత్ అభియాన్ ద్వారా అవగాహన కల్పించడంతో పాటు మత్తు పదార్థాలకు బానిసలుగా మారిన వాళ్ల కోసం ప్రతి జిల్లాలో డీ అడిక్షన్ సెంటర్ లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థులు తమ కుటుంబానికి, సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంది ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలని మంత్రి ఉద్బోధించారు. విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సమ్మిట్ ద్వారా 13.5 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడితో పాటు 13 లక్షల ఉద్యోగాలకి ఎంఓయు చేసుకుని యువతను మరింత ప్రోత్సహించే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, హోం మంత్రి అనిత, ఇతర మంత్రులు కూడా డ్రగ్స్ వద్దు బ్రో అంటూ ప్రత్యేకమైన క్యాంపెయిన్ చేస్తున్నారన్నారు. భవిష్యత్తులో దేశానికి, రాష్ట్రానికి, సమాజానికి ఉపయోగపడే శక్తిగా యువత తయారవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. నశాముక్త భారత్ అభియాన్ ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి ధన్యవాదాలు తెలియజేసారు.

### టీడీపీ కార్యకర్త కుమారుడికి

## ఉచితంగా ల్యాప్‌టాప్ అందజేత

అమరావతి (చైతన్యరథం): ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పార్టీ కార్యకర్త కుమారుడి ఇంజనీరింగ్ విద్యాభ్యాసానికి అవసరమైన ల్యాప్‌టాప్‌ను తెలుగుదేశం పార్టీ ఉచితంగా అందజేసింది. కరమచేతి కామేశ్వరరావు, ఆయన కుటుంబ సభ్యులు తొలినుంచీ తెలుగుదేశం పార్టీ అభిమానులుగా ఉంటున్నారు. ఆయన కుమారుడు దుర్గా దాత్విక్ గుంటూరు లోని ఆర్వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో బీ-టెక్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. అమ్మాయి దుర్గ లాస్యప్రియ ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతోంది. కామేశ్వరరావు గత నాలుగు సంవత్సరాలుగా అనేక కారణాల వల్ల ఆర్థికంగా బాగా ఇబ్బంది పడుతున్నారు. ఆయన కుమారుడి ఇంజనీరింగ్ విద్యకు సంబంధించి ల్యాప్‌టాప్ అవసరం అయింది. కానీ కొనుగోలు చేసే ఆర్థిక పరిస్థితి ఆయనకు లేదు. ఈ నేపథ్యంలో సాయం కోసం విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్‌కు విజ్ఞప్తి చేసుకున్నారు. దీనిపై మంత్రి లోకేష్ వెంటనే స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు పార్టీ నిధులతో ల్యాప్‌టాప్ కొనుగోలు చేసి.. మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి పరుచూరి అశోక్‌బాబు చేతుల మీదుగా కామేశ్వరావుకు అందజేశారు.



# స్వర్ణోత్సవ రాజనీతిజ్ఞుడు చంద్రబాబు


- 1975లో రాజకీయ జీవితం ప్రారంభం
- చిత్తూరు జిల్లా, పులిచర్ల శాఖ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా 50 ఏళ్ల క్రితం మొదలైన ప్రస్థానం
- శాసనసభ్యుడిగా 41 వసంతాలు పూర్తి చేసుకున్న అనుభవజ్ఞుడు
- సీఎంగా 15 ఏళ్లు, శాసనసభ ప్రతిపక్ష నాయకుడిగా 15 ఏళ్లు పూర్తి చేసుకున్న రాజనీతి కోవిదుడు

విజనరీ నాయకుడు చంద్రన్న రాజకీయ ప్రస్థానం సుదీర్ఘం. 50 ఏళ్ల క్రితం 1975లో రాజకీయ జీవితం ప్రారంభించిన ఆయ న దేశ రాజకీయాల్లో చక్రం తిప్పారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎంఏ ఎకనామిక్స్ చేసిన ఆయన.. అనంతరం పీహెచ్‌డీ చేస్తుండగానే 1975లో చిత్తూరు జిల్లా పులిచర్ల నుంచి తన రాజకీయ ప్రస్థానాన్ని మొదలు పెట్టారు. 1978లో చంద్రగిరి నియోజకవర్గం నుంచి తొలిసారి శాసనసభ్యులుగా ఎన్ని కయ్యారు. 1980-82 కాలంలో ముఖ్యమంత్రులు టి.అంజయ్య, భవనం వెంకట్రామ్ మంత్రివర్గాల్లో సినిమాటోగ్రఫీ, చిన్న నీటి పారుదల, సాంకేతిక విద్య, పాడి పశుసంవర్ధక శాఖల మంత్రిగా పనిచేశారు. 1982లో ఎన్టీఆర్ ఆహ్వానంతో తెలుగుదేశం పార్టీలో చేరారు. నాడు ఎన్టీఆర్‌ను నాదెండ్ల భాస్కరరావు, ఆనాటి కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ రాజశేఖరరెడ్డి పదవి నుంచి దింపి నప్పుడు... తిరిగి ముఖ్యమంత్రిగా చేయడంలో చంద్రబాబు కీలక పాత్ర వహించారు. తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా, 1986లో పార్టీ అనుబంధ సంఘం "తెలుగు విద్యార్థి"ని చంద్రబా బు ప్రారంభించారు. 1989లో తెలుగుదేశం పార్టీ పరాజయం పొందినప్పుడు ప్రతిపక్ష నేతగా ఉన్న ఎన్టీఆర్‌కు చేదోడు, వాదోడు గా ఉండి 1994లో పార్టీ ఘన విజయానికి ముఖ్య కారకుల య్యారు. 1994లో ఆర్థిక, రెవెన్యూ శాఖల మంత్రిగా పనిచేశారు. ఆనాడు లక్ష్మీపార్వతి వల్ల పార్టీలో సంక్షోభం తలెత్తినప్పుడు పార్టీని కాపాడుకుని 01-09-1995 తేదీన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రిగా మొదటిసారి ప్రమాణస్వీకారం చేసి 13-05-2004 వరకూ కొనసాగారు. తిరిగి రెండవ సారి 08-06-2014 నుంచి 29-05-2019 వరకూ విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా పనిచేశారు. మూడవ సారి 12-06-2024న తిరిగి ప్రమాణం స్వీకారం చేసి ముఖ్యమంత్రిగా 15 ఏళ్లు ప్రస్థానాన్ని పూర్తి చేసుకు ని విజయవంతంగా కొనసాగుతున్నారు. ఆంధ్ర రాష్ట్రం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, విభజిత ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఇప్పటివరకూ ఏ ఒక్కరూ కూడా 15 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన వారు లేరు.

1996- 98లో 13 పార్టీల జాతీయ కూటమి అయిన యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా ఉండి హెచ్‌డి దేవెగౌడ (1996-97), ఐకె గుజ్రాల్ (1997-98)లను ప్రధానమంత్రులు గానూ అబ్దుల్ కలాంను రాష్ట్రపతిగా, దళితవర్గానికి చెందిన జీఎంసీ బాలయోగిని లోక్‌సభ స్పీకర్‌గా చేయడంలో కీలక పాత్ర పోషించా రు. కావలి ప్రతిభా భారతిని శాసనసభ స్పీకర్‌గా, పూసపాటి అశోక్‌గజపతిరాజును గవర్నర్‌గా, బోళ్ళ బుల్లిరామయ్య, కింజరాపు ఎర్రంనాయుడు, ఉమ్మారెడ్డి వేంకటేశ్వర్లు, సముద్రాల వేణుగోపాల చారి, రేణుకాచౌదరి, సుజనా చౌదరి, కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌లను కేంద్రమంత్రులుగా చేసి జాతీయ రాజకీయాలలో చక్రం తిప్పారు. 1999 లోక్‌సభ ఎన్నిక లలో టీడీపీ 29 ఎంపీ సీట్లు గెలుచుకుంది. ఆనాటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆహ్వానం మేరకు 2000 మార్చిలో హైదరాబాదును సందర్శించ డం, దేశ రాజకీయాలలో మునుపెన్నడూ ఏ ముఖ్యమంత్రికి దక్కని అరుదైన గౌరవం ఆయనకే దక్కింది.

1998లో భారత ప్రభుత్వం పోఖ్రాన్ అణు పరీక్షలు నిర్వహిం చిన సందర్భంలో ప్రపంచ దేశాలు, భారతదేశంపై ఆంక్షలు విధించిన సందర్భంలో కూడా ప్రపంచ బ్యాంకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నిధులు విడుదల చేయడం అంతర్జాతీయంగా చంద్రబా బుకు ఉన్న పేరు ప్రఖ్యాతలే కారణం. ఆనాడు ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడుగా పనిచేసిన జేమ్స్ డి.వుల్ఫన్సన్‌కు, ప్రస్తుత ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగాకు ఇష్టమైన నాయకుడు చంద్ర బాబు. మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్‌కు, పారిశ్రామిక వేత్తలు రతన్ టాటా, ముఖేష్ అంబానీ, ఎందరో జాతీయ, అంతర్జాతీయ పారి శ్రామిక వేత్తలు, రజనీకాంత్, కృష్ణ, అక్కినేని నాగేశ్వరరావు లాంటి అగ్ర సినీ నటులు, చెరుకూరి రామోజీరావు, వేమూరి రాధాకృష్ణ లాంటి పత్రికాధిపతులు కూడా చంద్రబాబు దార్శనికతకు ముగ్ధులైన వారే. దేశంలోని పలు రాష్ట్రాలకు ముఖ్యమంత్రులుగా చేసిన వసుంధర రాజే సింధియా, ఎం.కరుణానిధి, జయలలిత, జెహెచ్ పటేల్, ఎస్ఎమ్ కృష్ణ, నవీన్ పట్నాయక్, జ్యోతిబసు, బుద్ధ దేవ భట్టాచార్య, ఏకే ఆంటోని, ఈకె నయనార్, ములాయం సింగ్ యాదవ్, ఫరూక్ అబ్దుల్లా, లాలు ప్రసాద్‌యాదవ్, మాయా వతి, అఖిలేష్ యాదవ్, ఉమాభారతి, ప్రస్తుత ముఖ్యమంత్రులైన రేవంత్‌రెడ్డి, ఎమ్.కె.స్టాలిన్, నితీష్‌కుమార్, మమతా బెనర్జీలకు, పార్టీలకు అతీతంగా చంద్రబాబు సన్నిహితులు.

ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ప్రముఖ మాజీ కేంద్ర మంత్రులు ఎల్‌కె అద్వాని, జార్జ్ ఫెర్నాండెస్, ఎస్ఆర్ బొమ్మై, సూర్జిత్‌సింగ్ బర్నాల, ఇంద్రజిత్ గుప్తా, రామకృష్ణ హగ్డే, జస్వంత్ సింగ్, యశ్వంత్ సిన్హా, మురళీ మనోహర్‌జోషి, ప్రమోద్ మహాజన్, సాహెబ్‌సింగ్ వర్మ, శరద్ యాదవ్, అరుణ్ శౌరి, అరుణ్ జెట్లీ, సురేశ్ ప్రభు, రామ్ విలాస్ పాశ్వాన్, సుష్మ స్వరాజ్, రామ్ జెఠ్మలాని, పి.చిదంబరం, మేనకాగాంధీ, బండారు దత్తాత్రే య, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కారీ, నిర్మలా సీతారామన్, శివరాజ్‌సింగ్ చౌహన్, అశ్వనీ వైష్ణవ్, జెపి నడ్డా, హెచ్.డి.కుమార స్వామి, పీయూష్ గోయల్ తదితరులతో సాన్నిహిత్యం ఉంది. 09-09-2023 తేదీన జగన్ ప్రభుత్వంలో నంద్యాలలో చంద్రబా బును అరెస్ట్ చేసి 53 రోజులు రాజమండ్రి కేంద్ర కారాగారంలో ఉన్నప్పుడు దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ఆయనకు మద్దతుగా తమ గళం వినిపించారు. సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల అమలులో చంద్రబాబు విజన్‌ను నారా లోకేష్ రూపంలో ముందుకు తీసుకె ళ్లగల రాజకీయ వారసుడు వచ్చాడు. స్వర్ణోత్సవ రాజనీతిజ్ఞుడు చంద్రబాబు..రాజకీయాలలో వజ్రోత్సవం (75 ఏళ్లు) జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు.



- తోపూరి గంగాధర్,
టీడీపీ కేంద్ర కార్యాలయ సమాచార హక్కు విభాగం,
టీడీపీ పరిశోధనా, సమాచార కమిటీ

## -'అన్నదాత సుఖీభవ'-

# రైతన్నకు దన్ను చంద్రన్న!

రైతే దేశానికి వెన్నెముక అంటూనే.. ఆ వెన్నెముకను విరిచేసిన పాలన జగన్‌రెడ్డిది. గెలుపు కోసం రైతు సంక్షేమం కహానీలు చెప్పి.. అధికారంలోకి వచ్చాక రైతుకు ఆధారమైన వ్యవసాయ రంగాన్నే అధోగతికి నెట్టిన పాలకుడు వైఎస్ జగన్‌రెడ్డి. ఐదేళ్ల రైతు కష్టానికి కాలం చెల్లింది. కూటమి సారథ్య నేతగా చంద్రబాబు అధికారంలోకి వస్తూనే.. రైతన్నకు భరోసా పథకంతో స్వాంతన చేకూర్చారు. అదే -అన్నదాతా సుఖీభవ! ఐదేళ్లపాటు "వైఎస్సార్ రైతు భరోసా" పేరిట రైతన్నలను నిలువునా దగాచేసిన ఓటు బ్యాంకు రాజకీయాలకు -చంద్రబాబు ఇస్తోన్న సమాధానమిది. రాష్ట్రం మొత్తానికి అన్నం పెడుతున్న రైతన్నకు అగ్రపీఠమేస్తూ.. నిజమైన భరోసానిచ్చే పథకాన్ని పునరుద్ధరించారు. రైతుకు బాసటగా నిలిచే చంద్రన్న నాయకత్వం.. నిజంగా అన్నదాతకు ఆశాజ్యోతి. ఓటు బ్యాంకు రాజకీయాలను పక్కనపెట్టి, రైతు శ్రేయస్సుకు కొత్త నిర్వచనమిస్తూ ప్రభుత్వం మలివిడత నిధుల విడుదలకు రంగం సిద్ధం చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా వేల కోట్ల రూపాయల లబ్ధి.. ఈరోజు రైతుల ఖాతాలకు జమకానుంది.

**వైఎస్సార్ రైతు భరోసాతో లక్షలాది రైతులకు కోత**

జగన్‌రెడ్డి హయాంలో రైతులకు జరిగింది మోసం తప్ప మరొకటి కాదు. వైఎస్సార్ రైతు భరోసాతో రూ.13,500 ఇస్తానని హామీనిచ్చి, అందులో కేంద్రమిచ్చే రూ.6,000ను తన ఖాతాలో వేసుకుని, రాష్ట్రవాటాగా కేవలం రూ.7,500 మాత్రమే ఇచ్చి, అంతా తానే ఇచ్చినట్టు అబద్ధాల ప్రచారం చేసుకున్నాడు జగన్‌రెడ్డి. ఈ వంచన కారణంగా ఒక్కో రైతు ఐదేళ్లలో కనీసం రూ.30,000 నష్టపోయాడు. అంతేకాదు 64 లక్షలమందికి పథకాన్ని వర్తింప చేస్తానని ప్రగల్భాలు పలికి.. అమలులో 45 లక్షలమందికి కుదించి, లక్షలాది అర్హులైన రైతులకు దగా చేశాడు.

**అన్నదాత సుఖీభవతో నిజమైన భరోసా**

చంద్రబాబు తీసుకువచ్చిన 'అన్నదాత సుఖీభవ' పథకం రైతు కుటుంబాలకు నిజమైన ఆర్థిక భరోసా. కేంద్రం పీఎం కిసాన్ కింద ఇచ్చే రూ.6,000, రాష్ట్రం తనవాటాగా రూ.14,000 కలిపి, ఏటా రూ.20,000 పెట్టుబడి సాయంగా రైతు సంక్షేమానికి కట్టుబడిన కూటమి సంక్షేమ సాహసం ఇప్పుడు కళ్లముందు కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, 2025 ఆగస్టులో తొలివిడతగా 46.85 లక్షలమంది రైతులకు రూ.7,000 చొప్పున



మొత్తం రూ.3,174 కోట్లు జమ చేసింది. తొలివిడత అమలు తర్వాత ఫిర్యాదుల కోసం గ్రీవెన్స్ మాడ్యూల్‌ను ఏర్పాటుచేసి, కొత్తగా 47,161 మంది అర్హులను గుర్తించి.. సెప్టెంబర్ 4న రూ.5,000 చొప్పున అదనంగా రూ.23.58 కోట్లు జమ చేసింది. అర్హతవున్న ప్రతి రైతుకూ న్యాయం చేయాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడి ఆకాంక్ష.

**రెండోవిడతగా రూ.3135 కోట్ల జమకు సిద్ధం**

రైతే దైవమని చాటిచెప్పడానికి సీఎం చంద్రబాబు నేడు (బుధవారం) వైఎస్సార్ జిల్లాలోని కమలాపురం నియోజకవర్గం నుంచి రెండోవిడత నిధుల విడుదలకు శ్రీకారం చుట్టారు. 46,85,838 రైతు కుటుంబాల ఖాతాల్లోకి రూ.3,135 కోట్లు జమ చేయనున్నారు. ఒక్కో రైతు ఖాతాలో కేంద్రం వాటా రూ.2,000, రాష్ట్ర వాటా రూ.5,000 చొప్పున మొత్తం రూ.7,000 ఒక్కో రైతు ఖాతాకు జమకానుంది. ఇందులో రాష్ట్ర వాటాగా రూ.2,342.92 కోట్లు, కేంద్ర వాటాగా రూ.792.09 కోట్లు ఉన్నాయి. రెండు విడతల్లో కలిపి పీఎం కిసాన్ -అన్నదాత సుఖీభవ పథకం కింద మొత్తం రూ.6,309.44 కోట్లు రైతులకు అందించనున్నారు.

**ధాన్యం కొనుగోళ్లలో కూటమి రికార్డు**

చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో వేగం, పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ విప్లవాత్మక మార్పులు తెచ్చింది. అధికారంలోకి వచ్చిన మాసంలోనే గత ప్రభుత్వంలో పెండింగ్‌లోవున్న రూ.1,674 కోట్ల బకాయిలను చెల్లించి రైతన్నలకు ఊరటనిచ్చింది. రికార్డుస్థాయిలో 55.79 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. అత్యంత కీలకమైన అంశం ఏమిటంటే, ఇకపై ధాన్యం అమ్మిన రైతులకు 24 గంటల్లోపు నగదు వారి ఖాతాల్లో జమయ్యేలా నిబంధన పెట్టి, నిజమైన ఆర్థిక భరోసానిచ్చింది. ధాన్యం అమ్మదలిచిన రైతుల కోసం 73373-59375 నంబర్‌కు 'హాయ్' అని సందేశం పంపగానే, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా మార్గదర్శకం అందించేలా టెక్నాలజీని వినియోగంలోకి తెచ్చింది. అదే -జగన్‌రెడ్డి పాలనలో కేవలం 48 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలుచేసి.. నగదు జమ చేయడానికి మూడు నెలల సమయం తీసుకుంది. అంతేకాదు.. రూ.1,674 కోట్ల బకాయిలు పెట్టి దగా చేసింది.

**కౌలు రైతులకు ఊరట**

వైసీపీ పాలనలో కౌలు రైతులు అత్యంత దుర్భరమైన అవస్థలు అనుభవించారు. జగన్‌రెడ్డి ప్రభుత్వం కౌలు రైతులకు భరోసా ఇవ్వకపోగా, వారి సంఖ్యను కేవలం 1.43 లక్షలకు కుదించి, వారికి అందే రూ.7,500లో కూడా దగాచేసి, వారిని పూర్తి నిర్లక్ష్యానికి గురి చేసింది. ఫలితంగా, కౌలు రైతుల ఆత్మహత్యల్లో ఏపీ దేశంలోనే రెండోస్థానంలో ఉందంటే.. ఏవిధంగా నష్టపోయి ఉంటారో అర్థమవుతుంది. కానీ, చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, కౌలు రైతులపట్ల నిజమైన భరోసా ప్రకటించింది. 9.13 లక్షల సీసీఆర్సీ కార్డులు మంజూరుచేసి, వారిని రైతు భరోసా పరిధిలోకి తీసుకువచ్చింది. అంతేకాకుండా, ఈ క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తయ్యిన తరువాత రాష్ట్ర నిధులనుంచే వారికి రెండు విడతలుగా రూ.20,000 ఆర్థిక సాయం అందించనున్నట్టు ప్రకటించింది. కౌలు రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ.. వారిని ఆర్థికంగా బలోపేతంచేసే దిశగా రూ.3,826 కోట్లు పంట రుణాలుగా మంజూరు చేసింది. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో కౌలురైతులను పక్కన పెట్టాడు. వారికి అందాల్సిన రైతుభరోసా అందించకుండా దగాకు పాల్పడ్డాడు. గతంలో నిర్లక్ష్యం, నిరాదరణ తప్పని కౌలు రైతన్నలకు, కూటమి ప్రభుత్వం ఇస్తోన్న ఈ డబుల్ ధమాకా భరోసా వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతోంది.

**కూటమి భరోసాతో తగ్గిన ఆత్మహత్యలు**

జగన్‌రెడ్డి సారథ్యంలోని వైసీపీ పాలన రైతులకు మరణశాసనంలా మారింది. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం, అన్యాయం కారణంగా ఆంధ్రప్రదేశ్ దేశంలో రైతు ఆత్మహత్యల సంఖ్యలో 3వస్థానంలో, కౌలు రైతుల ఆత్మహత్యల్లో 2వ స్థానంలో నిలిచింది. మానవ హక్కుల సంఘాలు, రైతు స్వరాజ్య వేదిక నివేదికల ప్రకారం.. ఆ ఐదేళ్లలో ఏకంగా 2,552మంది రైతులు ప్రాణాలు తీసుకున్నారు. అంటే ఏటా సగటున 300మందికి పైగా బలయ్యారు. అయితే, చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు నిజమైన భరోసా లభించింది. జూన్ 2024 తర్వాత కూటమి పాలననుంచీ రైతుల ఆత్మహత్యలు తగ్గుముఖం పట్టాయి. అన్నదాత సుఖీభవ వంటి సంక్షేమ పథకాలు, సకాలంలో ధాన్యం కొనుగోలు, రుణ సహాయం అందించడంవంటి చర్యల ద్వారా.. కూటమి ప్రభుత్వం రైతులకు మానసిక స్థైర్యాన్ని కల్పించి, ఆత్మహత్యల రేటును గణనీయంగా తగ్గించింది.

**రైతు సంక్షేమానికి కొత్త ఒరవడి**

గత ఐదేళ్లుగా జగన్‌రెడ్డి ప్రభుత్వం మోసం, నిర్లక్ష్యాలతో రైతన్న జీవితాల్లో చీకట్లు నింపింది. కౌలు రైతుల నిర్లక్ష్యం, ధాన్యం బకాయిల ఆలస్యం, రైతు ఆత్మహత్యల పెరుగుదల వంటివి -వంచన పాలనకు నిలువెత్తు నిదర్శనాలు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, "అన్నదాత సుఖీభవ" పథకం ద్వారా ప్రతి రైతు కుటుంబానికి పెట్టుబడి సాయం అందించి భరోసానిచ్చింది. ధాన్యం అమ్మిన వెంటనే నగదు జమ, టెక్నాలజీ వినియోగం, రికార్డుస్థాయిలో కొనుగోలు, కౌలు రైతులకు ప్రత్యేక ఆర్థిక సాయంవంటి విప్లవాత్మకమైన మార్పులతో పాలన సాగిస్తోంది. దీని ఫలితంగానే, రాష్ట్రంలో రైతు ఆత్మహత్యల సంఖ్య గణనీయంగా తగ్గి, రైతులకు నిజమైన మానసిక స్థైర్యం లభించింది. కూటమి ప్రభుత్వం కేవలం మాటలకు పరిమితం కాకుండా, చేతల్లో భరోసానిచ్చి.. రైతు సంక్షేమానికి కొత్త ఒరవడిని ఆవిష్కరించింది.

టి నిర్మలాజ్యోతి,
అనలిస్ట్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

# కుట్రలు కొనసాగిస్తున్న వైసీపీ

- పెట్టుబడులకు ముందుకొచ్చిన సంస్థలపై బురద జల్లడం హేయం
- వోల్ట్ సన్ ల్యాబ్స్ సంస్థపై అడ్డగోలు ఆరోపణలు
- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్లరమేష్

అమరావతి (చైతన్యరథం): వోల్ట్ సన్ ల్యాబ్స్ ఏదో అల్లాటప్పా సంస్థ కాదని కేవలం భూముల కోసమో, ఇతర అవసరాల కోసమో స్థాపించిన సంస్థ అంతకంటే కాదని టీడీపీ అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ స్పష్టం చేశారు. ఈ విషయంలో జగన్ రెడ్డి విమర్శలను రమేష్ తీవ్రంగా ఖండించారు. అమరావతిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా రవి జైపురియా నేతృత్వంలో పని చేస్తున్న ఆర్జే గ్రూప్‌నకు మంచి పేరుందన్నారు. రూ. 90,000 కోట్లకు పైబడిన ఆర్ జె గ్రూప్ సంస్థకు వివిధ రంగాల్లో ప్రావీణ్యత ఉంది. ఫుడ్ ప్రాసెసింగ్, విద్య, ఆరోగ్యం, హాస్పిటాలిటీ, రియల్ ఎస్టేట్, పెప్సీకో బాట్లింగ్ భాగస్వామిగా, కేఎఫ్‌సీ, పిజ్జాహట్, కాస్టా కాఫీ వంటి ప్రధాన క్యూఎస్ఆర్ బ్రాండ్‌లను ఫ్రాంచైజీ రూపంలో నడిపే సంస్థగా ఆర్‌జె గ్రూప్ ఖ్యాతినొందిందన్నారు. ఆర్‌జె గ్రూప్‌నకు చెందిన వివిధ సంస్థలు ఇండియాతో పాటు దుబాయ్, థాయ్‌ల్యాండ్, మొరాకో వంటి దేశాల్లో కూడా వ్యాపార కార్యాలయాలు నిర్వహిస్తున్నాయని ఆయన తెలిపారు. రవి జైపురియాకు చెందిన ఆర్జే గ్రూప్ లో భాగమైన వోల్ట్‌సన్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని ఏదో అనామక కంపెనీగా చిత్రీకరించేందుకు వైసీపీ ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. తిరుపతి జిల్లాలోని నాయుడుపేట ఎంపీఎస్ఈసీలో రూ. 1,743 కోట్ల పెట్టుబడితో గ్రీన్‌ఫీల్డ్ సౌర సెల్, మాడ్యూల్ తయారీ యూనిట్‌ను వోల్ట్‌సన్ ల్యాబ్స్ సంస్థ ఏర్పాటు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ పెట్టుబడి ద్వారా 415 ప్రత్యక్ష ఉద్యోగావకాశాలు ఏర్పడతాయన్నారు. ఇక ప్రభుత్వ పాలసీల్లో భాగంగా ప్రాజెక్టు వేగంగా ప్రారంభం కావడానికి రాయితీలను ప్రకటించిందన్నారు. వోల్ట్‌సన్ కంపెనీ చేపట్టబోయే ప్రాజెక్టు అధునాతన, హై-వాల్యూ గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి తయారీ చేయనుందని తెలిపారు. వాస్తవాలు ఈ విధంగా ఉంటే.. రూ. 90 వేల కోట్ల టర్నోవర్‌తో బిజినెస్ చేసే ఆర్జే గ్రూప్.. ఏపీలోని 37 ఎకరాల కోసం వోల్ట్ సన్ అనే సంస్థను స్థాపించిందని వైసీపీ నేతలు అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నారని రమేష్ మండిపడ్డారు. మంచి పేరున్న సంస్థకు రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రాయితీలిస్తే.. అర్థంపర్థం లేని ఆరోపణలతో రాష్ట్రానికి మేలు జరగకుండా, కంపెనీలు రాకుండా, భయభ్రాంతులకు గురి చేసేందుకు జగన్ మోహన్ రెడ్డి కుట్రలు



పన్నుతూనే ఉన్నారని రమేష్ మండిపడ్డారు. వైసీపీ ఎన్ని కుట్రలు పన్నినా అవి చెల్లుబాటు కావనే విషయం ఇటీవల జరిగిన భాగస్వామ్య సదస్సుతో తేలిపోయిందన్నారు.

## ఎంతటి వారిరైనా వదిలిపెట్టం... ఆవు మాంసం ఎగుమతిపై ఎమ్మెల్యే గంటా హెచ్చరికలు



ఆనందపురం (చైతన్యరథం): అక్రమంగా ఆవు మాంసాన్ని ఎగుమతి చేసిన నిందితులతో పాటు వారి వెనక ఎవరున్నా వదిలిపెట్టేది లేదని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హెచ్చరించారు. శొంట్యాం సమీపంలోని దిబ్బడిపాలెం శ్రీమిత్రా మెరైన్ కోల్డ్ స్టోరేజ్ ను మంగళవారం ఆయన సందర్శించారు. కోల్డ్ స్టోరేజ్ లోని కొంత భాగాన్ని లీజుకు తీసుకున్న తెలంగాణాకు చెందిన మిష్ ఓవర్సీస్ సంస్థ ఎగుమతి చేస్తున్న మాంసం కంటైనర్‌లో ఆవు మాంసం కూడా కలిసి ఉందని తనిఖీల్లో బయటపడిందన్నారు. 189 టన్నుల మాంసం నుంచి ఆరు శాంపిల్స్ తీసుకుని పరీక్షలకు పంపగా.. 87 టన్నుల ఆవు మాంసంగా గుర్తించారని చెప్పారు. జన్మనిచ్చిన తల్లితో సమానంగా చూసే దేశంలో గోవధను మహాపాపంగా పరిగణిస్తామని.. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన వారి వెనుక ఉన్న అరాచక శక్తుల నిగ్గు తేలుస్తామని తెలియజేశారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ ఉదంతంపై సీరియస్‌గా ఉన్నారని.. మిష్ ఓవర్సీస్ సంస్థ యజమానులను ఇప్పటికే అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. కోల్డ్ స్టోరేజ్ లీజుకు ఇచ్చినప్పుడు తమ ప్రాంగణంలో ఏం వ్యవహారాలు జరుగుతున్నాయో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని శ్రీ మిత్రా మెరైన్ కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యానికి సూచించారు. సంఘ విద్రోహ శక్తులు నమ్మబలికి పేలుడు పదార్థాలు ఇలా నిల్వ ఉంచితే ఏం చేశారని ప్రశ్నించారు. బాపట్ల ఎమ్మెల్యేతో ఈ కోల్డ్ స్టోరేజ్ యజమానికి కొంత పరిచయం ఉండడంతో.. వారిద్దరూ కలిసి ఉన్న ఫోటోలు వైరల్ చేశారన్నారు. కోల్డ్ స్టోరేజ్ లోపల సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో ఎసిపి అప్పలరాజు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, ఘట్టమనే సుభాష్ చంద్రబోస్, శాఖారి శ్రీనివాస్, తాత్రజు అప్పారావు, బి.ఆర్.బి. నాయుడు, మహంతి శివాజీ, గంట్రెడ్డి స్వామి నాయుడు, బలిరెడ్డి మల్లిఖార్జునరావు, ఎర్ర రాజు, కె. శ్రీకాంత్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

**రోడ్డు విస్తరణ బాధితులకు హామీ**

అడవివరం నుంచి సత్తరువు జంక్షన్ వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణలో షాపులు కోల్పోతున్న బాధితులకు న్యాయం చేస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. బాధితుల విజ్ఞప్తి మేరకు సత్తారువు జంక్షన్ లో రోడ్డు విస్తరణ ప్రాంతంలో పర్యటించి.. షాపులను దౌర్జన్యంగా తొలగించడం వంటి చర్యలు వద్దని ఆదేశించారు.

## బాధ్యతాయుత పాలనతో పదవులకు వన్నె తేవాలి

- ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైరపర్సన్ మిరియాల శిరీష దేవి



రంపచోడవరం (చైతన్యరథం): పార్టీని నమ్ముకుని చిత్తశుద్ధితో పనిచేసిన వారికి సముచిత స్థానాలు కల్పించటంలో కూటమి పార్టీ మంచి గుర్తింపు కల్పిస్తుందని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషదేవి అన్నారు. స్థానిక ఇందుకూరు గ్రామంలో మంగళవారం దేవీపట్నం మండలం పార్టీ మరియు అనుబంధం సంఘాలు, ఇందుకూరుపేట సొసైటీ చైర్మన్ మరియు పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం కార్యక్రమం మండలం పార్టీ అధ్యక్షులు గోళ్ళ చంటిబాబు అధ్యక్షతన నిర్వహించారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస యాదవ్ సౌజన్యములో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్న వారికి తగిన సమయంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు. అలాగే ప్రతీ కార్యకర్త యొక్క కష్టసుఖాలు తనకు తెలుసునన్నారు. కార్యకర్తల అభీష్టమే శిరోధార్యం అన్నారు. సమయానుకూలంగా అందరికీ మంచి అవకాశాలు వస్తాయన్నారు. పార్టీ శ్రేణులు నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిస్కారంలో సహాయ సహకారాలు అందించాలని కోరారు. మండలం స్థాయిలో ఉన్న కమిటి ఆధ్వర్యంలో సమస్యలు పరిస్కారం చేయాలని అలా కాని పక్షములో నా వద్దకు వస్తే నేను పరిస్కారం దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన వారికి అభినందనలు తెలిపారు. పదవులు పొందిన వారు ఆయా పదవులు బాధ్యతా యుతంగా చేయాలని పార్టీకి మంచి పేరు తేవాలని సూచించారు. అలాగే బాధ్యతలు స్వీకరించిన వారికి ఘన సన్మానం చేశారు. నిత్యం ప్రజల్లో ఉంటూ పార్టీకి మంచి పేరు తెచ్చేలా వ్యవహారించాలని సూచించారు. ప్రజలకు మన కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న చేసిన సంక్షేమ అభివృద్ధి పథకాలపై మంచి అవగాహన కల్పించి పార్టీపై నమ్మకం ఉండేలా కూటమి నాయకులు కార్యకర్తలను కలుపుకొని ఐక్యముగా ముందుకు నడవాలని సూచించారు. కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలపై వివరిస్తూ కష్టకాలంలో కూడా వెన్నంటి ఉండాలని అప్పుడే గుర్తింపు వస్తుందన్నారు.

## పల్లెల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట : డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు



ఉండి (చైతన్యరథం): పల్లెల్లో మౌలిక సౌకర్యాల కల్పన, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఉండి ఎమ్మెల్యే, శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘు రామకృష్ణ రాజు అన్నారు. పాలకోడేరు మండలంలోని కోరుకొల్లు, ఎస్సీ పేటలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన 4 సీసీ రోడ్లను ప్రారంభించారు. మోగల్లులో రూ.20 లక్షలతో నిర్మించిన రైతు సేవా కేంద్రం, రూ.10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మైక్రో ఫిల్టర్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోగల్లులో రూ.కోటి వ్యయంతో పైపులైన్లు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

**ఇళ్ల లబ్దిదారులకు రూ.2.50 లక్షలు**

ఇల్లు నిర్మించుకోడానికి అర్హులైన లబ్ధిదారులకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.2,50,000 ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కనుమూరు రఘు రామకృష్ణ రాజు తెలిపారు. అర్హులైన వారు తమ వివరాలను గ్రామ/మున్సిపల్ వార్డు, సచివాలయంలో నవంబర్ 30 లోపు నమోదు చేసుకోవాలని కోరారు.

## ప్రమాద బాధితుడికి అండగా నిలిచిన ఎమ్మెల్యే మద్దిపాటి



గోపాలపురం (చైతన్యరథం): నల్లజర్ల మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన ఆనిశెట్టి రాంబాబుది నిరుపేద కుటుంబం. ఇటీవల ప్రమాదశాత్తు రోడ్డు ప్రమాదానికి గురై తలకి బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో అత్యవసర వైద్యం నిమిత్తం రాజమండ్రిలోని ప్రైవేట్ హాస్పిటల్‌కి తరలించారు. వైద్య పరీక్షలు అనంతరం తలకు బలమైన గాయాలు కావడంతో మొదడులో రక్తస్రావం జరిగి ప్రాణపాయ స్థితికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు వెంటనే స్పందించి అండగా నిలిచారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించేలా ప్రత్యేక ఏర్పాటు చేయించారు. రెక్కాడితేనే డొక్కాడని నిరుపేద కుటుంబం కావడంతో బాధితుడి రాంబాబు ఆస్పత్రి బిల్లులు సైతం ఎమ్మెల్యే చెల్లించారు. మంగళవారం అపస్మారక స్థితి నుంచి బయటకు రావడంతో స్వయంగా ఎమ్మెల్యే వెంకటరాజు బాధితుడితో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. భయపడొద్దని అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తమ కుటుంబ పెద్దను కాపాడిన ఎమ్మెల్యేకు రాంబాబు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు... బొరగం



పోలవరం (చైతన్యరథం): రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని ట్రైకార్ సంస్థ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. మంగళవారం పోలవరం-1 రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ.. క్వింటా వరికి మద్దతు ధర గ్రేడ్- ఏ రకానికి రూ.2,389, కామన్ రకానికి రూ.2,369గా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ధాన్యాన్ని విక్రయించిన 24 గంటల్లో రైతుల ఖాతాలో ప్రభుత్వం నగదు జమ చేస్తున్నట్లు చెప్పారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు.

## రాబోయే రోజుల్లో 400 పడకలకు పెంచుతాం : కొణతాల



అనకాపల్లి (చైతన్యరథం): అర్హులందరికీ పింఛన్లు అందించేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. మంగళవారం అనకాపల్లిలోని ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో నిర్వహించిన సదరం శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మహిళలకు అందుతున్న వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. 200 పడకలున్న జిల్లా ఆసుపత్రిని రాబోయే రోజుల్లో 400 పడకలకు పెంచుతామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పార్టీ కార్యాలయ నిర్మాణానికి స్థలం కేటాయించండి



పాలకొండ (చైతన్యరథం): పార్టీ కార్యాలయ నిర్మాణానికి తగిన స్థలం కేటాయించాలని కోరుతూ మంగళవారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ పడాల భూదేవి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు సూచనల మేరకు నియోజకవర్గ కేంద్రంలో పార్టీ కార్యాలయ నిర్మాణం చేపట్టాలని భావించడం జరిగిందని, కార్యాలయం నిర్మాణం కొరకు 50 శెంట్ల ప్రభుత్వ స్థలం లీజ్ ప్రాతిపదికన కేటాయించి, నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్, పాలకొండ మండల కన్వీనర్ గండి రామినాయుడు, అరకు పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షులు సుమంత్ నాయుడు, మాజి టౌన్ అధ్యక్షులు గుమ్మడి సింహాద్రి, మజ్జి జయ శంకర్, బిడ్డిక జయలక్ష్మి, చోంగ శివనంద, రాంబాబు, ఏఎంసీ డైరెక్టర్ మూర్ మోహనరావు, గణేష్, ధనుంజయ్‌రావు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజయవాడ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులపై ఎంపీ కేశినేని శివనాథ్ ఆరా

**●రైల్వే డీఆర్ఎమ్ మోహిత్ సోనాకియాతో ఎంపీ శివనాథ్ భేటీ**



విజయవాడ (చైతన్యరథం): ఎన్టీఆర్ జిల్లా పరిధిలో పెండింగ్‌లో ఉన్న రైల్వే సమస్యలను త్వరితగతిన పరిష్కారించాలని దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం మోహిత్ సోనాకియాను ఎంపీ కేశినేని శివనాథ్ కోరారు. డీఆర్ఎంగా మోహిత్ సోనాకియా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి కలిసిన ఎంపీ కేశినేని శివనాథ్ ఆయనకు అభినందనలు తెలిపి కొండపల్లి బొమ్మ బహుకరించారు. మంగళవారం డి.ఆర్.ఎమ్. కార్యాలయంకు విచ్చేసిన ఎంపీ కేశినేని శివనాథ్‌కు డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కమలాకర్‌బాబు స్వాగతం పలికారు. ఈ భేటీలో ఎంపీ కేశినేని శివనాథ్ విజయవాడ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు, కొండపల్లి రైల్వే స్టేషన్ ప్లాట్ ఫామ్ విస్తరణ పనులతో పాటు లెవెల్ క్రాసింగ్ గేట్ల అంశంపై చర్చించారు. అలాగే వాంబే కాలనీ – మధురానగర్ మధ్య ఎల్.హెచ్.ఎస్. నిర్మాణం త్వరగా చేపట్టాని కోరారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్య నివారించేందుకు, ప్రజల రాకపోకల ఇబ్బందులు తొలగించేందుకు కె.ఎల్.రావు బ్రిడ్జ్ (ఎర్రకట్ట) వద్ద ఆర్.యు.బిలు నిర్మించాలని కోరారు. ఆర్.వో.బి, ఆర్.యు.బిల నిర్మాణానికి అన్ని అనుమతులు వచ్చిన లెవెల్ క్రాసింగ్ నెం. 316, లెవెల్ క్రాసింగ్ నెం. 147 , లెవెల్ క్రాసింగ్ నెం. 148, లెవెల్ క్రాసింగ్ నెం.8 నిర్మాణానికి టెండర్లు త్వరగా పిలిచి, ప్రాజెక్ట్‌లను పట్టాలెక్కించాలన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ అభ్యర్థనలపై డీఆర్ఎం మోహిత్ సోనాకియా సానుకూలంగా స్పందించారు.

# సామాన్య భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించడం హర్షణీయం : చీఫ్ విప్ జీవీ



వినుకొండ (చైతన్యరథం): తిరుమల శ్రీవారి వైకుంఠ ఏకాదశి సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు సామాన్య భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాన్ని పది రోజులు పాటు కల్పిస్తూ టీటీడీ ప్రకటించడం హర్షణీయమని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... డిసెంబర్ 30వ తేదీ నుండి వచ్చే ఏడాది జనవరి 8వ తేదీ వరకు భక్తులకు ఈ ప్రత్యేక దర్శనవకాశం ఇస్తూ సాధారణ భక్తులకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం సంతోషకరమన్నారు. పది రోజుల కాలంలో 182 గంటల దర్శన సమయం ఉండగా.. అందులో 104 గంటలు సాధారణ భక్తులకే ప్రత్యేకంగా కేటాయిస్తూ తీసుకున్న టిటిడి నిర్ణయం సామాన్య భక్తులకు ఎంతో మేలు జరుగుతుంది అన్నారు. వైకుంఠ దర్శనాల ప్రారంభమయ్యే మూడు రోజులు రూ.300 దర్శనం, శ్రీవాణి దర్శనాలు రద్దుచేసి, జనవరి 2వ తేదీ నుండి 8వ తేదీ వరకు రోజుకు 15 వేలు రూ.300 దర్శన టికెట్లు,1000 శ్రీవాణి దర్శన టికెట్లు రెగ్యులర్ పద్ధతిలో కేటాయించడం, మొదటి మూడు రోజులకు ఈ- డ్రిప్ ద్వారా టికెట్లు కేటాయించడం శుభపరిణామన్నారు. నవంబర్ 27 నుండి డిసెంబర్ 1వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ అవకాశం కల్పిస్తూ టీటీడీ ప్రకటించడం జరిగింది అన్నారు. డిసెంబర్ 2న లాటరీ విధానంలో ఎంపికైన వారికి టోకెన్లు కేటాయించారని, టీటీడీ వెబ్సైట్ తోపాటు, మొబైల్ యాప్, సిస్టం ద్వారా కూడా రిజిస్ట్రేషన్ టోకెన్ కేటాయింపు పారదర్శకంగా జరిపేందుకు టీటీడీ అవకాశం కల్పించిందన్నారు.

# కూటమితోనే మౌజన్లు, ఇమామ్‌ల ఆత్మగౌరవం



గుంటూరు (చైతన్యరథం): మౌజన్లు, ఇమామ్‌ల ఆత్మ గౌరవాన్ని కాపాడింది కూటమి ప్రభుత్వమేనని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అసెంబ్లీ మైనారిటీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో నియోజకవర్గంలోని మౌజన్లు, ఇమామ్ లతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. తొలుత ఈ ఏడాదికి మౌజన్లు, ఇమామ్ ల గౌరవ వేతనం రూ.90 కోట్లు అందించినందుకు సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గత జగన్ ప్రభుత్వంలో ముస్లిం మైనారిటీలకు తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు. మౌజన్లు, ఇమామ్ లకు అందించాల్సిన గౌరవ వేతనానికి కూడా కొర్రీ పెట్టారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జగన్ ప్రభుత్వంలో ఇవ్వాల్సిన గౌరవ వేతనాన్ని కూడా అందించామని తెలిపారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకానికి పెట్టినప్పుడు జగన్‌కు కార్మికుల కష్టసుఖాలు గుర్తుకు రాలేదా?

**●విశాఖ స్టీల్ ప్లాంట్ ను గంపగుత్తగా రూ.500 కోట్లకే పోస్కో సంస్థకు దారాధత్తం చేయాలని చూసిన జగన్ అండ్ కో విషప్రచారాన్ని ప్రజలు ఎప్పటికి నమ్మరు : ప్రత్తిపాటి పుల్లారావు**



చిలకలూరిపేట (చైతన్యరథం): “రాష్ట్ర ప్రగతికి అడ్డుపడే రాజకీయ అజ్ఞానులు, కాలానుగుణంగా మారుతున్న అభివృద్ధి సాధ్యాసాధ్యాల గురించి తెలియని మందబుద్ధులే విశాఖ ఉక్కుపై ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యల్ని వక్రీకరిస్తున్నారు.” అని టీడీపీ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం ఈ మేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేసిన ఆయన... కష్టపడితేనే సంస్థలకైనా, వ్యక్తులకైనా మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పడం తప్పెలా అవుతుందో వారు సమాధానం చెప్పాలి. ఒక పబ్లిక్ సెక్టార్ సంస్థకు గతంలో దేశంలో ఏ ప్రభుత్వం, ఏ నాయకుడు చేయని సాయం చంద్రబాబు చేశారనే నిజాన్ని గ్రహించాలి.

**అప్పుడు స్టీల్ ప్లాంట్ అమ్మకానికి పెట్టి.. ఇప్పుడు నీతివాక్యాలా?**

అధికారంలో ఉన్నప్పుడు ఏకంగా స్టీల్ ప్లాంట్ ఆస్తులు, భూములు అమ్మకానికి పెట్టిన జగన్ అండ్ కో నేడు నీతి వ్యాఖ్యాలు చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. మొత్తం ఉక్కు ఫ్యాక్టరీనే గంపగుత్తగా రూ. 500 కోట్లకే పోస్కో సంస్థకు దారాధత్తం చేయాలని చూసిన వారు నేడు పోసుకోలు కబుర్లతో రాజకీయ ప్రయోజనాలు పొందాలని చూస్తున్నారనే నిజం ప్రజలకు తెలియంది కాదు. గత పాలకులు ఉక్కు ఫ్యాక్టరీని లేపేసి ఆ ప్రాంతంలో రాజధాని కడతామన్నప్పుడు విశాఖ ఉక్కుపరిరక్షకులు, కార్మిక పక్షపాతులు నోరేత్తలేదేమి? విశాఖ ఉక్కు పేరేత్తే అర్హత జగన్‌కు వైసీపీకి లేదు.

**వాజ్ పేయ్ హాయాం నుంచి మోదీ పాలన వరకు విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణకు చంద్రబాబు ఎంతో కృషి చేశారు**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే చంద్రబాబు, పవన్ కళ్యాణ్, బీజేపీనేతలు విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణకు కృషిచేశారు. ప్లాంట్ ను కాజేయాలని చూసిన జగన్ దుర్మార్గాన్ని పటాపంచలు చేస్తూ కేంద్రాన్ని ఒప్పించి, రాష్ట్రప్రభుత్వ రాయితీలతో కలిపి చంద్రబాబు రూ.14 వేల కోట్ల వరకు సాయం అందేలా చూశారు. అంతకుముందు వాజ్ పేయ్ ప్రధానిగా ఉన్నప్పుడే స్టీల్ ప్లాంట్ నష్టాల భర్తీకి రూ.1350 కోట్లు అందించింది చంద్రబాబు కాదా? మరోసారి రూ.1400 కోట్ల ప్యాకేజీ మంజూరు చేయించి ప్లాంట్ మనుగడను కాపాడింది ముమ్మాటికీ ముఖ్యమంత్రి చంద్రబాబే.” అని ప్రత్తిపాటి పుల్లారావు వెల్లడించారు.

# మంగినపూడి బీచ్‌లో ఫోటోగ్రఫీ కోసం ఎకరా స్థలం కేటాయిస్తాం

**● ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ వన సమారాధనలో మంత్రి కొల్లు రవీంద్ర హామీ**



మచిలీపట్నం (చైతన్యరథం): మన జ్ఞాపకాలను భద్రపరిచే ఫోటోగ్రఫీని, దాన్ని నమ్ముకున్న ఫోటో గ్రాఫర్లను ప్రత్యేకంగా గౌరవించుకుంటానని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం డివిజన్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డు మున్సిపల్ పార్కులో నిర్వహించిన కార్తీక వన సమారాధనలో కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. కెమెరా సృష్టికర్త లూయిస్ డాగ్రే జయంతి నాడు ఫోటోగ్రాఫర్లతో సమావేశమవ్వడం అత్యంత సంతోషంగా ఉంది. మన జ్ఞాపకాలను భద్రపరిచేది ఫోటో గ్రఫీ మాత్రమేనన్నారు. ఒకప్పుడు రీల్స్ ఉండేవి. వాటిని కడిగించి ఆల్బమ్స్ రూపంలో భద్రపరచుకునే వాళ్లం. కానీ నేడు కాలం మారింది. టెక్నాలజీ మారింది. అందుకు అనుగుణంగా ఫోటోగ్రాఫర్లు కూడా టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి. కెమెరా టెక్నాలజీకి అనుగుణంగా మనం అప్ గ్రేడ్ అవ్వాల్సిందేనన్నారు. అవసరమైతే ఏపీ స్కిల్ డెవలప్మెంట్ ద్వారా శిక్షణ అందిస్తానని హామీ ఇచ్చారు. శిక్షణతో పాటుగా ఉపాధి కోసం అవసరమైన చర్యలు తీసుకుంటానన్నారు. మంగినపూడి బీచ్ వద్ద ఫోటో గ్రఫీ కోసం ప్రత్యేకంగా ఎకరా స్థలం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. పెళ్లిళ్లు, పుట్టిన రోజుల ఫోటోషూట్ కోసం ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. అదే సమయంలో మచిలీపట్నంలోని డాగ్రేగారి విగ్రహం వద్ద పార్కు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. పట్టణం పరిధిలో కూడా ఒక ఐదు సెంట్ల స్థలం కేటాయించి షూటింగులకు అనువైన ఏర్పాట్లు చేస్తానని మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు.

# రూ.3.96కోట్లతో గుడివాడ బైపాస్ రోడ్డు అభివృద్ధి

**●బైపాస్ రోడ్డు అభివృద్ధి పనులపై ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే వెనిగండ్ల**



గుడివాడ (చైతన్యరథం): సీఆర్డీయే మరియు రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.3.96 కోట్లతో గుడివాడ బైపాస్ రోడ్డును అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే రాము తెలిపారు. రోడ్డు నిర్మాణంతో పాటుగా ఇరువైపులా సిసి డ్రైన్లు నిర్మించనున్నట్లు ఆయన చెప్పారు. బైపాస్ రోడ్డు అభివృద్ధిపై ఆర్ అండ్ బి శాఖ అధికారులతో మంగళవారం ప్రజావేదిక కార్యాలయంలో ఎమ్మెల్యే రాము సమీక్షించారు. ఆలస్యం లేకుండా త్వరగతిన రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆయన అధికారులకు సూచించారు. పూర్తి నిబంధనల ప్రకారంగా రోడ్డు నిర్మాణ పనులు జరగాలని పేర్కొన్న ఎమ్మెల్యే రాము కాంట్రాక్టర్ కు పలు సూచనలు చేశారు.నిర్మాణ పనులను ప్రారంభించడంలో ఆలస్యం వద్దని ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, అధికారులతో ఎమ్మెల్యే రాము అన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాము మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.2.50 కోట్లతో బైపాస్ రోడ్డును, సిఆర్డిఏ నిధులు రూ.1.46కోట్లతో రహదారికి ఇరువైపులా సిసి డ్రైన్లు నిర్మిస్తున్నామన్నారు. ఇటీవల 68 లక్షలతో రహదారికి మరమ్మతులు చేసిన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో రహదారి సమస్య తిరిగి పునరావృతమైందన్నారు. సుదీర్ఘకాల బైపాస్ రోడ్డు సమస్య పరిష్కారానికి రహదారి నిర్మాణంతో పాటుగా, డ్రైనేజీ వ్యవస్థను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే రాము చెప్పారు. నియోజకవర్గంలోని నందివాడ, గుడివాడ రూరల్, గుడ్లవల్లేరు మండలాల్లో సమస్యాత్మకంగా ఉన్న ప్రధాన రహదారుల అభివృద్ధికి రూ.2.10 కోట్లతో ప్రతిపాదనలను పంపినట్లు ఎమ్మెల్యే రాము తెలియచేశారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి అధికారులు కామేశ్వరరావు, కాంట్రాక్టర్ సతీష్,జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ టౌన్, రూరల్, నందివాడ మండలాల టిడిపి అధ్యక్షులు దింట్యాల రాంబాబు, వాసే మురళి, దానేటి సన్యాసిరావు, టిడిపి నాయకులు లింగం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# థ్యాంక్యూ సీఎం సర్... మంత్రి కందుల దుర్గేష్

• కేబినెట్‌లో మంత్రి దుర్గేష్ విజ్ఞప్తి మేరకు ఎర్రకాలువ గట్ల పటిష్టతకు ప్రభుత్వం చర్యలు

నిడదవోలు (చైతన్యరథం): ప్రతీ ఏటా ఎర్రకాలువకు వస్తున్న వరద నీరు కారణంగా కాలువ గట్లు కోతకు గురవుతున్న నేపథ్యంలో వాటి పటిష్టత కోసం మంత్రి కందుల దుర్గేష్ చేపట్టిన చర్యలు సఫలీకృతమయ్యాయి. కేబినెట్‌లో మంత్రి కందుల దుర్గేష్ విజ్ఞప్తి మేరకు ఎర్రకాలువ గట్ల పటిష్టతకు కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. రూ. 1.8 కోట్ల ఎఫ్ డీఆర్ (ఫ్లడ్ డ్యామేజ్ రిపేర్) నిధులతో ఎర్రకాలువ మరమ్మతులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా కేబినెట్ కు విజ్ఞప్తి చేసిన వెంటనే స్పందించి చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మంత్రి కందుల దుర్గేష్ నియోజకవర్గ రైతాంగం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నేపథ్యంలో మంత్రి కందుల దుర్గేష్ ఆదేశాలతో నిడదవోలు మండలం సింగవరం వద్ద ఎర్రకాలువపై 2 షటర్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇప్పటికే సర్వే చేసి కొలతలు సేకరించారు. షెటర్ల ఏర్పాటు ద్వారా భారీ వర్షాలు, వరదల వల్ల ముంపుకు గురవుతున్న దాదాపు 5000 ఎకరాలకు ఇక ఎలాంటి ధోకా లేదు. నిడదవోలు మండలంలోని సింగవరం, కంసాలిపాలెంలో బ్రీచ్ క్లోజింగ్, గేట్లు ఏర్పాటు చేయడం వల్ల పంట పొలాల్లోకి నీరు వెళ్లకుండా ఉంటుంది. ఎక్కడెక్కడ గండ్లు పడ్డాయో వాటిని కూడా పూడ్చివేయడం వల్ల వచ్చే సీజన్ నుండి ముంపు సమస్య పరిష్కారం అవుతుంది. 2024 ఆగస్టు, సెప్టెంబర్ లో వరదల కారణంగా సంభవించిన నష్టాలకు 13 నియోజకవర్గాల్లో రూ.5714.58 లక్షల రూపాయలతో 392 ఇరిగేషన్ ఇన్ ఫ్రా స్ట్రక్చర్ (మేజర్, మైనర్)వరదనష్ట మరమ్మతు మరియు పునరుద్ధరణ పనులకు కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో నిడదవోలు ఎర్రకాలువను అందులో అంతర్భాగం చేసి స్థానిక రైతాంగానికి వెన్నుదన్నుగా నిలవడంతో మంత్రి కందుల దుర్గేష్ పనితీరుపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు. ఇకపై భారీ వర్షాలు, వరదలు, ప్రకృతి విపత్తులు వచ్చినా ఎర్రకాలువ ముంపుకు గురికాదన్న ధైర్యాన్ని మంత్రి కందుల దుర్గేష్ ప్రజల్లో నింపారు. గతేడాది జులై 2024లో వరదలు వచ్చి నిడదవోలు నియోజకవర్గంలో ఎర్రకాలువ ముంపుధాటికి భారీగా నష్టం వాటిల్లిన నేపథ్యంలో మంత్రి కందుల దుర్గేష్ శాశ్వత పరిష్కారానికై పరితపించారు.



గడిచిన 5 ఏళ్ళలో ఈ అంశాన్ని పట్టించుకోకపోవడం వల్ల మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక చొరవ తీసుకొని ఈ అంశాన్ని కేబినెట్ దృష్టికి తీసుకెళ్లి అంతిమంగా ఎర్రకాలువ ముంపు శాశ్వత పరిష్కారానికి బాటలు వేశారు. ఇటీవల మంత్రి దుర్గేష్ తీసుకున్న చర్యలతో మొంథా తుఫాన్ ధాటికి భారీ నష్టం వాటిల్లకుండా అరికట్టగలిగారు. గతేడాది ఎర్రకాలువ ముంపుకు పంట నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వంతో చర్చించి దాదాపు రూ.5 కోట్లకు పైగా పరిహారం చెల్లించేందుకు కృషి చేశారు. ఇచ్చిన మాట ప్రకారం మంత్రి కందుల దుర్గేష్ నీటి వృథాకు, ముంపుకు అడ్డుకట్టు వేసి ఆయకట్టు రైతాంగానికి వెన్నుదన్నుగా నిలిచారు.

# వైసీపీ గుంటనక్కల ట్రాప్‌లో పడొద్దు : దేవినేని

• రాయలసీమ – డెల్టా రైతుల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్న వైసీపీ సోషల్‌మీడియా

• రాష్ట్ర రైతాంగం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతరం కృషి చేస్తున్నారు

విజయవాడ (చైతన్యరథం): జలవనరుల రంగంలో చంద్రబాబునాయుడు చేసిన కృషిని, వక్రీకరిస్తూ జగన్ రెడ్డి, వైసీపీ సోషల్ మీడియా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. "రాయలసీమ – డెల్టా రైతుల మధ్య చిచ్చు పెట్టి చలికాచుకోవాలని వైసీపీ గుంటనక్కలు ఎదురుచూస్తున్నాయని ఇది అత్యంత దుర్మార్గమైనది. రెండు ప్రాంతాల రైతులు ఒక్కటే అని చంద్రబాబు ఎప్పటి నుంచో నిరూపిస్తూనే ఉన్నారని దేవినేని ఉమా వ్యాఖ్యానించారు.

**"ఆల్మట్టి 519 మీటర్లే... సుప్రీంకోర్టు స్పష్టంగా తీర్పు ఇచ్చింది"**

"ఆల్మట్టి ఎత్తు 519 మీటర్లకు మాత్రమే అని సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చింది. 524 మీటర్ల విషయంలో బచావత్ ట్రిబ్యునల్ ముందు వాదనలు కొనసాగుతున్నాయి. ఈ వాస్తవాలు తెలియకుండా కొందరు సీనియర్ అధికారులు, నాయకులు మాట్లాడుతూ అరాచక శక్తులకు అవకాశం కల్పిస్తున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు.

**"పట్టిసీమతో 13 లక్షల ఎకరాల డెల్టాను కాపాడాం... శ్రీశైలం నుంచి రాయలసీమకు నీరు ఇచ్చాం"**

"వృథాగా సముద్రంలోకి పోతున్న గోదావరి జలాలను పట్టిసీమ లిఫ్ట్ ద్వారా ప్రకాశం బ్యారేజీకి తీసుకొచ్చి 13 లక్షల ఎకరాల కృష్ణా డెల్టాను కాపాడాం. అదే సమయంలో శ్రీశైలం డ్యాం నుంచి కృష్ణా జలాలను రాయలసీమకు అందించి అక్కడి రైతుల పంటలను కాపాడాం. పులివెందుల, కుప్పం ప్రాంతాలకు కూడా కూటమి ప్రభుత్వం నీటిని అందించింది. ఇదే చంద్రబాబు దూరదృష్టి" అని గుర్తు చేశారు.

**"ఐదేళ్ల జగన్ హయాంలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి కాలేదు"**

"ఐదేళ్ల పాలనలో జగన్మోహన్ రెడ్డి ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదు. అయితే తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్ రంగంలో 68 వేల కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేసి అనేక ప్రాజెక్టులు పూర్తి చేశాం. ప్రోక్లైన్లు పెట్టి, తవ్వినా చంద్రబాబు గారిపై, తెలుగుదేశం ప్రభుత్వంపై ఒక్క తప్పు కూడా దొరకలేదు" అని దేవినేని ఉమా గట్టిగా వెల్లడించారు.

**"రాజశేఖర్ రెడ్డి 2006లోనే రాష్ట్ర హక్కులను తుంగలో తొక్కారు"**

"2006 మార్చిలో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రానికి ఉన్న హక్కులను, వెసులుబాటును తుంగలో తొక్కుతూ బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు



మెమో దాఖలు చేసింది. ఆ తప్పును సరిదిద్దేందుకు తెలుగుదేశం పార్టీ శాసనసభలోనూ, బయటా పోరాడింది. బ్రిజేష్ కుమార్ అవార్డు అమలైతే రాష్ట్రానికి భారీ నష్టం జరుగుతుందని ముందుగానే గుర్తించి సుప్రీంకోర్టులో దాఖలు చేసింది. దానితో సుప్రీంకోర్టు స్టే ఇచ్చి, గెజిట్ నోటిఫికేషన్ చేయవద్దని కేంద్రాన్ని ఆదేశించింది" అని వివరించారు.

**"వక్రీకరణ చేస్తున్న సాక్షి - వైసీపీ సోషల్ మీడియాను జాగ్రత్తగా చూడండి"**

"కొందరు తెలియకుండా మాట్లాడిన మాటలను వైసీపీ సోషల్ మీడియా, సాక్షి మీడియా వాడుకొని వక్రీకరిస్తూ తప్పుడు ప్రచారం చేస్తోంది. ప్రజలు వీటిని నమ్మొద్దు. చంద్రబాబు ఎప్పుడూ రెండు ప్రాంతాల రైతుల కోసమే పోరాడారు, పోరాడుతున్నారు" అని దేవినేని ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు.

# వసతి గృహానికి టీవీ బహుమతిగా ఇచ్చిన ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి (చైతన్యరథం): కావలి పట్టణంలో ఇటీవల ప్రారంభించిన బీసీ బాలికల వసతి గృహానికి ఎమ్మెల్యే కృష్ణా రెడ్డి టీవీని బహుమతిగా ఇచ్చారు. స్థానిక టీడీపీ నాయకుడు గంగినేని వెంకటేశ్వర్లునాయుడు చేతుల టీవీని హాస్టల్‌కు అందజేశారు. విద్యార్థినులకు ఆటవిడుపుగా అప్పుడప్పుడు వినోదాన్ని అందించాలనే ఉద్దేశంతోనే ఎమ్మెల్యే కృష్ణారెడ్డి టీవీని అందజేయడం జరిగిందన్నారు. ఈ దర్భంగా ఎమ్మెల్యేకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ సహాయ అధికారిణి అరుణ, నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# కావలి కాలువకు సోమశిల జలాలు విడుదల

• నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యేలు కాకర్ల, కావ్య కృష్ణారెడ్డి



సంగం (చైతన్యరథం): సంగం వద్ద కావలి కాలువకు సోమశిల జలాలను విడుదల చేసి, రెండవ ఫేస్‌లో రభి పంటలకు నీటిని అందించేందుకు చేపట్టిన బృహత్తర కార్యక్రమంలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్, కావలి శాసనసభ్యులు దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డి, సోమశిల ప్రాజెక్టు చైర్మన్ కేశవ చౌదరిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇద్దరు ప్రజాప్రతినిధులు జలవిడుదలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి రైతు సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రైతుల సమస్యలను అర్థం చేసుకుని వాటికి శాశ్వత పరిష్కారాలు చూపించేందుకు ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తరువాత రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా పడి అన్ని ప్రాజెక్టులు, చెరువులలో పుష్కలంగా నీరు నిండిపోయి నిండుకుండలను తలపిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ పుష్కల వర్షాల వరదతో ఎన్నడూ లేని విధంగా రెండవ కారు పంటకు నీరు విడుదల చేయడం రైతులకు ఎంతో ఆశాజనకమని, ఇది వ్యవసాయ రంగానికి పునర్జీవం నింపే నిర్ణయమని తెలిపారు. రైతుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న సంక్షేమ నిర్ణయాలు హర్షణీయమన్నారు. నేడు రెండో విడతగా రాష్ట్ర ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా ప్రతి రైతు ఖాతాలో 5,000 రూపాయలు జమ చేయనున్నదని, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం ద్వారా అదనంగా 2,000 రూపాయలు రైతులకు చేరనున్నాయని పేర్కొన్నారు. ఈ రెండు పథకాల మద్దతుతో రైతుల భుజాలపై ఉన్న ఆర్థికభారం కొంతవరకు తగ్గి, పంట సాగు మరింత సులభమవుతుందన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా సోమశిల జలాలను ఉదయగిరి నియోజకవర్గంలోని ప్రతిఒక్క ఇంటికి త్రాగునీటి అవసరాలు తీర్చేందుకు అందించే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మార్కాపురం ప్రజాదర్బార్‌కు విశేష స్పందన

•ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే కందుల



మార్కాపురం (చైతన్యరథం): మార్కాపురం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి నిర్వహించిన ప్రజా దర్బార్‌కి విశేష స్పందన లభించింది. ఈ ప్రజాదర్బార్‌కు అన్ని శాఖల అధికారులు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అప్పటికప్పుడుకే అధికారులతో మాట్లాడి కొన్ని సమస్యలు పరిష్కరించారు. ఈ ప్రజాదర్బార్ యొక్క ముఖ్య ఉద్దేశం ప్రజల సమస్యలు తీర్చడమేనని కొన్ని సమస్యలు ఇప్పటికిప్పుడే పరిష్కరించామని మరికొన్ని సమస్యలు వచ్చే పదిహేను రోజుల్లో పరిష్కరిస్తామని పరిష్కారం కాని సమస్యలు ఎందుకు పరిష్కారం కాలేదు అర్జీదారులకు తెలియజేస్తామని అన్నారు. వైసీపీ నాయకులకు పని పాట లేక తమ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని తమ నాయకుడు నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్ బాబు, పవన్ కళ్యాణ్, నిత్యం కష్టపడి రాష్ట్రానికి పెట్టుబడుల వరద పారిస్తున్నారని అది ఓర్వలేక కోటి సంతకాలు అంటూ వైసీపీ నాయకులు రోడ్డు మీద పడ్డారని ఇక మీ ప్రభుత్వం ఎప్పటికీ రాదని అది గుర్తుంచుకోవాలని అన్నారు.

# కనిగిరిలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు




కనిగిరి (చైతన్యరథం): కూటమి అధికారంలోకి వచ్చిన అనంతరం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని రాష్ట్ర ప్రజలంతా హర్షిస్తున్నారని, అందులో భాగంగా పలువురు వైసీపీ కార్యకర్తలు సైతం టీడీపీ పట్ల అకర్షితులౌతున్నారని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి వ్యాఖ్యానించారు. నియోజకవర్గంలోని పీసీపల్లెకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి మంగళవారం ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఆయన... ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని కాంక్షించే వారు టీడీపీలో చేరుతున్నారని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు తమ మద్దతు ఉంటుందని పార్టీలోకి చేరిన వారు తెలిపారు.

# పుట్టపర్తిలో వైభవంగా ప్రారంభమైన సత్యసాయి బాబా శతజయంతి వేడుకలు

**•పురవీధుల్లో సత్యసాయిబాబా రథోత్సవం... వేల సంఖ్యలో భక్తజనం**



పుట్టపర్తి (చైతన్యరథం): ప్రపంచ ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సమన్వయంతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో భాగంగా మంగళవారం పురవీధుల్లో సత్యసాయిబాబా రథోత్సవం నిర్వహించారు, వెండి రథంపై 9 కేజీల బంగారు సత్య సాయిబాబా విగ్రహ ఉత్సవమూర్తిని పూరవీధుల్లో ఊరేగించారు. ముందుగా ప్రశాంత నిలయంలోని సాయి కుల్వంత్ హాల్లో సత్య సాయిబాబా మహా సమాధి వద్ద సత్యనారాయణ వ్రతం. వేణుగోపాలస్వామి సత్యసాయిబాబాలకు అభిషేకము. సీతారామ సమేత లక్ష్మణ ఆంజనేయ స్వాముల పూజా కార్యక్రమాలు భావించి వివిధ రకాల పుష్పాలు బంగారు ఆభరణాలతో అలంకరించారు. జయంతి ఉత్సవాలకు పురవీధులన్నీ పచ్చ తోరణాలతో రంగవల్లులతో అత్యంత సుందరీకరణంగా తీర్చిదిద్దారు. హనుమాన్ కోడలు నుండి గోపురం వరకు వెండి రథంపై సత్యసాయి చిత్రపటాని నుంచి రథోత్సవాన్ని ప్రారంభించారు. గోపురం వద్ద నుంచి ప్రశాంతి నిలయంలో అభిషేక పూజా కార్యక్రమాలు అనంతరం. సత్యసాయి ఉత్సవమూర్తిని వెండి రథంపై ఉంచి ఊరేగించారు. వివిధ సంస్కృతిక కార్యక్రమాలతో డప్పు మంగళ వాయిద్యాల మధ్య సాయి నామస్మరణతో పురవీధులు మారుమ్రోగాయి. రథోత్సవం వేడుకల్లో దేశ, విదేశాల నుంచి పుట్టపర్తికి విచ్చేసిన భక్తజనంతో పురవీధులన్నీ కిక్కిరిసిపోయాయి. స్వదేశీ విదేశీ భక్తులతో బారులు తీరిన జనంతో కిటకిటలాడింది. రథోత్సవ వేడుకల్లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రులు అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, సవితమ్మ, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, పరిటాల సునీత, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎంపీ మురళీమోహన్, సత్యసాయి సెల్ఫ్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ ఆర్జే రత్నాకర్, బీజేపీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్, సత్య సాయి సెంట్రల్ ట్రస్ట సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికి ఒకరు ప్రచారకర్తగా ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

**•రాయదుర్గంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపు**

రాయదుర్గం (చైతన్యరథం): రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ చేస్తున్న మంచిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రతి ఇంటికి ఒక్కరు ప్రచారకర్తగా పని చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అభిప్రాయపడ్డారు. రాయదుర్గంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్ల వైకాపా విధ్వంసకర పాలనలో రాష్ట్రం చాలా వెనకబడిపోయిందన్నారు. చంద్రబాబు నిరంతర శ్రమ, కృషితో ఇప్పుడిప్పుడే అభివృద్ధి పట్టాలెక్కుతుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ హామీలను ఏడాదిన్నరలోనే అమలు చేశామన్నారు. ఇదే నేపథ్యంలో అభివృద్ధిలోనూ రాష్ట్రం శరవేగంగా ముందుకు దూసుకుపోతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ బాబు లదే ఆ ఘనతని మెచ్చుకున్నారు. ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ పారిశ్రామికవేతల సదస్సులో రాష్ట్రానికి సుమారు రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చిన ఘనత వారిదే అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో జరగనంత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు రాష్ట్రంలో చేపట్టడం ఓ రికార్డుని పేర్కొన్నారు. కూటమి ప్రగతి యజ్ఞాన్ని జీర్ణించుకోలేని జగన్ అండ్ కో కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం సాగిస్తోందన్నారు. మరి ముఖ్యంగా చంద్రబాబు, లోకేష్ బాబులపై అసత్య ఆరోపణలు, నిందలువేస్తూ ప్రజల్లో ప్రభుత్వ ప్రతిష్ఠ దిగజార్చేందుకు ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తపరిచారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ మంచిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ఇలాంటి అసత్య ప్రచారాలను తిప్పి కొట్టాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఇందుకోసం ప్రతి కుటుంబం నుంచి ఒకరు ప్రచారకర్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

**నేడు అన్నదాత సుఖీభవ అందజేత**

అన్నదాత సుఖీభవ కింద రెండో విడత ఆర్థిక సహాయాన్ని ఈనెల 19న చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని కనేకల్లు కేంద్రంలో చేపట్టాలని నిర్ణయించడం జరిగిందన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో 38,508 మంది రైతులకు రూ.26.95 కోట్లు రైతుల ఖాతాలో జమా చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా చేతోడు వాదోడుగా ఉంటూ వస్తుందన్నారు విత్తనం నుంచి పంట అమ్మకం దాకా అన్ని దశల్లోనూ రైతులకు అండగా నిలుస్తోందన్నారు. నాణ్యమైన విత్తనం అందచేయడంతో పాటు కనీస మద్దతు ధరపై కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయించి పంట ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేస్తూ రైతుకు అండగా నిలుస్తోందని కాలవ తెలియజేశారు.

# కార్తీక వనభోజనాల మహోత్సవం మనుషుల మధ్య దూరాన్ని తగ్గిస్తోంది

**•వీరశైవుల లింగాయత్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే దగ్గుపాటి**

**•వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ స్వప్న ఆధ్వర్యంలో కార్యక్రమం**

**•నగరంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో కార్తీక వనభోజన మహోత్సవం**

**•పార్టీ కోసం స్వప్న చేసిన కృషి వలనే చైర్మన్ పదవి వచ్చిందన్న ఎమ్మెల్యే**

అనంతపురం (చైతన్యరథం): నేటి ఆధునిక సమాజంలో కుటుంబం, బంధుత్వాల ప్రాధాన్యత తగ్గుతున్న క్రమంలో కార్తీక వనభోజనాల మహోత్సవం వంటి కార్యక్రమాలు మనుషుల్ని దగ్గర చేస్తున్నాయని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అనంతపురం నగరంలోని మూడవ రోడ్డులో గల జీఆర్ ఫంక్షన్ హాల్ నందు వీరశైవుల లింగాయతుల ఆత్మీయ సమ్మేళనం, కార్తీక వనభోజనాల మహోత్సవం ఘనంగా జరిగింది. వీరశైవ లింగాయత కార్పొరేషన్ చైర్మన్ తుల్జాపూర్ స్వప్న ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉరవకొండ గవిమఠం ఉత్తరాధికారి కరి బసవ రాజేంద్ర మహాస్వామి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటితో పాటు జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ గతంలో తాను ఎప్పుడు వీరశైవలింగాయతుల కార్యక్రమంలో పాల్గొనలేదని.. తనకు ఈ అవకాశం ఇచ్చినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల మనుషుల మధ్య దూరాలు పెరుగుతున్నాయని.. మన సంస్కృతి సాంప్రదాయల ప్రకారం నిర్వహించుకుని కొన్ని కార్యక్రమాలు జరగడం లేదన్నారు. ఇలాంటి వాటిలో కార్తీక వనభోజన మహోత్సవాలు ఇటీవల మళ్లీ సామాజిక వర్గాల వారిగా నిర్వహించుకోవడం ఆనందించదగ్గ విషయమన్నారు. ఎక్కడెక్కడో ఉన్న వారంతా ఒక్క చోట చేసి వారి సాదక బాధకాలు చెప్పుకోవడం, అంతా ఒక కుటుంబంలో కలిసి పోవడం వంటివి



చూస్తున్నామన్నారు. వీరశైవ లింగాయత్ లకు ఎలాంటి సహకారం అవసరం ఉన్నా తన నుంచి సహకారం ఉంటుందన్నారు. మరోవైపు వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ ఛైర్ పర్సన్‌గా మహిళా నాయకురాలు స్వప్నకు ఎలా అవకాశం వచ్చిందో ఎమ్మెల్యే దగ్గుపాటి వివరించారు.

# కష్ట సమయాల్లో టీడీపీ సభ్యత్వం ఆదుకుంటోంది: పరిటాల శ్రీరామ్

**•మరణించిన టీడీపీ కార్యకర్త కుటుంబానికి 5లక్షల బీమా**

**•బీమా పత్రాన్ని అందజేసిన పరిటాల శ్రీరామ్**



ధర్మవరం (చైతన్యరథం): టీడీపీ కార్యకర్త ఏదైనా జరిగి కుటుంబం కష్టాల్లో ఉన్నప్పుడు సభ్యత్వ నమోదు అన్నది ఆదుకుంటోందని ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. ముదిగుబ్బ మండలం మలకవేముల గ్రామానికి చెందిన రూపేంద్ర ఇటీవల ప్రమాదంలో మరణించారు. రూపేంద్రకు టీడీపీ సభ్యత్వం ఉండటంతో ఆయన కుటుంబానికి 5లక్షల బీమా వర్తించింది. పరిటాల శ్రీరామ్ సహకారంతో వారికి బీమా పత్రం వచ్చింది. ఈ పత్రాన్ని ధర్మవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రూపేంద్ర కుటుంబ సభ్యులకు అందజేశారు. ముందుగా రూపేంద్ర మరణం గురించి తెలుసుకుని వారి కుటుంబసభ్యులకు శ్రీరామ్ ధైర్యం చెప్పారు. ఇది పార్టీ తరుపున మీ కుటుంబానికి అందిస్తున్న సాయం మాత్రమేనని.. భవిష్యత్ లో మీకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆలోచన వలనే ఇలా కష్ట కాలంలో ఎంతో మంది కార్యకర్తల కుటుంబానికి సాయం అందుతోందన్నారు. ఒక కార్యకర్త గురించి ఇంతగా ఆలోచించే పార్టీ టీడీపీ తప్ప మరేదీ లేదని శ్రీరామ్ అన్నారు.

# నేడు కుప్పంలో సీఎం సతీమణి పర్యటన... కృష్ణ జలాలకు హారతి

కుప్పం (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఈనెల 19, 20, 21 తేదీల్లో కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. టీడీపీ వర్గాల సమాచారం మేరకు భువనేశ్వరి 19వ తేదీన కుప్పం వస్తారు. కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాల్లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. మహిళలతో ముఖాముఖి సమావేశమవుతారు. నిండి మొరవ పారడానికి సిద్ధమైన డీకేపల్లె చెరువులో కృష్ణా జలాలకు హారతి ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో డీకేపల్లె చెరువును ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, రెస్కో చైర్మన్ వీజీ.ప్రతాప్, కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు తదితరులు సందర్శించారు. జలహారతికోసం చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు.ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, అప్పు ముఖేశ్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసత్యసాయి బాబా శత జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పరిటాల సునీత



పుట్టపర్తి (చైతన్యరథం): శ్రీసత్యసాయి బాబా శత జయంతి వేడుకల్లో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొన్నారు. మంగళవారం ఉదయం శ్రీ సత్యసాయి రథోత్సవంతో బాబా జయంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. వేద పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య సాగిన రథోత్సవంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు రత్నాకర్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, భక్తులతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఉదయం ఈవేడుకలకు హాజరైన మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడును ఎమ్మెల్యే సునీత మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం అల్పాహార విందులో పాల్గొన్నారు. ఆ తర్వాత వెంకయ్యనాయుడు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. శ్రీ సత్యసాయి బాబా 9కేజీల బంగారు విగ్రహ ఉత్సవమూర్తికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆ విగ్రహాన్ని వెండి రథంపై ఉంచారు. పట్టణ పురవీధులలో సత్యసాయి బాబా ఊరేగింపు ఘనంగా సాగింది. సత్యమ్మ దేవాలయం నుంచి ప్రారంభమై బాబా ఉత్తర గోపురం వరకు ఎమ్మెల్యే సునీత రథోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ప్రముఖులతో కలిసి శ్రీసత్య సాయి బాబా మహా సమాధిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ బాబా శతజయంతి వేడుకల్లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. నడిచే దైవంగా శ్రీ సత్యసాయి బాబా కొన్ని కోట్ల మందికి సేవా కార్యక్రమాల ద్వారా దగ్గరయ్యారన్నారు. ఆ మహనీయున్ని భూమి ఉన్నంత వరకు గుర్తు పెట్టుకుంటారని సునీత అన్నారు.

# ఢిల్లీ పేలుళ్ల కేసులో మరో ముగ్గురి అరెస్టు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఇటీవల జరిగిన పేలుడు ఘటనలో 15 మంది మృతిచెందిన ఘటన పై విచారణ తాజాగా ముంబైకి చేరింది. ఈ ఘటనకు సంబంధించిన మూలాలు వివిధ రాష్ట్రాల్లో కనిపిం చడంతో సోదాలు, అరెస్టులు కొనసాగుతున్నాయి. తాజాగా సోషల్ మీడియా, ఇతర డిటిజల్ మాధ్యమా ల ద్వారా ఈ కేసుతో సంబంధం కలిగిన వ్యక్తులను కనిపెట్టడంపై కేంద్ర ఏజెన్సీలు దృష్టిసారించినట్టు ముంబై పోలీసు వర్గాలు తెలిపాయి. ముంబైలోని వివిధ ప్రాంతాల్లో కేంద్ర ఏజెన్సీలు తాజాగా చేపట్టిన కోవర్ట్ ఆపరేషన్‌లో ముగ్గురు అనుమానితులను నిర్బంధంలోకి తీసుకున్నారు. ఈ ముగ్గురూ విద్యా ధికులే కాకుండా ఉన్నత కుటుంబాల నుంచి వచ్చిన ట్టు తెలుస్తోంది. ముంబై పోలీసుల సాయం తీసుకుని దర్యాప్తు సంస్థలు ఈ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. నిర్బంధంలోకి తీసుకున్న అనుమానితులను తదుపరి విచారణ కోసం ఢిల్లీకి తరలించినట్టు తెలుస్తోంది. కాగా, ఈ కేసులో నిర్బంధంలోకి తీసుకున్న అనుమా నితులు ప్రధాన నిందితుడితో ఒక నిర్దిష్ట మొబైల్ అప్లికేషన్ ద్వారా సంప్రదింపులు సాగించినట్టు పోలీ సు వర్గాలు చెబుతున్నారు. కీలకమైన సమాచారాన్ని పంచు కునేందుకు వారు ఆ యాప్ వాడినట్టు అను మానిస్తున్నారు. విచారణలో వెలుగుచూస్తున్న సమా చారం ఆధారంగా మహారాష్ట్రలోని వివిధ జిల్లాల్లో తదుపరి గాలింపు చర్యలు ఉంటాయని చెబుతున్నారు.




◆ మొబైల్ అప్లికేషన్‌లో నిందితుడితో సంప్రదింపులు

## పేలుడుకు ముందు వీడియో రికార్డ్ చేసిన ఉమర్



ఎర్రకోట వద్ద కారు బాంబు దాడికి పాల్పడడానికి ముందు ఉమర్ ఆ వీడియోను రికార్డు చేసినట్లు తెలుస్తోంది. ఆత్మాహుతి దాడి గురించి ఉమర్ ఆ వీడియోలో మాట్లాడినట్లు సమాచారం. 'ఆత్మాహు తి దాడిని అపార్థం చేసుకున్నా రు. ఇదొక బలిదానం' అని చెప్పినట్లు తెలుస్తోంది. చనిపోయే స్థలం, సమయం, పరిస్థితుల గురించి కూడా ఉమర్ నబీ మాట్లాడినట్లు సమాచారం. నవంబర్ 9వ తేదీన అల్ఫల యూనివర్సిటీలో ఉమర్ వీడియో రికార్డు చేసినట్లు ఎన్ఐఏ అధికారులు గుర్తించారు. మరుసటి రోజు నవంబర్ 10వ తేదీన అతడు ఎర్రకోట దగ్గర ఆత్మాహుతి దాడికి పాల్పడ్డాడు.

## ఉమర్‌కు సాయం చేసింది ఇతడే..

దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్ర కోట దగ్గర కారు బాంబు బ్లాస్ట్‌లో ఉమర్ ఆత్మాహుతి దాడిలో కీల కంగా వ్యవహరించిన వ్యక్తిని ఎన్ఐఏ అరెస్ట్ చేసింది. అతడిని జమ్మూకాశ్మీర్‌కు చెందిన జాసిర్ బిలాల్ వాణి అలియాస్ డానిష్‌గా గుర్తించింది. జాసిర్ బిలాల్ వాణిని జమ్మూకాశ్మీర్‌లోని శ్రీనగ ర్‌లో అదుపులోకి తీసుకుంది. ఉమర్ బాంబు దాడి చేయడానికి అవసరమైన టెక్నికల్ సపోర్టు ను జాసిర్ బిలాల్ వాణి అందించాడు. కారు బాంబు దాడి కోసం మాత్రమే కాకుండా పలు చోట్ల దాడులు చేయటం కోసం ఉమర్‌తో కలిసి అతడు పని చేశాడు. డ్రోన్స్‌ను మాడిఫై చేయడా నికి, రాకెట్లు తయారు చేయడానికి ప్రయత్నిం చాడు. వాటి సాయంతో ఉగ్రవాదులు దాడులకు పాల్పడాలని చూశారు. ఎర్రకోట బాంబు దాడి వెనకున్న కుట్రల గురించి తెలుసుకోవడానికి ఎన్ఐఏ అధికారులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. యాంటీ టెర్రర్ ఏజెన్సీ ఉగ్రదాడిలో భాగమైన వారి కోసం జమ్మూకాశ్మీర్‌లో ముమ్మ రంగా సెర్చ్ ఆపరేషన్లు నిర్వహిస్తోంది. కాగా ఎన్ఐఏ అధికారుల అదుపులో ఉన్న జాసిర్ బిలాల్ వాణి ఫొటో ఒకటి పలు జాతీయ మీడి యాల్లో ప్రచురితం అయింది. జాసిర్ బిలాల్ వాణి అరెస్ట్ అయిన తర్వాత వెలుగులోకి వచ్చిన మొదటి ఫొటో అంటూ ప్రచారం జరుగుతోంది.





## చిన్నారుల మిస్సింగ్‌పై సుప్రీం ఆందోళన

ఢిల్లీ: ఇటీవల పలు రాష్ట్రాల్లో చిన్నారుల మిస్సింగ్‌పై మీడియాలో వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ విషయంపై సుప్రీంకోర్టు దృష్టికి వచ్చింది. చిన్నారుల మిస్సింగ్‌పై న్యాయ స్థానం ఆందోళన వ్యక్తం చేసింది. మంగళవారం చిన్నారుల మిస్సింగ్ అంశంపై విచారణ చేపట్టింది సుప్రీంకోర్టు. ఈ సందర్భంగా పలు కీలక సూచనలు చేసింది న్యాయస్థానం. ప్రతి ఎనిమిది నిమిషాలకొక చిన్నారి మిస్ అవుతున్నారనే వార్తలు వస్తున్నాయని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న తెలిపారు. ఈ క్రమంలో దత్తత నిబంధనలు సరళీకృతం చేయా లని సూచించారు. పిల్లల దత్తత నిబంధనలు కఠినతరంగా ఉండటం వల్ల అక్రమ పద్ధతుల్లో దత్తత తీసుకుంటున్నారని వ్యాఖ్యానించారు నాగరత్న. చిన్నారుల మిస్సింగ్ అంశంపై జిల్లాకు ఒక నోడల్ అధికారిని ఏర్పాటు చేయాలని గత విచారణలో సూచించింది సుప్రీంకోర్టు. తెలంగా ణలో అక్రమ దత్తత వ్యవహారంలో పలు కేసులు బయటకు వచ్చాయని న్యాయవాది గుర్తుచేశారు. ఈ విషయంపై అన్ని రాష్ట్రాలతో సమావేశాలు నిర్వహించేందుకు కొంత సమయం ఇవ్వాలని కోరారు అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి.

## పేలుళ్ల కోసం 'బిర్యానీ-దావత్' కోడ్ భాష

### - ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్‌లో కీలక సమాచారం



న్యూఢిల్లీ: ఎర్రకోట సమీపంలో పేలుడు కేసుకు సంబంధించిన ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్ కేసు లో కీలక సమాచారం వెలుగు చూసింది. ఈ వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్‌లో 'బిర్యానీ', 'దావత్' అనే సంకేత పదాలు వాడినట్టు బయటపడింది. ఇందులో ప్రమేయమున్న టెర్రరిస్టు డాక్టర్లందరూ ఆహారం, పానీయాలనే కోడ్‌వర్డులుగా ఎంచుకుని 'ఎన్‌క్రిప్టె డ్ యాప్'లో కమ్యూనికేషన్ సాగించారు. పేలుళ్లకు 'బిర్యానీ' అనే కోడ్‌వర్డ్, దాడి చేసే రోజుకు 'దావత్' అనే కోడ్‌వర్డ్ వాడారు.

**బిర్యానీ సిద్ధమైందంటే..**

డాక్టర్ల చాట్‌లో 'బిర్యానీ సిద్ధం.. విందుకు సిద్ధంకండి' అనే మెసేజ్ ఉంటే దానికి.. బాంబు రెడీగా ఉందని, దాడి అనివార్యమని అర్థమని సెక్యూరిటీ ఏజెన్సీలు తెలిపాయి. ఈ వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్‌లో ప్రమేయ మున్న నలుగురు డాక్టర్లు ముజామిల్ షకీల్,ఉమర్ ఉన్ నబి, సహీనా సయీద్,అదీల్ హమ్ రాడార్‌లు వంటపేరుతో బాంబులు, దాడుల గురించి సంభాషించుకున్నారు.

**కొనసాగుతున్న దాడులు**

కాగా, ఎర్రకోట ప్రాంతంలోని కారు పేలుడు వివాదంలో చిక్కుకున్న ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ యూనివర్శిటీకి చెందిన ట్రస్టీలు, ప్రమోటర్ల నివాసాలపై ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ మంగళవారం ఏకకాలంలో దాడులు జరిపింది. అల్ ఫయిదీ ట్రస్టు, యూని వర్శిటీ ఎస్టాబ్లిష్‌మెంట్స్‌కు సంబంధించిన 25 ప్రాంతాల్లో ఈడీ టీమ్‌లు తెల్లవారుజామున 5.15 గంటలకు దాడులు మొదలుపెట్టాయి. ఢిల్లీ ఓఖ్లా ఏరియా లోని కార్యాలయంపై దాడులు జరిపిన ఈడీ టీమ్‌కు పోలీసులు, పారామిలటరీ బలగాలు సెక్యూరిటీ కల్పించాయి.

## మావో అగ్రనేత హిడ్మా హతం

### - ఎదురుకాల్పుల్లో మరో ఐదుగురి మృతి

### - మూడు జిల్లాల్లో 31 మంది అరెస్టు



అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు – మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు, భీకర గెరిల్లా దాడులకు వ్యూహకర్తగా పేరొందిన మద్వి హిడ్మా అలియాస్ సంతోష్ మృతిచెందాడు. ఆయనతో పాటు భార్య రాజే, అనుచరులు మల్లా, దేవే, సురేష్, టెక్ శంకర్ హతమయ్యారు. నవంబరు 30లోపు హిడ్మా ఆటకట్టిం చాలని భద్రతా బలగాలను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆదేశించి నట్లు సమాచారం. విధించిన డెడ్‌లైన్ కంటే ముందే హిడ్మా ఎదురుకాల్పుల్లో మృతిచెందాడు.ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలపై సమాచారం నేపథ్యంలో కూంబింగ్ నిర్వహించినట్లు ఏపీ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా చెప్పారు. మరోవైపు కృష్ణా, విజయవాడ, కాకినాడలో 31 మంది మావో యిస్టులను అరెస్టు చేసినట్లు ఇంటెలిజెన్స్ ఏడీజీ మహేష్‌చంద్ర లడ్హా తెలిపారు.

## ఓటర్ల జాబితా అవకతవలపై సవాలు చేయండి

### రాష్ట్రాల నేతలకు కాంగ్రెస్ దిశానిర్దేశం




న్యూఢిల్లీ: ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతున్న రాష్ట్రా లు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల ముసాయిదా జాబితాలో ఎలాంటి అవకతవకలు జరిగినా దానిని వెంటనే పార్టీ నేతలు సవాలు చేయాలని కాంగ్రెస్ కోరింది. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన సమావేశంలో 12 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల పార్టీ నేతలు, వర్కింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) కేసీ వేణుగోపాల్ పాల్గొన్నారు. ఎస్ఐఆర్, ఓట్ చోరీకి వ్యతిరేకంగా ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో డిసెంబర్ ప్రథమా ర్థంలో ర్యాలీ నిర్వహించాలని కూడా కాంగ్రెస్ నిర్ణ యించింది. కాంగ్రెస్ వర్గాల సమాచారం ప్రకారం, ఎస్ఐఆర్ పూర్తి భిన్నమైన స్వభావం కలిగి ఉందని, గతంలో ఈ ప్రక్రియ చేపట్టినప్పుడు తీసుకున్న సమయంతో పోల్చుకుంటే చాలా తక్కువ వ్యవధిలో పూర్తిచేయాలనే ఆరాటమే కనిపిస్తోందని మెజారిటీ నేతలు సమావేశంలో అభిప్రాయపడ్డారు. తగినంత మంది బూత్ స్థాయి ఏజెంట్లను ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇచ్చినట్టు రాష్ట్రాల నేతలు పార్టీ అధిష్ఠానానికి వివరించారు. దీనిపై కేంద్ర నాయకులు స్పందిస్తూ, ముసాయిదా జాబితా నుంచి ఉద్దేశపూర్వకంగా ఎవర్నైనా తొలగించినా, బోగస్ ఓటర్లను చేర్చినా వెంటనే అభ్యంతరాలు లేవనెత్తాలని పార్టీ కార్యకర్తల కు దిశానిర్దేశం చేసింది. బిహార్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యంతరాలను నమోదు చేయకపోవడం వల్లే ఓట ర్ల జాబితా సరిగానే ఉందని, పార్టీలు ఎలాంటి అభ్యంతరాలు చెప్పలేదని ఎన్నికల కమిషన్ ప్రకటిం చుకున్నట్టు పేర్కొంది. బీహార్ తరహాలో కాకుండా ఈసారి ముసాయిదా జాబితాలో ఎలాంటి అవకతవకలు కనిపించినా లీగల్ టీమ్‌ల సాయంతో అభ్యంతరాలు తెలియజేయాలని, ఫైనల్ లిస్ట్ తర్వాత కూడా అప్పీల్స్ చేయాలని పార్టీ కేంద్ర నాయకులు సూచనలు చేశారు. రాహుల్ గాంధీ మాట్లాడు తూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఎస్ఐఆర్ ఎక్సర్‌సైజ్‌పై మానిటర్ చేసే మెకానిజం ఉన్నా చిన్న పార్టీలకు ఆ అవకాశం లేకపోవడాన్ని ప్రశ్నించారు.

ఏ ఒక్కరూ ఓటు కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత ఈసీపై ఉందని, దాన్ని పార్టీల మీద నెట్టేయకూడదని అన్నారు. బీజేపీ షాడోలో ఈసీ పనిచేయరాదని, ఓట్ల చోరీకి ఎస్ఐఆర్ ప్రక్రియను ఆయుధంగా చేసుకోరాదని ఖర్గే అన్నారు. ఈ విషయంలో పార్టీ కార్యకర్తలు, బీఎల్ఏలు, జిల్లా, సిటీ, బ్లాక్ అధ్యక్షులు అప్రమ త్తంగా ఉండాలని, నిజమైన ఓటర్లను తొలగించడం, బోగస్ ఓట్లను చేర్చేందుకు చేసే ఎలాంటి ప్రయత్నం జరిగినా వెంటనే బయటపెట్టాలని సూచించారు.

# -హసీనాకు మరణ శిక్ష-



- బంగ్లాలో ఉద్రిక్త పరిస్థితులు
- ఇద్దరి మృతి.. పలువురికి గాయాలు
- హసీనా ప్రకటనలపై ప్రసార నిషేధం
- దేశవ్యాప్తంగా బంద్ పాటించిన అవామీ లీగ్

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు స్థానిక 'ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్' మరణ శిక్ష విధించిన విషయం తెలిసిందే. ఈ తీర్పును వ్యతిరేకిస్తూ.. హసీనా మద్దతుదారులు బంగ్లాదేశ్‌లో ఆందోళనలు చేపట్టారు. దీంతో దేశంలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అల్లర్లలో ఇద్దరు మృతిచెందగా.. పలువురు గాయపడినట్టు తెలుస్తోంది. ఢాకా సహా దేశంలోని పలు ప్రాంతాల్లో ఐసిటీ తీర్పునకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిస్తూ రెండు రోజులపాటు బంద్ ప్రకటిస్తున్నట్టు అవామీ లీగ్ ప్రకటించింది. దీంతో యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ఆయా ప్రాంతాల్లో పోలీసులను మోహరించింది. షేక్ హసీనా తండ్రి ముజిబుర్ రెహమాన్ ఇల్లు ఉన్న ధన్మోండి 32 సహా పలు ప్రాంతాల్లో హసీనా మద్దతుదారులు రహదారులను దిగ్బంధించి, ఇతర నివాసాలు, దుకాణాల పైకి రాళ్లు రువ్వడంతో వారిని చెదరగొట్టడానికి పోలీసులు సౌండ్ గ్రెనేడ్లు, టియర్ గ్యాస్‌ను ఉపయోగించాల్సి వచ్చిందని అధికారులు పేర్కొన్నారు. పోలీసులు నిరసనకారులపై లాఠీ ఛార్జీ చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.


**హసీనా ప్రకటనలు ప్రసారం చేయొద్దని మీడియాకు హెచ్చరికలు..**

పరారీలో ఉన్న షేక్ హసీనా సోషల్ మీడియా వేదికగా చేస్తున్న పోస్టులు, ప్రకటనలకు సంబంధించిన విషయాలను ప్రచారం చేయొద్దని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం అన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్, ఆన్‌లైన్ మీడియా సంస్థలను హెచ్చరించింది. దేశంలో శాంతిభద్రతల దృష్ట్యా హింస, నేర కార్యకలాపాలను ప్రేరేపించే హసీనా వ్యాఖ్యలను ప్రసారం చేయొద్దని తెలిపింది. ఇవి సైబర్ భద్రతా ఆర్డినెన్స్ నిబంధనల ఉల్లంఘనల కిందకు వస్తాయని హెచ్చరించింది. అటువంటి వార్తలు ప్రసారం చేసేవారికి రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తామంది.

విద్యార్థుల ఆందోళనలతో ప్రధాని పదవివీడిన షేక్ హసీనా.. గతేడాది ఆగస్టులో బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు వచ్చారు. నాటినుంచి ఢిల్లీలోని రహస్య ప్రదేశంలో నివసిస్తున్నారు. స్వదేశంలో ఆందోళనల సమయంలో మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారని ఆమెపై కేసులు నమోదయ్యాయి. వాటిని విచారించిన ఐసిటీ సోమవారం హసీనాను దోషిగా తేల్చింది. ఈ క్రమంలోనే ఆమెకు మరణ శిక్ష విధించింది. తీర్పును ఆమె ఖండించారు. ప్రజాస్వామ్య విరుద్ధంగా ఏర్పడిన ప్రభుత్వం కుట్రపూరితంగా తనకు శిక్షపడేలా చేసిందని విమర్శించారు. తనకు వ్యతిరేకంగా తీర్పు వచ్చినందుకు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని తన పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దీంతో అవామీ లీగ్ పార్టీ మంగళవారం దేశవ్యాప్తంగా బంద్ ప్రకటించింది.

# ఉగ్రవాదంపై రాజీలేని చర్యలు

## షాంఘై సమ్మిట్‌లో జైశంకర్ పిలుపు



ఉగ్రవాదం ఏరూపంలో ఉన్నా సహించకూడదని భారత విదేశాంగమంత్రి ఎస్ జైశంకర్ ప్రపంచదేశాలకు పిలుపునిచ్చారు. రష్యాలో షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సందేశమిచ్చారు. "ఉగ్రవాదం విషయంలో ఎలాంటి సమర్థింపు ఉండకూడదు. దానిని సహించకూడదు.. ఎదుర్కోవాలి. తన ప్రజలను ఉగ్రవాదం నుంచి రక్షించుకునే హక్కు భారత్‌కు ఉంది" అని జైశంకర్ స్పష్టంచేశారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం ఉమ్మడి ప్రాధాన్యంగా ఉండాలని, రాజీలేని చర్యలు తీసుకోవాలని సూచించారు. గతవారం ఢిల్లీలో ఎర్రకోట సమీపంలో కారులో పేలుడు సంభవించడంతో 13మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దానిని ఉగ్రచర్యగా పేర్కొన్న కేంద్రం.. దర్యాప్తును ఎన్ఐఏకు అప్పగించింది. ఈ నేపథ్యంలోనే మంత్రి స్పందన వచ్చింది.

మూడురోజుల పర్యటనలో భాగంగా జైశంకర్ రష్యాకు వెళ్లారు. ఎస్సీఓ సదస్సులో పాల్గొన్నారు. అంతకుముందు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్‌తో భేటీ అయ్యారు. ఇద్దరిమధ్య ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలు చర్చకు వచ్చాయని స్థానిక మీడియా సంస్థ వెల్లడించింది. ఇక వచ్చే నెల పుతిన్ భారత్‌లో పర్యటించనున్న సంగతి తెలిసిందే. ప్రతిఏటా రెండుదేశాల మధ్య జరిగే శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు ఆయన మన దేశానికి వస్తున్నారు. 2021 తర్వాత పుతిన్ భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి.

# భారతీయులకు ఇరాన్ షాక్

## - ఇకపై వీసా ఫ్రీ ఎంట్రీ రద్దు






వీసాలేకుండా తమ దేశంలోకి ప్రవేశించేందుకు భారతీయులకు కల్పించిన సదుపాయాన్ని ఇరాన్ ప్రభుత్వం నిలిపివేసింది. ఈ వీసా-ఫ్రీ ఎంట్రీని నవంబర్ 22నుంచి రద్దు చేస్తున్నట్టు ఇరాన్ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. సాధారణ పాస్‌పోర్టులు కలిగిన భారతీయులు అందరూ ఇకపై ఇరాన్‌లోకి ప్రవేశించాలన్నా, ప్రయాణించాలన్నా తప్పనిసరిగా వీసా తీసుకోవాల్సి ఉంటుంది. ఇటీవలి కాలంలో భారతీయ పౌరులు ఎక్కువగా మోసపోతున్నారని, ముఖ్యంగా ఈ వీసా రద్దు సదుపాయాన్ని దుర్వినియోగం చేస్తూ పలువురు వీరిని నేరపూరిత కార్యకలాపాల కోసం వాడుకుంటున్నట్టు వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఇరాన్ ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

**ఉద్యోగ మోసాలు, కిడ్నాప్ ప్రమాదాలు..**

భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఈ విషయంపై స్పందిస్తూ.. కొందరు ఏజెంట్లు ఉద్యోగాల పేరుతో పలువురు భారతీయ పౌరులను ఇతర దేశాలకు పంపిస్తానని హామీలిస్తూ ఇరాన్ పంపించినట్టు తమ దృష్టికి వచ్చిందని తెలిపింది. వీసా ఫ్రీ సదుపాయాన్ని అడ్డం పెట్టుకుని ఇరాన్‌కు చేరుకున్న అనేకమంది భారతీయులు అక్కడ కిడ్నాప్‌లకు గురై, పెద్దఎత్తున డబ్బుల కోసం డిమాండ్లు ఎదుర్కొన్నట్టు ఎంఈఏ వెల్లడించింది. ఈ మానవ అక్రమ రవాణా బాధితులుగా మారుతున్న భారతీయ భద్రతను దృష్టిలో ఉంచుకుని.. ఈ సదుపాయం దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ఇరాన్ సర్కారు ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.

# రఫేల్ కొనుగోలుకు రెడీ

## ఆసక్తత పత్రాలపై ఫ్రాన్స్, ఉక్రెయిన్ సంతకాలు



రష్యాతో యుద్ధంలో పైచేయి సాధించేందుకు పాశ్చాత్య దేశాలనుంచి అత్యాధునిక ఆయుధాలు కోరుతున్న ఉక్రెయిన్ తాజాగా ఫ్రాన్స్ నుంచి 100 రఫేల్ యుద్ధ విమానాలు కొనుగోలు చేయనుంది. ఈమేరకు రఫేల్ విమానాల కొనుగోలుకు సంబంధించి ఫ్రాన్స్‌లో ఇరుదేశాలు ఒక ఆసక్తత పత్రంపై సంతకాలు చేసినట్టు పారిస్‌లోని ఉక్రెయిన్ దౌత్య కార్యాలయం, ఫ్రాన్స్ అధ్యక్ష కార్యాలయం ధ్రువీకరించాయి. ఈ పత్రంపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్స్కీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయెల్ మెక్రాన్లు సోమవారం సంతకాలు చేశారు. ఫ్రాన్స్‌నుంచి ఉక్రెయిన్ అత్యాధునిక ఆయుధ సంపత్తి సమకూర్చుకునేందుకు నిశ్చయంతో ఉందని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ కార్యాలయం తెలిపింది. ఇందులో భాగంగానే రఫేల్ జెట్ విమానాలను కూడా కొనుగోలు చేయాలని భావిస్తున్నట్టు ఆ కార్యాలయం పేర్కొంది. ఈ విషయంపై మరే వివరాలూ తెలియజేయలేదు. ఉక్రెయిన్‌పై రష్యా దాడి ప్రారంభించాక జెలెన్ స్కీ ఫ్రాన్స్ సందర్శించడం ఇది తొమ్మిదోసారి.

# వాట్సాప్‌లో ప్రభుత్వ వ్యతిరేక మెసేజ్

## 65ఏళ్ల వైద్యురాలికి 30ఏళ్ల జైలు

వెనిజువెలాలో అధ్యక్షుడు నికోలస్ మదురో ప్రభుత్వాన్ని విమర్శించే వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్న తీరుకు నిదర్శనంగా ఒక దిగ్భ్రాంతికరమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. మార్థి ఒరోజ్‌కో అనే 65 ఏళ్ల మహిళా వైద్యురాలు.. ఇటీవలే వాట్సాప్ ద్వారా ప్రభుత్వాన్ని విమర్శించింది. మదురో సర్కారును తిడుతూ.. ఆడియో మెసేజీ పంపినందుకు గాను కోర్టు ఆమెకు 30 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఒక్క మెసేజీతో ఇంత పెద్ద శిక్ష పడడంతో ఈ విషయం కాస్తా అంతర్జాతీయంగా సంచలనంగా మారింది.

**అసలేం జరిగిందంటే..?**

డా. మార్థి ఒరోజ్‌కో ప్రభుత్వానికి వ్యతిరేకంగా సందేశం పంపారని ఆమెపై కమ్యూనిటీ నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమెపై రాజద్రోహం, విద్వేషాన్ని ప్రేరేపించడం, కుట్రకు పాల్పడటంవంటి తీవ్ర అభియోగాలను మోపుతూ కేసు నమోదు చేశారు. ఈ అభియోగాలను నిర్ధారిస్తూ కోర్టు తాజాగా తీర్పు వెలువరించింది. అయితే డాక్టర్ ఒరోజ్కో ఏవిధమైన సందేశాన్ని, ఎవరికి పంపారు అనే వివరాలను ప్రభుత్వంగానీ, కోర్టుగానీ స్పష్టంగా వెల్లడించలేదు. కానీ ఆమె చేసిన తప్పుకుగాను 30 ఏళ్ల జైలుశిక్ష విధిస్తున్నట్టు వెల్లడించింది.

## కొండ చరియలు విరిగిపడి

# వియత్నాంలో ఆర్గురి మృతి

వియత్నాం ఆర్థిక రాజధాని హో చి మిన్‌లో భారీ వర్షాలకు పర్వతమార్గంలో ప్రయాణిస్తున్న బస్సుపై కొండచరియలు విరిగిపడి ఆరుగురు మృతి చెందినట్టు స్థానిక మీడియా పేర్కొంది. మరో 19మంది గాయపడ్డారు. హో చి మిన్ సిటీనుంచి 32 మంది ప్రయాణికులతో బయలుదేరిన బస్సు తీరప్రాంత నగరమైన నా ట్రంగాకు వెళ్తుండగా ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. సెంట్రల్ హైల్యాండ్స్‌లోని ఖాన్ లె పాస్ గుండా పర్వతమార్గంలో ప్రయాణిస్తుండగా కొండచరియలు విరిగిపడి బస్సు ముందు భాగాన్ని ఢీకొట్టాయి. ఈ ఘటనలో ఆరుగురు మరణించారు. క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రికి తరలించారు.

# గిల్ అనుమానమే.. రెండో టెస్ట్‌కు పంత్ సారథ్యం?

సౌతాఫ్రికాతో రెండో టెస్ట్‌లో టీమిండియాకు వికెట్ కీపర్, బ్యాటర్ రిషబ్ పంత్ నాయకత్వం వహించనున్నట్లు తెలుస్తోంది. భారత్, సౌతాఫ్రికా మధ్య నవంబర్ 22 నుంచి రెండో టెస్టు మొదలుకానుంది. ఈ మ్యాచ్‌కు గువాహటిలోని బర్సపరా స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. ఈ మైదానంలో టెస్టు మ్యాచ్ జరగడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఇప్పటికే కోల్‌కతాలో జరిగిన తొలి మ్యాచ్లో ఓడిన టీమిండియాకు గువాహటి టెస్టు చాలా కీలకమైనది. ఈ మ్యాచ్ లో భారత్ ఓడితే సఫారీలు చరిత్ర సృష్టిస్తారు. ఎందుకంటే 25 సంవత్సరాల తర్వాత ఆ జట్టు భారత్‌పై టెస్టు సిరీస్ సాధించినట్లవుతుంది. ఈ ప్రమాదం తప్పాలంటే టీమిండియా గట్టిగా పోరాడక తప్పదు. అయితే, భారత జట్టును ఓ సమస్య కలవరపెడుతోంది. తొలి టెస్టులో మెడ నొప్పి కారణంగా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఆట మధ్యలోనే మైదానాన్ని వీడాడు. మెడ కండరం పట్టేయడంతో నొప్పితో గిల్ విలవిల్లాడాడు. ఫిజియో వచ్చి పరీక్షించినా, బ్యాటింగ్ కొనసాగించలేకపోవడంతో మైదానం నుంచి వెళ్లిపోయాడు. అతడు మొత్తంగా మూడు బంతులే ఎదుర్కొన్నాడు. తర్వాత అతడు మొదటి ఇన్నింగ్స్ పాటు, రెండో ఇన్నింగ్స్‌లోనూ బ్యాటింగ్‌కు రాలేదు. టీమిండియా విజయావకాశాలను గిల్ గాయం కూడా దెబ్బ తీసింది. అయితే గాయపడిన రోజు రాత్రి అతన్ని ఆసుపత్రిలో ఐసీయూలో ఉంచి పరీక్షలు చేశారు. నిద్రలేమి వల్ల గిల్ మెడ కండరం పట్టేసిందని టీమ్ ఇండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ వివరించాడు. అయితే గిల్ ఇంకా గాయం నుంచి పూర్తిగా కోలుకోలేదని తెలుస్తోంది.

గువాహటి చేరుకున్న టీమిండియా క్రికెటర్లు ఇప్పటికే తమ ప్రాక్టీస్ ప్రారంభించారు. అయితే ఈ సెషన్‌లో శుభ్‌మన్ గిల్ పాల్గొనలేదు. దీంతో



అతడు రెండో టెస్ట్ మ్యాచ్‌లోనూ ఆడేది అనుమానంగానే ఉంది. అయితే అసలు అతడు జట్టుతో కలిసి గువాహటికి కూడా రాలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రిషబ్ పంత్ రెండో టెస్ట్‌లో భారత్‌కు సారథ్య బాధ్యతలు వహించే అవకాశముంది. అయితే ఈ విషయమై ఇప్పటి వరకైతే బీసీసీఐ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. టీమ్ ఇండియా యువ క్రికెటర్లు ధ్రువ్ జురేల్, ఆకాశ్ దీప్, వాషింగ్టన్ సుందర్, సాయిసుదర్శన్, తదితరులు రెండో టెస్ట్ నేపథ్యంలో ప్రాక్టీస్ సెషన్లో శ్రమించారు.

***నాలుగో స్థానంలో ఎవరు?***

మరి గిల్ ఆడకపోతే నాలుగో స్థానంలో ఎవరు ఆడతారనే ఆసక్తికరంగా మారింది. గిల్ మ్యాచ్‌కు దూరమైతే తుది జట్టులోకి తీసుకోవడానికి ఇద్దరు బ్యాటర్లు సాయి సుదర్శన్, దేవత్ పడిక్కల్ మాత్రమే అందుబాటులో ఉన్నారు. కానీ, వీరిద్దరూ ఎడమ చేతివాటం బ్యాటర్లే కావడం సమస్యగా మారింది. సుదర్శన్, పడిక్కల్‌ల్లో ఎవరిని తీసుకున్నా తుది జట్టులో ఏడుగురు ఎడమ చేతివాటం బ్యాటర్లవుతారు. కోల్‌కతా టెస్టులో భారత్ ఆరుగురు లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లతో బరిలోకి దిగింది. ఇప్పుడు ఏడుగురు ఎడమచేతివాటం బ్యాటర్లతో ఆడితే సఫారీలకు అడ్వాంటేజ్‌గా మారుతుంది. ఎందుకంటే తొలి టెస్టులో సౌతాఫ్రికా స్పిన్నర్ సైమన్ హర్మర్ భారత బ్యాటర్లకు చుక్కలు చూపించాడు. అతను మ్యాచ్‌లో ఎనిమిది వికెట్లు పడగొడితే అందులో ఆరు లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లవే పార్టమ్ స్పిన్నర్ మార్క్రమ్ కూడా ఒక ఎడమ చేతి వాటం బ్యాటర్‌ను ఔట్ చేశాడు. ఈ సమస్యకు పరిష్కారం లభించాలంటే కోల్‌కతా టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో మాదిరిగా ధ్రువ్ జురెల్‌ను నాలుగో స్థానంలో పంపి ఆల్రౌండర్ నితీశ్ రెడ్డిని తిరిగి జట్టులో చేర్చుకోవాలి. అప్పుడు లోయర్ ఆర్డర్లో జురెల్ స్థానాన్ని నితీశ్ భర్తీ చేస్తాడు. భారత్-ఏ, సౌతాఫ్రికా-ఏ మధ్య మూడు అనధికార వన్డేల కోసం రాజ్‌కోట్ వెళ్లిన నితీశ్ త్వరలో టీమ్ ఇండియాతో కలుస్తాడని తెలుస్తోంది. నాలుగో స్థానం బ్యాటర్ కోసం అభిమన్యు ఈశ్వరన్, సర్ఫరాజ్ ఖాన్, రుతురాజ్ గైక్వాడ్, కరుణ్ నాయంలను కూడా పరిశీలించొచ్చు. కానీ, అభిమన్యు, సర్ఫరాజ్ ఇటీవల కాలంలో దేశవాళీ క్రికెట్లో పెద్దగా స్కోర్లు చేయలేదు. రుతురాజ్ మాత్రం మంచి ఫాంలో ఉన్నాడు. అతను సెప్టెంబరు నుంచి ఎనిమిది ఫస్ట్-క్లాస్ మ్యాచ్లు ఆడి రెండు సెంచరీలు, రెండు అర్ధ శతకాలు సాధించాడు. ప్రస్తుతం సౌతాఫ్రికా-ఏతో జరుగుతున్న అనధికార వన్డే సిరీస్‌లో గైక్వాడ్ 117, 68 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మ్యాచ్‌కు ఇంకా మూడ్రోజులే సమయం ఉండటంతో మేనేజ్‌మెంట్ ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.



## బంగ్లాతో మహిళల సిరీస్ రద్దు?

భారత్, బంగ్లాదేశ్ మహిళా క్రికెట్ జట్ల మధ్య డిసెంబర్ నెలలో జరగాల్సిన పరిమిత ఓవర్ల సిరీస్ (3 వన్డేలు, 3 టీ20లు) రద్దయినట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు మరణ శిక్ష నేపథ్యంలో ఇరు దేశాల సంబంధాల్లో ప్రతిష్టంభన నెలకొంది. ఆమెను తమ దేశానికి అప్పగించాలంటూ భారత్‌కు బంగ్లా ప్రభుత్వం లేఖ రాసింది. ఈ అంశంపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో సిరీస్‌ను వాయిదా వేసినట్లు సమాచారం. ఇరు దేశాల మధ్య పెరుగుతున్న రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఈ సిరీస్‌కు అనుమతి లభించలేదని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. ఐసీసీ ఫ్యూచర్ టూర్స్ ప్రోగ్రాంలో భాగంగా వచ్చే నెలలో బంగ్లాదేశ్ మహిళల జట్టు భారత పర్యటనకు వచ్చి మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడాల్సి ఉంది. కోల్‌కతా, కటక్‌ల్లో మ్యాచ్‌లు నిర్వహించాలని భావించారు. మ్యాచ్‌ల తేదీలు ఇంకా ఖరారు చేయలేదు. అయితే ఈ లోపే సిరీస్ రద్దు నిర్ణయం వెలువడిందని ఓ ప్రముఖ జాతీయ వార్తా సంస్థ వెల్లడించింది. ఈ సిరీస్ జరగాల్సిన సమయంలో ప్రత్యామ్నాయ సిరీస్‌కు బీసీసీఐ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. మేం డిసెంబరులో ప్రత్యామ్నాయ సిరీస్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తాం. అందు కోసం వేరే బోర్డులతో సంప్రదింపులు జరుపుతున్నాం. బంగ్లాదేశ్‌తో సిరీస్ ప్రస్తుతానికి నిలిచిపోయినట్లేనని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. జనవరి మొదటి వారంలో భారత్‌లో మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ప్రారంభమవుతుంది. డబ్ల్యూపీఎల్ తర్వాత భారత మహిళా జట్టు ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లాల్సి ఉంది.

అలానే కొద్ది రోజుల కిందట పురుషుల క్రికెట్‌లో కూడా భారత్, బంగ్లాదేశ్ జట్ల మధ్య జరగాల్సిన సిరీస్ వాయిదా పడింది. ఆగస్టులో భారత జట్టు పరిమిత ఓవర్ల సిరీస్ కోసం బంగ్లాదేశ్‌లో పర్యటించాల్సి ఉంది. అయితే బిజీ షెడ్యూల్ కారణంగా ఆ సిరీస్‌ను 2026 సెప్టెంబర్‌కు మార్చారు. మొత్తంగా మహిళల సిరీస్ రద్దుకావడంతో బంగ్లాదేశ్‌కు బిగ్ షాక్ తగిలినట్లే అని క్రీడా నిపుణులు చెబుతున్నారు.

బంగ్లాదేశ్‌లో విద్యార్థుల ఆందోళనల కారణంగా ప్రధాని పదవి వీడిన షేక్ హసీనా.. గతేడాది ఆగస్టులో బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు వచ్చారు. నాటినుంచి ఢిల్లీలోని ఓ రహస్య ప్రదేశంలో నివసిస్తున్నారు.

### డబ్ల్యూటీసీ ఫైనల్ చేరాలంటే..

# ఇకపై ప్రతి మ్యాచ్ కీలకమే!



కోల్‌కతా టెస్ట్ మ్యాచ్ ఓటమితో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో నాలుగో స్థానానికి పడిపోయిన టీమిండియా.. ప్రస్తుత వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్లో ఫైనల్‌కు అర్హత సాధించాలంటే.. ఇకపై టీమ్ ఇండియాకు ప్రతి మ్యాచూ కీలకమే. ఈ సైకిల్‌లో 18 మ్యాచుల్లో ఇప్పటికే టీమిండియా ఇప్పటికే 8 టెస్టు ఆడేసింది. డబ్ల్యూటీసీ 2025-27 సైకిల్‌లో ఇప్పటివరకు ఏ జట్టూ ఇన్ని మ్యాచ్‌లు ఆడలేదు. మ్యాచ్‌ల పరంగా భారత జట్టు తర్వాత ఇంగ్లాండ్ (5) ఉంది. అయితే గిల్ సేన ఎక్కువ మ్యాచులైతే ఆడింది. కానీ.. వీటిలో కేవలం నాలుగింట్లో మాత్రమే విజేతగా నిలిచింది. మూడింట్లో ఓడి, ఒక మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. ఇక చేతిలో మరో 10 మ్యాచ్‌లు మాత్రమే ఉన్నాయి.

సంతోషకరమైన విషయం ఏంటంటే.. ఇప్పటికైతే టీమ్ ఇండియా ఆశలు ఇంకా సజీవంగానే ఉన్నాయి. కానీ ఇకపై ప్రతి మ్యాచూ కీలకమే. కచ్చితంగా చెమటోడ్చాల్సిందే. ప్రస్తుతం భారత జట్టు నాలుగో స్థానంలో ఉంది. మనకంటే ముందు శ్రీలంక, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా ఉన్నాయి. టీమ్ ఇండియా పాయింట్స్ పర్సంటేజ్ ప్రస్తుతం 54.17 గానే ఉంది. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు అర్హత సాధించాలంటే కనీసం 64 నుంచి 68 శాతంగానైనా ఉండాలి.

**తప్పని కఠిన సవాళ్లు..**

టీమ్ ఇండియా డబ్ల్యూటీసీ 2025-27లో ఇంకా.. దక్షిణాఫ్రికాతో 1, శ్రీలంకతో 2, న్యూజిలాండ్‌లో 2, ఆస్ట్రేలియాతో 5టెస్టులు ఆడాల్సి ఉంది. వీటిలో 6టెస్టులు (దక్షిణాఫ్రి కాతో 1, ఆస్ట్రేలియాతో 5) స్వదేశం లో ఆడాల్సి ఉంది. ఒకప్పుడు సొంత గడ్డపై టెస్టులు అంటే పెద్దగా ఆందో ళన పడాల్సిన అవసరం ఉండేది కాదు. కానీ.. న్యూజిలాండ్ చేతిలో వైట్ వాష్, తాజాగా కోల్‌కతా టెస్టో దక్షిణాఫ్రికాపై ఓటమి నేపథ్యంలో పరిస్థి తులు పూర్తిగా మారాయి. దీంతో గిల్ సేన ముందు కఠిన సవాళ్లున్నాయి.

ఈ పది మ్యాచుల్లో అన్నింట్లోనూ విజయం సాధిస్తే టీమ్ ఇండియా 172 పాయింట్లు, 79.63 పాయింట్ల పర్సంటేజ్ సొంతం చేసుకుంటుంది.

**9 గెలిస్తే.. పాయింట్లు 160, పాయింట్ల పర్సంటేజ్ 74.07**
**8 గెలిస్తే.. పాయింట్లు 148, పాయింట్ల పర్సంటేజ్ 68.52**
**7 గెలిస్తే.. పాయింట్లు 136, పాయింట్ల పర్సంటేజ్ 62.96**
**6 గెలిస్తే.. పాయింట్లు 124, పాయింట్ల పర్సంటేజ్ 57.41**
**5 గెలిస్తే.. పాయింట్లు 112, పాయింట్ల పర్సంటేజ్ 51.85**

ఈ లెక్కన ఈ పది మ్యాచుల్లో కనీసం 8 మ్యాచులు గెలిస్తేనే టీమ్ ఇండియా డబ్ల్యూటీసీ ఫైనలుకు అర్హత సాధించే అవకాశముంది. గత రికార్డులు పరిశీలిస్తే పాయింట్ల పర్సంటేజ్ కనిష్ఠంగా.. దాదాపు 65 కంటే ఎక్కువ ఉంటేనే ఆయా జట్లు ఫైనల్‌కు అర్హత సాధించాయి.

# నాకు చెప్పినట్లుగానే పిచ్‌ను రూపొందించా..



124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేక స్వదేశంలో టీమిండియా మ్యాచ్ ఓడిపోయింది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా సౌతాఫ్రికాపై టీమిండియా 30 పరుగుల తేడాతో ఓటమిని చవి చూసింది. దీంతో కోల్‌కతా పిచ్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే ఈ పిచ్.. పూర్తిగా బౌలర్ల పక్షం వైపు మారడంపై క్రికెట్ మాజీల నుంచి అభిమానుల వరకు విమర్శలు గుప్పించారు. ఇన్ని విమర్శల నడుమ ఎట్టకేలకు పిచ్ క్యురేటర్ సుజన్ ముఖర్జీ స్పందించాడు. ఈడెన్ గార్డెన్స్ మరీ నాసిరకంగా ఏం లేదు. అందరూ పిచ్‌పై విమర్శల వర్షం కురిపిస్తున్నారు. నిజాయతీగా చెప్పాలంటే టెస్ట్ మ్యాచ్ కోసం ఎలాంటి పిచ్ తయారు చేయాలో నాకు బాగా తెలుసు. భారత జట్టు మేనేజ్‌మెంట్ కోరుకున్నట్లుగానే పిచ్ రూపొందించా. వాళ్లు చెప్పినదానినే నేను పాటించా. ఇతరుల విమర్శలు, వ్యాఖ్యలను నేను పట్టించుకోను. అందరికీ అన్నీ తెలియవు. నేను నా పనిని పూర్తి అంకితభావంతో చేశా. భవిష్యత్తులోనూ ఇదే కొనసాగిస్తా అని ముఖర్జీ వెల్లడించాడు.

**అతడిని తప్పు పట్టలేం..**

క్యురేటర్ ముఖర్జీకి బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ కూడా మద్దతుగా నిలిచాడు. భారత శిబిరం ఎలాంటి పిచ్‌ను కోరుకుందో అలాంటిదే రూపొందించాం. పిచ్‌పై మ్యాచ్‌కు ముందు నాలుగు రోజులు వాటరింగ్ చేయలేదు. అందుకే అది ఇలా స్పందించింది. ఈ విషయంలో క్యురేటర్ ముఖర్జీని తప్పు పట్టలేమని గంగూలీ స్పష్టం చేశాడు. మరోవైపు టీమిండియా హెడ్ కోచ్ గంభీర్ కూడా దీనిపై మాట్లాడిన విషయం తెలిసిందే. 'మా సూచనల మేరకు ఈడెన్ గార్డెన్స్ పిచ్‌ను సిద్ధం చేశారు. ఇది బ్యాటర్లకు మరీ అంత కఠినమైన పిచ్ ఏమీ కాదు. ఓపిగ్గా ఆడితే పరుగులు వచ్చేవని పేర్కొన్నాడు.

# 'ఆ సంతకం ఫోర్జరీ'



ఆస్తి వివాదంతో బాలీవుడ్ నటి కరిష్మా కపూర్ కుటుంబం కొన్ని రోజులుగా హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. దాదాపు రూ.30వేల కోట్ల విలువైన తమ తండ్రి సంజయ్‌కపూర్ ఆస్తి విషయంలో సవతి తల్లి ప్రియా సచ్‌దేవ్ మోసం చేశారంటూ కరిష్మా పిల్లలు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఇప్పుడు తన తండ్రి వీలునామాలో ఉన్న సంతకం నకిలీదంటూ ఢిల్లీ హైకోర్టులో మరో పిటిషన్ వేశారు. దీంతో మరోసారి వివాదం చర్చనీయాంశంగా మారింది. ప్రియా సచ్‌దేవ్ మరికొందరితో కలిసి నకిలీపత్రాలను సృష్టించారని, వీలునామాలో కూడా సంతకాలు ఫోర్జరీ చేశారని కరిష్మా పిల్లలు ఆరోపిస్తున్నారు. ఈ సంతకంపై పరిశీలన జరపాలని కోర్టును కోరారు. దీనిపై మూడు వారాల్లోగా వివరణ ఇవ్వాలని కోర్టు ప్రియా సచ్‌దేవ్‌ను ఆదేశించింది. ఈ కేసులో తదుపరి విచారణ డిసెంబర్ 16న జరగనుంది. మరోవైపు ప్రియా సచ్‌దేవ్ చూపుతోన్న వీలునామా కూడా నకిలీదేనని కరిష్మా పిల్లలు వేసిన పిటిషన్‌పైనా విచారణ కొనసాగుతోంది. సంజయ్‌కి చెందిన స్థిర, చరాస్తుల వివరాలను సమర్పించాలని ఆయన భార్య సచ్‌దేవ్‌ను ఇటీవల న్యాయస్థానం ఆదేశించింది. దీనికి సంబంధించిన విచారణ నవంబర్ 20న జరగనుంది.

# ఆ కథనాలు బాధపెట్టాయి

తమిళనాడులో మద్యం రిటైలర్ 'టాస్మాక్' కుంభకోణంలో తన పేరు ఉందంటూ వచ్చిన వార్తలు చూసి ఎంతగానో బాధపడ్డానని నటి కయాదు లోహర్ తెలిపారు. తనపై వచ్చిన రూమర్స్‌పై తాజాగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. తమిళనాడులో సంచలనమైన టాస్మాక్ కుంభకోణంలో భాగమైనవారు నిర్వహించిన ఓ పార్టీకి కయాదు లోహర్ హాజరయ్యారని, అందుకు ఆమె రూ. 35 లక్షలు తీసుకున్నారంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. దీన్ని ఆమె ఖండించారు. "ఇలాంటి వార్తలు వచ్చినప్పటికీ బాధపడకుండా ముందుకు సాగడం సులభమని ప్రజలు అనుకుంటారు. కానీ, అది చాలా కష్టం. ఆ వార్తలు చూసి నేనెంతో బాధపడ్డా. నా కలలను నెరవేర్చుకోవడం కోసం ఇండస్ట్రీలో కష్టపడుతూ ముందుకు సాగుతున్న సమయంలో ఇలాంటి ఆరోపణలు రావడం బాధించింది" అని తెలిపారు. ఇటీవల 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' సినిమాతో కయాదు లోహర్ తెలుగు ప్రేక్షకులనూ అలరించారు. ప్రస్తుతం విశ్వక్సేన్ సరసన 'ఫంకీ'లో నటిస్తున్నారు.



# 'జాజికాయ..' సాంగ్ ఇచ్చిన అఖండ-2



బాలకృష్ణ- డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్లో తెరకెక్కుతున్న సినిమా 'అఖండ 2'. ఇదే కాంబినేషన్‌లో గతంలో వచ్చిన హిట్ మూవీ 'అఖండ'కు సీక్వెల్‌గా రూపొందుతోంది. డిసెంబరు 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రచారంలో భాగంగా 'జాజికాయ జాజికాయ' పాట విడుదల వేడుకను విశాఖలోని జగదాంబ థియేటర్‌లో నిర్వహించారు. బాలకృష్ణ, బోయపాటి శ్రీను, హీరోయిన్ సంయుక్త తదితరులు హాజరయ్యారు.

# సక్సెస్‌పై నమ్మకంగా ఉన్నాం



అల్లరి నరేశ్ హీరోగా కొత్త దర్శకుడు నాని కాసరగడ్డ తెరకెక్కించిన చిత్రం '12ఏ రైల్వే కాలనీ'. కామాక్షి భాస్కర్ల హీరోయిన్. వైవా హర్ష, గెటప్ శ్రీను తదితరులు కీలక పాత్రలు పోషించారు. మూవీ 21న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. అల్లరి నరేశ్ మాట్లాడుతూ సినిమాపై నమ్మకముంటే భయం ఉండదన్నారు. చిత్రం విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తెలుగు అమ్మాయిలకు అవకాశాలు రాలేదంటారని.. వచ్చాక వేరే భాషలోకి వెళ్తున్నారని అల్లరి నరేశ్ వ్యాఖ్యానించారు. వేరే సినిమాల్లో అవకాశం వచ్చినా చేస్తూనే.. తెలుగు సినిమాను మాత్రం వదిలిపెట్టవద్దని హీరోయిన్ కామాక్షి భాస్కర్లకు సరదాగా హితోపదేశం చేశారు.

# ఆ రెంటికీ మించి డ్రాగన్

ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాపై సంగీత దర్శకుడు రవి బస్రూర్ ఆసక్తికర కామెంట్స్ చేశారు. కేజీఎఫ్, సలార్లకు మించి చిత్రం ఉంటుందన్నారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రవి మాట్లాడుతూ.. కేజీఎఫ్, సలార్ తర్వాత ప్రశాంత్‌నీల్‌తో కలిసి వర్క్ చేయడం ఎంతోఆనందంగా ఉందన్నారు. సొంత ఇంటికి వచ్చినట్టు అనిపిస్తుందన్నారు. "ప్రశాంత్‌నీల్‌తో నాకు ప్రత్యేక అనుబంధముంది. మేం తక్కువ మాట్లాడుకుంటాం.. ఎక్కువ వర్క్ చేస్తాం. ఎన్టీఆర్‌తో నీల్ తెరకెక్కిస్తున్న చిత్రం విజువల్స్‌తో పాటు సంగీతం కూడా భారీ స్థాయిలో ఉండనుంది. భావోద్వేగాలకు పెద్దపీట వేశారు. ప్రశాంత్‌నీల్ గత చిత్రాలు కేజీఎఫ్, సలార్‌కంటే మ్యూజిక్ చాలా భిన్నంగా ఉండనుంది. కొత్త సంగీత పరికరాలు ఉపయోగిస్తున్నాం. శక్తిమంతంగా ఉంటుంది. అందరూ ఆస్వాదిస్తారు" అని చెప్పారు. 'దేవర' తర్వాత ఎన్టీఆర్... 'సలార్' తర్వాత ప్రశాంత్ నీల్ చేస్తోన్న చిత్రమిది. ఎన్టీఆర్ సరసన ఇందులో రుక్మిణీ వసంత్ నటిస్తున్నారు. దీనికి 'డ్రాగన్' అనే పేరు పరిశీలనలో ఉందని ప్రచారం సాగుతోంది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న చిత్రంలో తారక్ మునుపెన్నడూ చేయని మాస్ పాత్రలో.. విభిన్నమైన లుక్‌తో కనిపించనున్నారు. ఇది వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 9న ప్రేక్షకుల ముందుకురానుంది.





# రాజమౌళిపై పోలీస్‌కు ఫిర్యాదు

అగ్ర దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళిపై సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. ఇటీవల జరిగిన గ్లోబ్‌ట్రాటర్ ఈవెంట్లో హనుమంతుడిపై ఆయన చేసిన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని రాష్ట్రీయ వానరసేన సంఘ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు. అసలేం జరిగిందంటే... మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రానున్న చిత్రం 'వారణాసి'. ఇటీవల సినిమా టైటిల్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. అయితే చిన్న సాంకేతిక లోపం తలెత్తడంతో ఈవెంట్‌కు కొంతసేపు అంతరాయం కలిగింది. దీంతో రాజమౌళి భావోద్వేగానికి గురయ్యారు. తనకు దేవుడిమీద నమ్మకం లేదన్నారు. మా నాన్న నా దగ్గరకు వచ్చి'హనుమంతుడు వెనక ఉండి నడిపిస్తాడు' అని చెప్పారు. ఇలా జరిగిన వెంటనే కోపం వచ్చింది. నా భార్యకు హనుమంతుడంటే చాలా ఇష్టం. ఆయనను తన స్నేహితుడిలా భావిస్తుంది. నా భార్య మీద కూడా కోపం వచ్చింది. ఇలానేనా ఆయన చేసేది అనిపించింది" అన్నారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

### పట్టాలెక్కనున్న 'జై హనుమాన్'

హీరో తేజ సజ్జ నటించిన సూపర్ హీరో సినిమా'హనుమాన్'. దర్శకుడు ప్రశాంత్‌వర్మ తెరకెక్కించిన సినిమాకి సీక్వెల్‌గా " జై హనుమాన్"ని అనౌన్స్ చేసిన సంగతితెలిసిందే.ఈ సినిమాని ఎప్పుడో అనౌన్స్ చేసినా..పరిస్థితులు అనుకూలించక ఆలస్యమవుతూ వస్తుంది. అలాగే కన్నడ స్టార్ హీరో రిషబ్‌శెట్టిది ప్రధాన పాత్ర కనుక.. ఆయన డేట్స్ లేకపోవడంవల్ల కూడా ఆలస్యమవుతూ వస్తోంది. తాజా అప్‌డేట్ ప్రకారం.. భారీ సినిమా పట్టాలెక్కేందుకు సిద్ధమైనట్టు టాక్. అంటే.. వచ్చే ఏడాది జనవరి నుంచి మొత్తం ఐదారు నెలలు ప్రశాంత్ వర్మకి రిషబ్ కాల్షీట్స్ఇచ్చారన్న టాక్ ఇండస్ట్రీలో గట్టిగా వినిపిస్తోంది. దీంతో 'జై హనుమాన్' కోసం చూస్తున్న ఫ్యాన్స్‌కి ఫైనల్‌గా ఇదొక సాలిడ్ న్యూస్ అనే చెప్పాలి.

# మహారాణి పాత్రలో నయనతార

వరుస సినిమాలతో బిజీగా ఉన్న లేడీ సూపర్ స్టార్ నయనతార.. తాజాగా మరో ప్రాజెక్ట్‌తో అలరించేందుకు సిద్ధమయ్యారు. అగ్ర కథానాయకుడు బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో సినిమా రానున్న విషయం తెలిసిందే. 'ఎన్‌బీకే 111'గా ఇది ప్రచారంలో ఉంది. తాజాగా ఈ సినిమా అప్డేట్‌ను టీమ్ పంచుకుంది. ఇందులో బాలకృష్ణ సరసన నయనతార నటించనున్నట్టు తెలుపుతూ ఒక వీడియోను విడుదల చేసింది. ఇందులో నయనతార మహారాణి పాత్రలో కనిపించనున్నట్టు నిర్మాణ సంస్థ వెల్లడించింది. 'సముద్రమంత ప్రశాంతతను, తుపానంత బీభత్సాన్ని తనలో మోసే రాణి మా సామ్రాజ్యంలోకి అడుగుపెట్టనుంది' అంటూ వీడియోతో నయనతారకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపింది. త్వరలోనే ఈ చిత్రం నుంచి మరిన్ని అప్డేట్స్ వస్తాయని వెల్లడించింది. నవంబర్ 26న సినిమా పూజా కార్యక్రమాలతో ప్రారంభం కాను న్నట్టు తెలిపింది. దీంతో బాలకృష్ణ అభిమానులు సంబరపడుతున్నారు. బాలకృష్ణ – నయనతార కాంబోలో ఇప్పటికి మూడు చిత్రాలు వచ్చి ఆకట్టుకున్నాయి. ఇది వీరి నాలుగో సినిమా కావడం విశేషం. గతంలో వీరిద్దరూ నటించిన 'సింహా', 'జైసింహా', 'శ్రీరామరాజ్యం' సినిమాలు హిట్‌గా నిలిచి అలరించాయి. ఇక గోపీచంద్ మలినేని– బాలకృష్ణ కాంబోలో గతంలో 'వీరసింహా రెడ్డి'వచ్చి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు మరోసారి ఈ కాంబో రిపీట్ కావడంతో ఆసక్తి నెలకొంది. చరిత్ర.. వర్తమానం మేళవింపుగా సాగే శక్తిమంతమైన యాక్షన్ డ్రామాలో బాలకృష్ణ రెండు భిన్న కోణాల్లో కనిపించనున్నట్టు తెలుస్తోంది.

